

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

నిజామాబాద్

: fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-7-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 163 పేజీలు: 10+4 వెల: 6.50



మహాగాయని జానకికి కన్నీటి వీడ్కోలు

వచ్చే మూడు రోజులు భారీ వర్ష సూచన 2




గల్ఫ్ దేశాలలోని అమెరికా బేస్‌లపై ఇరాన్ దాడులు

పశ్చిమా సియాలో మళ్లీ వార్ ఉధృతం 5




## హార్ముజ్ జలసంధి మళ్లీ క్లోజ్



# ఖరీఫ్‌కు కష్టకాలం!

## ఎల్ నినో దెబ్బకు రైతు కుదేలు

### బోసిపోతున్న పచ్చని పొలాలు.. 6.40 శాతానికే వరి నాట్లు

### అడుగంటిన భూగర్భ జలాలు.. ప్రాజెక్టుల్లో డెడ్‌స్టోరేజి

**హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** ఎల్‌నినో విసిరిన పంజాకురాష్ట్రంలో ఖరీఫ్ సాగు సీజను (వానాకాలం) ఆరం భమై 40 రోజులు గడిచినా ఆశించిన వర్షం కురవక పోవడంతో వ్యవసాయం కుదేలవుతోంది. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాలు బలహీనపడి రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెల కొన్నాయి. దీంతో వ్యవసాయ పనులతో కళకళలాడా ల్సి న పొలాలు బోసిపోయి, రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వ్యవసాయ పనుల్లో బిజీగా ఉం డాల్సి న రైతులు, సాగు లేక, కూలీలతో పాటు, ఖాళీగా ఉంటున్నారు. రాష్ట్రంలో ప్రధానపంట వరి ఇప్పటి వరకూ 6.40శాతం మేర 4,22,340 ఎకరాల్లో మాత్ర మే నాట్లు వేశారు. వరి, కంది, జొన్న, పెసర తదితర ఆహార పంటల సాగు 13.77 శాతానికే పరిమితమైంది. మొత్తంఆహార ధాన్యాలు 10,87,925 ఎకరాల్లో సాగ య్యాయి. వరంగల్ (0 ఎకరాలు), ఆదిలాబాద్ (135 ఎకరాలు), మంచిర్యాల (15 ఎకరాలు), నిర్మల్ (200 ఎకరాలు), భూపాలపల్లి (370 ఎకరాలు), వికారాబాద్ (0 ఎకరాలు), గద్వాల్ (25 ఎకరాలు), మల్కాజిగిరి (338 ఎకరాలు) మాత్రమే మొక్కుబడిగా నాట్లు పడ్డా యి. ఇక రాష్ట్రంలో గత నెలలో సాధారణం కంటే దాదా పు 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు సాధారణంగా 177.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 154.9మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. అంటే 13 శాతం లోటు వర్షపాతం. దీంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో సుమారు 65 లక్షల మంది చిన్న, సన్నకారు రైతులు, కూలీలు ఉన్నారు. వీరంతా వ్యవసాయమే ప్రధాన జీవ నాధారంగా బతుకుతున్నారు. సాధారణంగా రైతులు జూన్, జులై మాసాల్లో విత్తనాలు విత్తుకోవడం, వరి నాట్లు వేసుకోవడంలో తీరిక లేకుండా ఉంటారు. కానీ, ఈ ఏడాది వాతావరణ మార్పుల నేపథ్యంలో జూన్‌లో 12 శాతం, జులైలో 16 శాతం >>2

## నేటి నుంచి సింగరేణి

# భరోసా యాత్ర

### కాంగ్రెస్ వైఫల్యాలు ప్రజల్లోకి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ఆదివారం హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో పాదయత్ర చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై12:** కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో సింగరేణి భరోసా యాత్రను భారతీయ జనతా పార్టీ చేపట్టనుంది. ఈ నెల 13, 14 తేదీల్లో ఈ యాత్రను నిర్వహించనుంది. హైదరాబాద్ నుంచి కొత్తగూడెం వరకు ఈ యాత్ర సాగనుంది. తొలి రోజు కొత్తగూడెం, మణుగూరు, భూపాలపల్లిలో ఈ యాత్రను నిర్వహిస్తుంది. అందులో భాగంగా సింగరేణి కార్మికులను బీజేపీ నేతలు కలవనున్నారు. 14వ తేదీన భూపాలపల్లి కేటీకే 8 మైన్ వద్ద కార్మికులతో సమావేశం కానున్నారు. అక్కడి నుంచి తాడిచర్ల మైన్స్‌కు వారు చేరుకుంటారు. గోదావరి ఖని ఓపెన్ కాస్ట్ వద్ద కార్మికులతో బీజేపీ నేతలు భేటీ కానున్నారు. అనంతరం శ్రీరాంపూర్ 3 మైన్స్ విజిటింగ్‌తోపాటు కార్మికులతో వారంతా ఇంటరాక్షన్ అవుతారు. >>2



## 20 నుంచి వర్షాకాల పార్లమెంట్

### ముందు రోజు అఖిలపక్ష భేటీ

### సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం

**న్యూఢిల్లీ, జులై 12:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్నా యి.ఈ నేపథ్యంలో 19న, కేంద్రం తన శాసనపరమైన అజెండాపై ఏకాభిప్రాయం సాధించేందుకు, ఉభయ సభలలో కార్యకలాపాలు సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీల సహకారం కోరేందుకు అ ఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ప్రతి పార్ల మెంట్ సమావేశానికి >>2

# రైతుల కోసం రక్తం ధారపోస్తాం


### ప్రభుత్వం వెంటనే నీరు విడుదల చేయాలి: కెటిఆర్




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 12:** సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వ కుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైత న్నల కోసం నీళ్లు అడిగితే తమపై ఆరోపణలు చేస్తారా అని ధ్వజమెత్తారు. అన్నదాతలసమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ నిరక్ష్యం చేస్తోందని ఆగ్రహించారు. ఈమేరకు ఆదివారం ఎక్స్ వేదికగా కేటీఆర్ పోస్టు పెట్టారు. 60 ఏళ్లు పాలించిన కాం గ్రెస్ తెలంగాణ అభివృద్ధికి ఏం చేసిందని ప్రశ్నించారు. తెలం గాణ కోసం కొట్లాడిన పిల్లలను ఎన్‌కౌంటర్లు చేశారని దుయ్య బట్టారు. 1952లో ఏడుగురు యువకులను కాల్చిచంపింది కాం గ్రెస్ సర్కార్ కాదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. 1969లో 369 మంది తెలంగాణ ముద్దు బిడ్డలపై తూటాల వర్షం కురి పించి రక్తం పారించారని ఆరోపించారు. మలిదశ పోరాటంలో వేయిమందిని బలితీసుకున్నారని ఆరోపించారు.నీకు మా రక్తం ఎంత కావాలంటే అంత పంపిస్తాం కానీ >>2

## నేడు ఢిల్లీకి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై12:** సోమవారం మధ్యాహ్నం మంత్రి ఉత్తమ్‌కుమా ర్‌రెడ్డి ఢిల్లీ వెళ్లను న్నారు. కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌ను కలవనున్నారు. రాష్ట్రానికి సంబం ధించిన సాగునీటి అంశాలపై పాటిల్‌తో చర్చిస్తారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల విషయమై చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది.



ఆదివారం మైసూరులో జానకి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

## మహాగాయని జానకికి కన్నీటి వీడ్కోలు

### ప్రభుత్వ లాంఛనాలతో మైసూరులో అంత్యక్రియలు

**ఆమె వ్యవసాయక్షేత్రంలోనే అంతిమ సంస్కారం జరిపిన కుటుంబ సభ్యులు**

**మైసూరు,జులై 12:** ప్రముఖ గాయని, గాన కోకిల ఎస్. జానకి అంతిమ యాత్ర ముగిసింది. ఆదివారం ఆమె అంత్యక్రియలు కర్ణాటక ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో జరిగాయి. మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకాలోని ఆమె వ్యవసాయ క్షేత్రంలో కుటుంబ సభ్యులు, అభిమానుల అశ్రునయనాల మధ్య తుది సంస్కారాలు నిర్వహించారు. జానకమ్మ మనవరాలు అప్సర వైద్యుల తుది కర్మలు జరిపించారు. ఆమె అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు. జానకి కోరిక మేరకు కణియనహుండి లోని ఆమె ఫామ్‌హౌస్‌లో కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు జరిపించారు. తెలుగు బ్రాహ్మణ సంప్రదాయాల ప్రకారం జానకి అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మనవరాలు చితికి నిప్పంటించారు. అంతకుముందు, జానకమ్మ పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం మైసూరులోని మహారాజా కాలేజీ గ్రౌండ్స్‌లో ఉంచారు. తమ అభిమాన గాయనిని కడసారి చూసేందుకు అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖులు వేలాదిగా తరలివచ్చారు. భారతీయ సంగీతానికి ఆమె చేసిన సేవలను గౌరవిస్తూ, పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. వయో సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న 88 ఏళ్ల జానకి, శనివారం మైసూరులోని అపోలో ఆసుపత్రిలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆరు దశాబ్దాలకు పైగా సాగిన తన అద్భుత ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ సహా 20కి పైగా భాషల్లో 48వేలకు పైగా పాటలు పాడి ఆమె చరిత్ర సృష్టించారు. ఆమె విశిష్ట గాత్రానికి నాలుగు జాతీయ పురస్కారాలు కూడా లభించాయి. జానకి మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సంగీత దర్శకుడు ఇళయరాజా సహా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె భౌతికంగా దూరమైనా, తన గాత్రంతో ఎప్పటికీ జీవించే ఉంటారని అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు. జానకి అంతిమయాత్రలో సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

## సింగరేణి భరోసా యాత్ర

>> ఆపై మంచిర్యాలలో ఈ యాత్ర ముగియనుంది. రెండు రోజుల పాటు సాగే ఈ యాత్రలో 4 జిల్లాల్లో మూడు సభలు, ఐదు చోట్ల కార్మికులతో ముఖాముఖి, సమావేశాలను బీజేపీ నేతలు నిర్వహించనున్నారు. 41 వేల మంది సింగరేణి కార్మికులు, దాదాపు 30 వేలకు పైగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి భరోసా కల్పించడంలో భాగంగా బీజేపీ ఈ యాత్ర చేపడుతుంది. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, తెలంగాణ బీజేపీ చీఫ్ ఎన్. రామచందర్ రావుతోపాటు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ యాత్రలో పాల్గొనున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రెండు రోజుల పాటు సింగరేణి భరోసా యాత్ర చేపడుతున్నట్లు ప్రకటించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులతో రేవంత్‌రెడ్డికి రహస్య సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ఆదివారం అంబర్‌పేట నియోజకవర్గంలో నిర్వహించిన పాదయాత్ర అనంతరం కిషన్‌రెడ్డి పలు కీలక విషయాలు వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేసీఆర్ కుటుంబం నుంచి లక్ష కోట్ల రూపాయలు వసూలు చేస్తామని చెప్పారని, ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలు, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అవినీతి వ్యవహారాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి విచారణ సంస్థలు లేవా? లేక విచారణను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందా? అని నిలదీశారు. బీజేపీ ఎంపీలు, ప్రజాప్రతినిధులను విమర్శించే ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని కిషన్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ అభివృద్ధిపై కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని కిషన్ రెడ్డి విమర్శించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రతి శనివారం, ఆదివారం బస్తీల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నానని చెప్పారు.

## లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ముగ్గురు షూటర్ల అరెస్టు

**న్యూఢిల్లీ,జులై 12:** ఢిల్లీపరిధిలోని రోహిణి జిల్లా ప్రత్యేక పోలీసు దళం తాజాగా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన ముగ్గురు షూటర్లను అరెస్ట్ చేసింది. వారు ఢిల్లీలో ఓ హత్యకు కుట్ర చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన పక్కా సమాచారం ముందుగా అందడంతో రోహిణి జిల్లా స్పెషల్ స్టాఫ్ వీరి కదలికలపై నిఘా ఉంచి చివరకు అదుపులోకి తీసుకుంది. విదేశాల్లో ఉన్న నెట్‌వర్క్ ద్వారా ఈ షూటర్లకు ఆదేశాలు అందుతున్నాయని, వాటి ఆధారంగానే వీరు ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నారని సమాచారం. ఢిల్లీలో గతంలో జరిగిన పలు నేరాల్లో ఈ షూటర్లు నిందితులుగా ఉన్నారు. గతంలోనూ వీరు నిర్దేశిత లక్ష్యాలపై కాల్పులు జరిపిన ఘటనల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఇటీవలే అమెరికాలోనూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌పై అక్కడి దర్యాప్తు సంస్థలు గట్టి నిఘా పెట్టాయి. ఈనెల 7 నుంచి అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఈ ముఠాపై 'ఆపరేషన్ హార్డ్ బాల్' పేరుతో ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకున్నారు. లారెన్స్ బిష్ణోయ్ ముఠాతోపాటు అతడి ప్రధాన అనుచరులైన గోల్డీ బ్రార్, జగ్గూ భగవాన్‌పురియా నెట్‌వర్క్‌లను లక్ష్యంగా చేసుకుని ఈ చర్యలు చేపడుతున్నారు. అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ గోల్డీ బ్రార్‌పై కఠిన చర్యలకు సిద్ధమైంది. సతీందర్‌జీత్ సింగ్ అలియాస్ గోల్డీ బ్రార్ అరెస్టుకు అవసరమైన సమాచారం అందించిన వారికి 50 వేల డాలర్ల బహుమతిని అందజేస్తామని ప్రకటించింది. లారెన్స్ బిష్ణోయ్‌పై హత్య, హత్యాయత్నం, దోపిడీ, బెదిరింపులు వంటి అనేక కేసులు నమోదయ్యాయి. అతను జైల్లోనే ఉన్నప్పటికీ అక్కడి నుంచే తన నేర సామ్రాజ్యాన్ని నడిపిస్తున్నట్లు సమాచారం. అతడి గ్యాంగ్‌లో పెద్ద సంఖ్యలో షూటర్లు ఉన్నారు.

## వర్షాకాల పార్లమెంట్

>> ముందు నిర్వహించే ఈ సంప్రదాయ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టి, చర్చించాలనుకుంటున్న బిల్లుల గురించి ప్రభుత్వం వివిధ రాజకీయ పార్టీల నాయకులకు వివరించే అవకాశం ఉండగా, ప్రతిపక్షాలు తాము లేవనెత్తాలనుకుంటున్న అంశాలను వివరించే అవకాశం ఉంది. ఉభయ సభలను సమావేశపరచాలన్న ప్రభుత్వ సిఫార్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించిన తర్వాత, వర్షాకాల సమావేశాలు జులై 20 నుండి ఆగస్టు 13 వరకు జరగనున్నాయి. ఈ షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటిస్తూ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ఈ సమావేశాలు "జాతీయ ప్రాముఖ్యత గల అంశాలపై అర్థవంతమైన చర్చ, సంప్రదింపులు, నిర్ణయాలపై" దృష్టి సారిస్తాయని అన్నారు. ప్రభుత్వం పలు ముఖ్యమైన బిల్లులను పరిశీలనకు తీసుకురానుందని భావిస్తున్నారు. వాటిలో ప్రతిపాదిత 130వ రాజ్యాంగ సవరణ బిల్లు కూడా ఉంది. దీనిని ప్రస్తుతం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) పరిశీలిస్తోంది. ఈ కమిటీ జులై 17న తన నివేదికను ఆమోదించి, పార్లమెంటుకు సమర్పించనుంది. ఈ ప్రతిపాదిత సవరణ గణనీయమైన రాజకీయ చర్చకు దారితీసింది, ముఖ్యంగా తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర లేదా రాష్ట్ర మంత్రులు వరుసగా 30 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే వారిని పదవి నుండి స్వయంచాలకంగా తొలగించాలని నిర్దేశించే నిబంధనపై ఈ చర్చ జరుగుతోంది. ఈ సమావేశాలలో తీవ్రమైన రాజకీయ ఘర్షణలు కూడా చోటుచేసుకుంటాయని అంచనా. ప్రతిపక్ష పార్టీలు నీట్‌యుజి పేపర్ లీక్ ఆరోపణలను లేవనెత్తి, ఆపరేషన్ సింధూర్ సమయంలో జరిగిన ప్రాణనష్టంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై చర్చను కోరే అవకాశం ఉంది. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఇప్పటికే రక్షణ మంత్రికి వ్యతిరేకంగా హక్కుల ఉల్లంఘన నోటీసును జారీ చేసింది. ప్రతిపక్ష పార్టీలలో ఇటీవల చోటుచేసుకున్న మార్పులు రాజకీయ వేడిని మరింత పెంచుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత గందరగోళం నెలకొంది. పలువురు ఎంపీలు పార్టీ మారి, పార్లమెంటులో ప్రత్యేక గుర్తింపు కోరుతున్నారు. ఇటీవలి వారాల్లో శివసేన (యుబిటి), ఆమ్ ఆద్మీ పార్టీలలోకూడా ఫిరాయింపులు చోటుచేసుకున్నాయి. ఈ పరిణామాలు ఈసమావేశాల్లో ప్రతిపక్షాల వ్యూహాన్ని పునర్‌రూపకల్పన చేసే అవకాశం ఉంది. ఈవర్షాకాల సమావేశాలు తీవ్రమైన చర్చలు, రాజకీయ వాదోపవాదాలు ఉంటాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

## వారం - వర్జ్యం

13-07-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
చతుర్దశి సా. 6.50,
ఆరుద్ర రా. 2.52
వర్జ్యం : మ. 1.06-మ. 2.31
దు.మ. 12.38-మ. 1.30,
2) మ. 3.15-సా. 4.07
రాహుకాలం - ఉ. 7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** కోర్టుకేసుల పరిష్కార దశకు చేరుకుంటాయి. ఊహించని విధంగా ఉద్యోగావకాశాలు దరికి చేరుతాయి.

**వృషభం:** చేపట్టిన పనులు సాఫీగా సాగుతాయి. ప్రముఖులను కలుసుకొని ముఖ్య విషయాలపై చర్చిస్తారు.

**మిథునం:** అకాల భోజనం, ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం తగదు. కళారంగంలోని వారికి విదేశీ పర్యటనలు వుంటాయి.

**కర్కాటకం:** సంతానం పరంగా అభివృద్ధిని సాధిస్తారు. పోటీ పరీక్షలలో అతికష్టం మీద విజయం సాధిస్తారు. వాహనసౌఖ్యం.

**సింహం:** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఋణబాధలు తొలగుతాయి.

**కన్య :** సానుకూలంగా ఆలోచించి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోండి. బంధువుల కలయిక.

**తుల :** మధ్యవర్తిత్వాలు, పంచాయితీలు లాభించవు. దేవాలయ సందర్శన చేసుకుంటారు. స్పెక్యులేషన్ లాభిస్తుంది.

**వృశ్చికం:** సన్నిహితం వర్గం నుండి ఆర్థిక సహాయ సహకారాలు నామమాత్రంగా అందుకుంటారు. పెట్టుబడులలో నిదానం అవసరం.

**ధనుస్సు:** ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లాభిస్తాయి. మానసిక ప్రశాంతత పొందుతారు.

**మకరం:** రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు ఉంటాయి. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు లాభిస్తాయి.

**కుంభం:** వ్యక్తిగత సమస్యల నుండి బయటపడతారు. సకుటుంబ సమేతంగా ప్రయాణాలు చేస్తారు. వస్త్ర లాభం.

**మీనం :** ఎదుటి వారి విషయంలో జోక్యం వద్దు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఖరీఫ్‌కు కష్టకాలం!

>> లోటు వర్షపాతం నమోదైంది. ఇక ఈ జులై చివరి వరకు కూడా తీవ్ర వర్షాభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, మెదక్ లాంటి జిల్లాల్లో కొందరు రైతులు సాహసించి బోర్లు, బావుల కింద కొద్దిమేర వరి నార్లు పోసుకున్నారు. ఇక అరుతడి పంటలు అంతంత మాత్రంగానే సాగయ్యాయి. మొత్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నాయి. చాలా గ్రామాల్లో చివరకు పశువులకు పచ్చిమేత దొరకడం కూడా గగనమైపోయింది. వర్షాలు లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు కూడా గణనీయంగా అడుగంటుతున్నాయి.

కేంద్ర భూగర్భ జల మండలి నివేదికల ప్రకారం రాష్ట్రంలో 16 జిల్లాల్లో భూగర్భ జల మట్టాలు పడిపోయాయి. గత పోస్ట్‌మాన్‌సూన్ స్థాయిలతో పోల్చితే భూగర్భ జల మట్టాలు గణనీయంగా క్షీణించాయి. రాజధాని హైదరాబాద్‌లో అయితే అత్యంత వేగంగా అడుగంటుతున్నాయి. జంటనగరాల్లో జలమట్టం 2.47 మీటర్ల మేర పడిపోయి సగటున 12.43 మీటర్ల లోతుకు చేరడం చూస్తే రాబోయే రోజుల్లో తాగు నీటికి కటకటలాడాల్సిన ప్రమాదం ఏర్పడింది. అలాగే రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టులు కూడా వట్టిపోయి కనిపిస్తున్నాయి. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో నీటి వనరులన్నీ బోసిపోయి దర్శనమిస్తోన్నాయి. రెండు బేసిన్లలో ఇప్పటి వరకు 522.31 టీఎంసీల నీటి నిల్వలు అందుబాటులో ఉండాల్సి ఉండగా 333.34 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రధాన జలాశయాలైన నాగార్జునసాగర్, శ్రీశైలంలో సైతం నీటి మట్టాలు భారీగా తగ్గుతుండటం కూడా వ్యవసాయ రంగానికి పెద్ద సవాల్‌గా మారింది. సింగూరు, నిజాంసాగర్, మిడ్ మానేరు రిజర్వాయర్, లోయర్ మానేరు డ్యాం, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో కూడా నీటి మట్టాలు ఆశాజనంగా ఏమీ లేవు. దీంతో ఈ ఖరీఫ్ సీజనులో పంటల సాగుపై రైతాంగం తీవ్ర ఆందోళనలతో కొట్టుమిట్టాడుతోంది.

## ఎల్‌నినో పరిస్థితిపై నేడు ఇక్రిశాట్‌లో తుమ్మల సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై12:** వానాకాలం-2026లో ఎల్‌నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ, ఉద్యాన విశ్వ విద్యాలయం, ఇక్రిసాట్, ఐఐఓఆర్, ఐఐఎంఆర్, సిఆర్‌ఐడిఏ శాస్త్రవేత్తలు, ఐఎండి అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ, భూగర్భ జల విభాగం అధికారులతో సోమవారం ఇక్రిశాట్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, భారత వాతావరణ శాఖ (ఐఎండి), ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఐసిఏఆర్-క్రీడా శాస్త్రవేత్తలతో ఇప్పటికే సమన్వయం చేసుకుంటూ వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే సమగ్ర కార్యాచరణ ప్రణాళికను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. దాని ప్రకారంమూడు దశల్లో కంటింజెన్సీ ప్రణాళిక, జిల్లాల వారీగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయగా జూలై15 నుండి అమలు చెయాల్సిన ప్రణాళిక పై మరోమారు అధికారులు శాస్త్రవేత్తలతో మంత్రి సమీక్ష నిర్వహించనున్నారు. గత ఖరీఫ్‌లో 1.40 కోట్ల ఎకరాలలో వివిధ పంటలు సాగవ్వగా.. అందులో 70 లక్షలు వరి సాగు అయినట్టు తెలిపారు. ఈ వానాకాలం ఎల్‌నినో పరిస్థితులు ఉన్నప్పటికి ఇప్పటికే 60 లక్షల ఎకరాలలో వివిధ పంటలు వేసినట్టు వివరించారు. అయితే ఎల్‌నినో ప్రభావం ఇలాగే కొనసాగితే ఈ సీజన్లో వరి పంట 30-40లక్షల ఎకరాలలో సాగు అయ్యే అవకాశాలు ఉన్నట్టు అంచనా వేస్తున్నామని అన్నారు. అందుకనుగుణంగానే రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల ఎకరాలకు 3 దశలలో ప్రత్యామ్నాయ సాగు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమవడం, మధ్యలో విరామాలు ఏర్పడటం, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ఆధారంగా చేసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త కంటింజెన్సీ ప్రణాళిక సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. జూలై 10 నాటికి రాష్ట్రంలోని 33 జిల్లాల వర్షపాతం పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 13 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా, 20 జిల్లాల్లో వర్షపాతం లోటు నమోదైందన్నారు. లోటుజిల్లాల్లో కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో వర్షపాతం, సాగు పురోగతి, నేల తేమ, విత్తనాల లభ్యత, రైతుల అవసరాలపై రోజువారీ నివేదికలను విశ్లేషిస్తూ, అవసరమైన చోట వెంటనే ప్రత్యామ్నాయ కార్యాచరణ అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో డైనమిక్ డిస్ట్రిక్ స్పెఫిక్ రెస్పాన్స్(డిఎస్ఆర్) అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

## రైతుల కోసం రక్తం ధారపోస్తాం

>> నువ్వు రైతులకు నీళ్లు ఇవ్వు అని అన్నారు. రైతన్నల కోసం ఎంత రక్తమైనా ధారపోయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. నీళ్లలో నిప్పులు పుట్టించి జలసాధన పోరాటాలు చేసిన వాళ్లం, నెత్తురు ఇస్తేనే నీళ్లు ఇస్తాం అని కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వం కోరుతుంటూ మా నెత్తురు దారపోస్తాం. తెలంగాణలో ఎండిపోతున్న పొలాలకు వెంటనే నీరు విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.


ఆదివారం సిమ్లాలో భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడిన దృశ్యం

## వచ్చే మూడు రోజులు భారీ వర్ష సూచన

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** తెలంగాణలోని నైరుతి రుతుపవనాలు మందగమనంలో పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. పలు జిల్లాల్లో అయితే తీవ్ర వర్షపాతం లోటు ఏర్పడింది. అయితే ఇదే సమయంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి చెదురుమదురు వర్షాలు నమోదవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తాజాగా తెలంగాణకు వాతావరణ శాఖ బిగ్ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. రుతుపవన ద్రోణి ప్రస్తుతం గంగానగర్, రోహ్‌తక్, షాజహాన్‌పూర్, బస్తీ, ముజఫర్‌పూర్ మీదుగా, అక్కడి నుండి తూర్పు ఆగ్నేయ దిశగా మణిపూర్ వైపుగా విస్తరించి ఉంది. సగటు సముద్ర మట్టానికి 1.5 నుండి 3.1 కిలోమీటర్ల ఎత్తులో తెలంగాణ నుండి కర్ణాటక తీరానికి ఆనుకుని ఉన్న తూర్పు మధ్య అరేబియా సముద్రం వరకు ఉన్న ద్రోణి బలహీన పడింది. ప్రస్తుతం తెలంగాణ నుండి కర్ణాటక తీరానికి ఆనుకుని ఉన్న తూర్పు మధ్య అరేబియా సముద్రం వరకు ఉన్న ద్రోణి బలహీన పడింది. దీని ప్రభావంతో రాబోయే మూడ్రోజులు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణశాఖ అంచనా వేసింది. రాబోయే మూడ్రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. అంతేకాకుండా గంటలకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేసింది. భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్ లు ఉండే ప్రాంతాల్లో ఉండొద్దని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని వాతావరణ శాఖ సూచించింది. కాగా ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదు. దీంతో రైతులు సాగు పనుల్లో పూర్తిస్థాయిలో నిమగ్నం కాలేకపోతున్నారు. విత్తనాలు నాటాలంటే భూమిలో తేమశాతం ఉండాలి. అయితే, కొన్ని ప్రాంతాల్లో ఇప్పటి వరకు భారీ వర్షాలు నమోదు కాలేదు. దీంతో భారీ వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాల తీవ్రత తక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీంతో రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచిస్తున్నారు.

## సిఎం రేవంత్‌పై వ్యాఖ్యలు.. గుంటూరులో వైసిపి నేత నాగార్జున యాదవ్ అరెస్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై12:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌ను తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఉన్న ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు, ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి నాగార్జున యాదవ్ చేసిన కొన్ని వ్యాఖ్యలపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు చేస్తున్న తెలంగాణ పోలీసులు ఆదివారం గుంటూరుకు చేరుకు న్నారు. నాగార్జున యాదవ్‌ను అరెస్ట్ చేస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

అనంతరం, తమ వివరాలను, అరెస్ట్ సమాచారాన్ని స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తామని చెప్పి ఆయన్ను తమతో తీసుకెళ్లారు. ఒక రాష్ట్రానికి చెందిన రాజకీయ నేతను, మరో రాష్ట్ర పోలీసులు వచ్చి అరెస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఒక టీవీ ఛానల్ చర్చా కార్యక్రమంలో నాగార్జున యాదవ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డిని 'జొమాటో డెలివరీ బాయ్' అని సంబోధిస్తూ, ఆయన జీవోలను కూడా సరిగా చదవరని ఆరోపించారు. ఎమ్మెల్యేగా కూడా రేవంత్ సమర్థంగా పనిచేయలేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల కారణంగానే ఆయనపై కేసు నమోదై, అరెస్ట్ జరిగినట్టు తెలుస్తోంది.



## మారువేషంలో మంత్రి ఆర్టీసీ బస్సులో ప్రయాణం

**చిల్లరలేదని మంత్రినే బస్సు దించేసిన కండక్టర్**

**బెంగళూరు,జులై 12:** బెంగళూరు నగర బస్సు ప్రయాణికుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు కర్ణాటక రవాణా శాఖ మంత్రి బైరతి సురేశ్ మారువేషంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శనివారం రాత్రి ముఖానికి మాస్క్ ధరించి సాధారణ ప్రయాణికుడిలా బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (బీఎంటీసీ) బస్సులో ఆయన ప్రయాణించారు. ఈ సందర్భంగా మంత్రికి చేదు అనుభవం ఎదురైంది. చిల్లర లేదనే కారణంతో మంత్రిని కండక్టర్ బస్సు దిగిపోవాలని చెప్పడం చర్చనీయాంశమైంది. హెబ్బాల్ నుంచి నాగశెట్టిహళ్లికి వెళ్లే బీఎంటీసీ బస్సులో ఎక్కిన మంత్రి సురేశ్ రెండు టికెట్లు ఇవ్వాలని కోరుతూ కండక్టర్‌కు రూ.100 నోటు ఇచ్చారు. టికెట్‌కు సరిపడా చిల్లర ఇవ్వాలని కండక్టర్ కోరగా, తన వద్ద లేదని మంత్రి తెలిపారు. తన వద్ద కూడా చిల్లర లేదని చెబుతూ బ్యాగ్ చూపించిన కండక్టర్ చిల్లర లేకపోతే బస్సు దిగిపోవాలని మంత్రికి సూచించారు. మారువేషంలో ఉండటంతో మంత్రిని డ్రైవర్ కానీ, కండక్టర్ కానీ ఎవరూ గుర్తించలేదు. తన అసలు గుర్తింపును వెల్లడించకుండా మంత్రి నిశ్శబ్దంగా బస్సు దిగిపోయారు. అనంతరం ఈ ఘటనపై విచారణ జరిపిన అధికారులు బస్సు డ్రైవర్, కండక్టర్‌ను సస్పెండ్ చేశారు. తనిఖీల్లో భాగంగా శనివారం సాయంత్రం 7:10 గంటల నుంచి రాత్రి 9:10 గంటల వరకు మంత్రి సురేశ్ బస్సులో ప్రయాణించారు. జయమహల్, టీవీ టవర్, ఆర్‌టీనగర్, సీబీఐ రోడ్, హెబ్బాల్, మాన్యత టెక్ పార్క్, నాగవారా, హెన్నూరు, హెన్నూరు బండే, బైరతి బండే, గెద్దలహళ్లి ప్రాంతాల్లో బీఎంటీసీ బస్సుల్లో మంత్రి ప్రయాణిస్తూ ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. నాగశెట్టిహళ్లి నుంచి కొంతదూరం ఆటోలోనూ ప్రయాణించారు. మీటర్‌లో రూ.30 చూపించినప్పటికీ డ్రైవర్ రూ.36 డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. అదనపు ఛార్జీ ఎందుకని మంత్రి ప్రశ్నించగా మీటర్‌లో సమస్య ఉందని, తర్వాత సరిచేస్తానని డ్రైవర్ సమాధానం ఇచ్చినట్లు సమాచారం.

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టర్, జనగాం గారి ప్రాథమిక ప్రకటన
ఫారం-VI
(చట్టం 30/2013) లోని సెక్షన్ 11(1) సబ్ రూల్-1 రూల్ (19) ప్రకారం
ఎస్.డి.సి. ఫైల్ నెం. బి/30/2026 తేది: 09.07.2026
కలెక్టర్, ఫైల్ నెం. ఇ2/396/2026 తేది: 10.07.2026
గెజిట్ నెం. JN/LA/36/2026 తేది: 11.07.2026

ఈ దిగువ నిర్దిష్ట పరచిన జనగాం జిల్లా పాలకుర్తి మండలము వావిలాల గ్రామములో ఉన్న భూమి మొత్తం విస్తీర్ణం ఎ.2.26 గుంటలు దేవాదుల ప్రాజెక్ట్‌లో (జె.సి.ఆర్.డి.ఎల్.ఐ.పి) భాగంగా 4 ఎల్ ఆఫ్ 3 ఆర్ ఆఫ్ 7 ఎల్ డిస్ట్రిబ్యూటరి ఆఫ్ నష్కల్ మెయిన్ కెనాల్ కి.మీ 0.110 నుండి కి.మీ 0.595 వరకు కెనాల్ నిర్మాణ నిమిత్తం ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నందుని భావించినందున భూసేకరణ పునరావాస, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 30/2013 లోని సెక్షన్ 11 (1) అనుసరించి ప్రకటన జారీ చేయనైనది.

అంతేకాక, పై నీటిపారుదల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణను న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు పునరావాసం మరియు పునర్నిర్మాణ చట్టం, 2013 లోని అధ్యాయం-II (సామాజిక ప్రభావ మదింపు) మరియు అధ్యాయం-III (ఆహార భద్రతకు సంబంధించిన ప్రత్యేక నిబంధనలు) అమలులో నుండి, తెలంగాణ సవరణ చట్టం, 2016 (చట్టం 21 ఆఫ్ 2017) ద్వారా చేర్చబడిన సెక్షన్-10A ప్రకారం, జి.ఓ.ఎం.ఎస్. నెం.68, రెవెన్యూ శాఖ, తేదీ: 29.07.2017 ప్రకారం మినహాయించబడినందున, ఈ భూసేకరణకు అధ్యాయం-II మరియు అధ్యాయం-III నిబంధనలు వర్తించవు.

ఈ భూసేకరణ కారణంగా మొత్తం కుటుంబాలు - శూన్యం (Nil) మాత్రమే నిర్వాసితులయ్యే అవకాశం ఉన్నందున, ప్రభావిత కుటుంబాల పునరావాసం మరియు పునర్నిర్మాణం కొరకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జనగామ గారిని అడ్మినిస్ట్రేటర్‌గా నియమించడమైనది.

అందువల్ల, దిగువ షెడ్యూల్‌లో పేర్కొన్న జనగాం జిల్లా పాలకుర్తి మండలము వావిలాల గ్రామములోని సుమారు ఎకరాలు 2.26 గుంటల భూమిని పై ప్రజాప్రయోజనం కొరకు భూసేకరణ చేయుటకు ఈ ద్వారా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయబడుచున్నది.

అనుబంధము
4 ఎల్ ఆఫ్ 3 ఆర్ ఆఫ్ 7 ఎల్ డిస్ట్రిబ్యూటరి ఆఫ్ నష్కల్ మెయిన్ కెనాల్
గ్రామము : వావిలాల మండలం : పాలకుర్తి జిల్లా : జనగాం

| క్రమ సంఖ్య | సర్వే నెంబరు | పైరిటి రకం | భూమి రకం మెట్ట/తరి | భూసేకరణ చేయు విస్తీర్ణము | ఆస్తి కలిగియున్న వ్యక్తుల పేరు మరియు చిరునామా | రిమార్కులు |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 1 | 50/1 | ఖుష్కి | ప్రభుత్వ భూమి | 0.05 | | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 2 | 50/1 | ఖుష్కి | ప్రభుత్వ భూమి | 0.03 | గోరంట్ల చిన్న సోమయ్య తండ్రి సర్వయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 3 | 50/1 | ఖుష్కి | ప్రభుత్వ భూమి | 0.0350 | | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 4 | 50/1 | ఖుష్కి | ప్రభుత్వ భూమి | 0.08 | | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 5 | 50/1 | ఖుష్కి | ప్రభుత్వ భూమి | 0.10 | | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 6 | 50/1 | ఖుష్కి | ప్రభుత్వ భూమి | 0.08 | | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 7 | 50/1 | ఖుష్కి | ప్రభుత్వ భూమి | 0.17 | | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 8 | 50/1 | ఖుష్కి | ప్రభుత్వ భూమి | 0.15 | ఆవనపల్లి మల్లయ్య తండ్రి ఎల్లయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 9 | 50/1 | ఖుష్కి | ప్రభుత్వ భూమి | 0.06 | | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 10 | 50/1 | ఖుష్కి | ప్రభుత్వ భూమి | 0.12 | | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 11 | 50/1 | ఖుష్కి | ప్రభుత్వ భూమి | 0.05 | పెంతల సోమయ్య తండ్రి పోతయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 12 | 50/1 | ఖుష్కి | ప్రభుత్వ భూమి | 0.11 | మాశెట్టి లక్ష్మీనారాయణ తండ్రి జగన్నాథం | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 13 | 50/1 | ఖుష్కి | ప్రభుత్వ భూమి | 0.025 | దొంగరి వెంకటయ్య తండ్రి లింగయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| | పూర్తి మొత్తం | | | 2.26 | | |

వృక్షములు / నిర్మాణములు
గ్రామము : వావిలాల మండలం : పాలకుర్తి జిల్లా : జనగాం

| వ.సం. | సర్వే నం | విస్తీర్ణం | ఆస్తి కలిగియున్న వ్యక్తుల పేరు మరియు చిరునామా | వృక్షములు రకము | వృక్షములు సంఖ్య | నిర్మాణములు రకము | నిర్మాణములు విస్తీర్ణం/సంఖ్య | రిమార్కులు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 50/1 | 0.08 | | వేప | 1 | | | |
| 2 | 50/1 | 0.08 | | వేప | 2 | | | |
| | | | | సీమచింత | 1 | | | |
| 3 | 50/1 | 0.12 | | వేప | 3 | | | |
| 4 | 50/1 | 0.05 | పెంతల సోమయ్య తండ్రి పోతయ్య | తాటి | 1 | పైప్‌లైన్ | 1 | |
| 5 | 50/1 | 0.0250 | దొంగరి వెంకటయ్య తండ్రి లింగయ్య | వేప | 4 | | | |
| | | | | మొదుగ | 1 | | | |

ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం, 2013 (నెం.30/2013)లోని నియమములోని సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారంచెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, జనగాం మరియు భూ సేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్, యల్.ఎ.ఆర్ యూనిట్-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్, జనగాం గారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయము వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, జనగాం గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ యల్.ఎ. ఆర్&ఆర్ యూనిట్-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్, జనగాం గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పైన తెలిపిన భూములలోని ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేయుటకు అనుమతించడమైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, జనగాం గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేది నుండి ఈ ప్రకటనలో ఉపహరించబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు అమ్మకం తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు. భూసేకరణ విషయములో సంబంధిత భూ యజమానులకు ఏమైన అభ్యంతరములున్నయెడల చట్టంలోని 15 విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్/భూ సేకరణ అధికారి యల్.ఎ. ఆర్&ఆర్ యూనిట్-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్, జనగాం గార్లకు ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినముల లోపల వారి అభ్యంతరములు లిఖిత పూర్వకంగా తెలియజేయవలసియుంది.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్, భూసేకరణ, యల్.ఎ.ఆర్&ఆర్, యూనిట్-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్ జనగాం
సం/- అదనపు కలెక్టర్ జనగాం
సం/- జిల్లా కలెక్టర్ జనగాం

DIPR.RO.NO: 461/LA/PP/Advt/Pub/2026-27

# నేడు టెట్-2026 పరీక్షల ఫలితాలు

## మధ్యాహ్నం విడుదల చేయనున్న డైరెక్టర్

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)- జూన్- 2026 పరీక్షల ఫలితాలను నేడు(సోమవారం) విడుదల చేయనున్నారు. ఫలితాలను పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ నేడు మధ్యాహ్నం 2.30 గంటలకు ఫలితాలను విడుదల చేస్తారని టెట్ కన్వీనర్ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా టెట్-2026 పరీక్షలు జూన్ 16 నుంచి 22 వరకు జరిగాయి. పరీక్షలకు 1,53,752 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1,15,028 మంది హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 74.81 శాతం మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని జూన్ 30న విడుదల చేయగా.. అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను ఈ నెల 2 వరకు స్వీకరించారు. పరీక్షలు ఐదు రోజులపాటు రెండు సెషన్‌లలో కొనసాగాయి. టెట్‌కి రాష్ట్ర వ్యాప్తంగా 1,53,752 దరఖాస్తులు రాగా వాటిలో పేపర్-1కి 50,113 మంది దరఖాస్తు చేయగా వారిలో 36,129 మంది(72.10శాతం) హాజరయ్యారు. పేపర్-2లో గణితం అండ్ సైన్స్‌కి 58,675 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 44,128 మంది(75.21శాతం) హాజరయ్యారు. పేపర్-2 సోషల్ స్టడీస్‌కి 44,964 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో 34,771 మంది (77.33శాతం) పరీక్షలకు హాజరయ్యారు.

# ప్రశాంతంగా ముగిసిన కెజిబివి ప్రవేశపరీక్ష

## 80 శాతం విద్యార్థినులు హాజరు

## పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్‌నికోలస్

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (కెజిబివి-వైఐఓఈఎస్)లో ప్రవేశాల కోసం నిర్వహించే 6వ తరగతి ప్రవేశ పరీక్షను తెలంగాణలోని కెజిబివిల్లో ఆదివారం ప్రశాంతంగా నిర్వహించినట్లు పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షను ఆదివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షకు 6,563 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 5,289 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో 80.59 శాతం మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షను సజావుగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. కెజిబివి-జుయంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కింద ప్రతి జిల్లాలో నీట్/ఎప్‌సెట్ కోచింగ్ కోసం ఒక కెజిబివి-వైఐఈ, జేఈఈ/ఎప్‌సెట్ కోచింగ్ కోసం ఒక కెజిబివి-వైఐఓఈ, క్లాట్ కోచింగ్ కోసం ఒక కెజిబివి-వైఐఓఈ కేటాయించబడ్డాయని తెలిపారు. ప్రతి ప్రత్యేక కెజిబివిలో ప్రవేశ పరీక్ష ద్వారా 20 సీట్లు అందు బాటులో ఉంటాయన్నారు. ఈ సంస్థలలో ప్రవేశాలను ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ ఆధారంగా జిల్లా వారీగా జరుగుతాయని స్పష్టం చేశారు. ఎం పికైన అభ్య ర్థులను వారి దరఖాస్తు ఫారాలలో వారు తెలిపిన ప్రాధాన్యతల ప్రకారం, మెరిట్ సీట్ల లభ్యతకు లోబడి, సంబంధిత ప్రత్యేక కెజిబివిల్లో సీట్లను కేటాయిస్తారని డైరెక్టర్ తెలిపారు. ప్రవేశాల షెడ్యూల్‌ను విడిగా జారీ చేయనున్నట్లు నవీన్ నికోలస్ ప్రకటనలో స్పష్టం చేశారు.

# బాన్సువాడలో కుటుంబకలహాలతో కూలీ ఆత్మహత్య

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా బాన్సువాడలో కుటుంబ కలహాల కారణం గా కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివా రం జరిగిన ఈ ఘటన గ్రామంలో కలకలం రేపింది. స్థానిక సోమేశ్వర్ గ్రామానికి చెందిన చల్ల సాయిలు (55) వడ్డెర వృత్తికి చెందిన కూలీగా వున్నా డు. మొదటి భార్య మరణించడంతో 20 ఏళ్ల క్రితం రెండవ వివాహం చేసుకున్నాడు. మొదట్లో భార్య భర్తలు బాగానే వున్నా కొంతకా లంగా ఇద్దరిఉ మధ్య గొడవలు రాసాగాయి. ఇదే కారణంగా ఆదివారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డా డు. మృతుడి భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. దీనిపై సాయిలు మొదటి భార్య కుమారుడు శివ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# తాగునీటి ఇబ్బందుల పరిష్కారానికి సూచనలు చేస్తే బెల్ట్ ట్రీట్‌మెంటా?

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై

## రిటైర్డు ఇంజినీర్ శ్యాంప్రసాద్‌రెడ్డి కంటనీరు

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త :** మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో నేను కెసిఆర్‌తో విభేదించానని అప్పుడు ఆయన విధానాలను గట్టిగా వ్యతిరేకించినా ఏనాడు తమపట్ల అమర్యాదగా మాట్లాడలేదని తాగునీటి ఇబ్బందులు పరిష్కారంకు సూచనలు చేస్తే ముఖ్యమంత్రి బెల్ట్ ట్రీట్‌మెంట్ అంటూ విమర్శలు చేయడం బాధకలిగించిందని రిటైర్డు ఇంజనీర్ శ్యాంప్రసాద్‌రెడ్డి ఆవేదన చెందారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో రిటైర్డ్ ఇంజినీర్లను జైలుకు పంపించాలని సి ఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రిటైర్డ్ ఇంజినీర్ శ్యాంప్రసాద్ రెడ్డి స్పందించారు. మాపై సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధించాయన్నారు. కెసిఆర్ తుమ్మడిహట్టి ప్రతిపాదన మార్చిన మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టడాన్ని తాము వ్యతిరేకించామని గుర్తుచేశారు. కెసిఆర్ కు వ్యతిరేకంగా చాలా సార్లు మాట్లాడితే పేపర్లలో హెడ్ లైన్స్ లో వచ్చినా కెసిఆర్ మమ్మల్ని పిలిపించుకుని మాట్లాడారే తప్ప విమర్శించలేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కన్నెపల్లి వద్ద నీటిని పంపింగ్ చేయడానికి సరిపడా నీరు ఉందని ఎన్‌డిఎస్‌ఎ చెప్పినట్టుగా నీటిని పంపింగ్ చేయవచ్చన్నారు. కరువు హెచ్చరికల నేపథ్యంలో వెంటనే అలర్ట్ కాకపోతే తాగునీటికి కూడా ఇబ్బందులు తప్పవన్నారు. నిరంతరం పర్యవేక్షిస్తూ ఈ మిషన్ చేయాల్సి ఉంటుందన్నారు. మాకు ఏ పార్టీతో సంబంధం లేదని నిన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఫోన్లో మాట్లాడామని మీరు ఎప్పుడు పిలిచినా సహకరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కలిసి పనిచేయడానికి సైట్లో ఉండి పర్యవేక్షించడానికి ఫ్రీఆఫ్ కాస్ట్‌తో సిద్ధంగా ఉన్నామని మంత్రితో చెప్పామ న్నారు. ప్రభుత్వ సర్వీసులో ఎంతో నిష్టతో పని చేశానని ఇప్పుడు ఇలాంటి అపనింద వేయడం తట్టుకోలేకపోతున్నానంటూ భావోద్వేగానికి లోనయ్యారు.

# అమెరికాలో భారత సంతతి గూగుల్ సీనియర్ టెక్నాలజీ అధికారిణి హత్య: భర్త అరెస్ట్

**అట్లాంటా, జులై 12:** అమెరికాలో భారత మూలాలున్న గూగుల్ సీనియర్ టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ షీతల్ వ్రెజ్సియన్ (57)ను ఆమె భర్త కాల్చిచంపాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిన ఈ కాల్పుల ఘటనలో వారి కుమారుడు జాసన్ వ్రెజ్సియన్ కూడా తుపాకీ గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



షీతల్ వ్రెజ్సియన్

అమె రికాలోని జార్జియా రాష్ట్రం, అట్లాంటా సమీపంలోని కాబ్ కౌంటీలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితుడు కిర్క్ బి. వ్రెజ్సియన్ (56)ను పోలీసులు మంగళవారం రాత్రి నివాసంలోనే అరెస్ట్ చేశారు. ప్రస్తుతం అతడిని కాబ్ కౌంటీ అడల్ట్ డిటెన్షన్ సెంటర్‌లో బెయిల్ లేకుండా నిర్బంధించారు. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 8 గంటల సమయంలో జార్జియాలోని స్మిర్నా నగరంలోని ఓ ఇంట్లో కాల్పులు జరిగాయని సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇంట్లో తీవ్ర తుపాకీ గాయాలతో ఉన్న షీతల్ వ్రెజ్సియన్‌ను గుర్తించారు. ఆమెను ఆస్పత్రికి తరలించినప్పటికీ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఇంటి బయట 23 ఏళ్ల జాసన్ వ్రెజ్సియన్ తుపాకీ గాయాలతో కనిపించాడు. అత్యవసర వైద్య సిబ్బంది అతడిని సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భర్తపై హత్య సహా పలు కేసులు నమోదుకాబ్ కౌంటీ పోలీసుల సమాచారం ప్రకారం కిర్క్ వ్రెజ్సియన్‌పై ఒక ఫెలనీ మర్డర్ కేసు, రెండు అగ్రవేటెడ్ అసాల్ట్ కేసులు, నేరం జరిగే సమయంలో తుపాకీ వినియోగానికి సంబంధించిన రెండు కేసులు నమోదు చేశారు. ఈ ఘటన కుటుంబ హింసకు సంబంధించినదిగా పోలీసులు పేర్కొన్నారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, ప్రస్తుతం మరెవరిని అరెస్ట్ చేయలేదని తెలిపారు.

# ఏడు ఇఎస్ఐసి ఆరోగ్య ప్రాజెక్టులు రేపు ప్రారంభం

## సనత్‌నగర్ ఆస్పత్రి నుంచి ఆవిష్కరించనున్న కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ

## ప్రాజెక్టుల మొత్తం వ్యయం రూ. 668 కోట్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 12:** తెలంగాణలోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి నుంచి దేశవ్యాప్తంగా 7 ఈఎస్ఐసీ ఆరోగ్య ప్రాజెక్టులను ఈ నెల 14న కేంద్ర కార్మిక ఉపాధి, యువజన వ్యవహారాలు క్రీడల శాఖల మంత్రి మన్‌సుఖ్ మాండ వీయ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రిలోని కొత్త ఓపీడీ విభాగాన్ని కూడా ప్రారంభిస్తారు. మిగిలిన 6 ప్రాజెక్టులను ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా ప్రారం భిస్తారు. వీటిలో అసోంలోని బెల్తోలా 200 పడకల ఆసుపత్రిని ఉన్నతీకరించారు. అలాగే, తమిళనాడు శ్రీపెరంబుదూర్‌లో 100 పడకల ఆసుపత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.. రాజమహేంద్రవరంలో ఆసుపత్రి, గుజరాత్ రాష్ట్రం.. సురేంద్రనగర్‌లోని ఈఎస్ఐ డిస్పెన్సరీ శాఖ, రాజస్థాన్ రాష్ట్రం.. కోట ఉద్యోగ్ నగర్‌లోని ఈఎస్ఐ డిస్పెన్సరీ శాఖ, అదే రాష్ట్రంలోని భవానీ మండి ఈఎస్ఐ డిస్పెన్సరీ ఉన్నాయి. వీటన్నిటినీ ..668 కోట్ల వ్యయంతో నిర్మించగా, దేశవ్యాప్తంగా గల సుమారు 53 లక్షల మంది లబ్ధిదారులకు వైద్య సేవలు లభిస్తాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర కార్మిక-ఉపాధి, సూక్ష్మ, చిన్న-మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే కూడా పాల్గొంటారు. సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి ఓపిడి విభాగం నిర్మాణ కార్మికులను డాక్టర్ మాండవీయ సత్కరిస్తారు. తద్వారా దేశ పురోగమనంలో వారి పాత్రను గుర్తించినట్లవుతుంది. దీంతో పాటు కార్మిక సంక్షేమంపై ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ ఈఎస్ఐ లబ్ధిదారులకు నగదు ప్రయోజనాలను అందజేస్తారు. కొత్త సౌకర్యాల ఏర్పాటుతో ఈఎస్ఐ కింద పూర్తి స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. 1.సనత్‌నగర్ ఈఎస్ఐసీ:- తెలుగు రాష్ట్రాలు కలిసి ఉన్నపుడు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలకు సేవలు అందించడంతో ఈ ఈఎస్ఐ ఆస్పత్రి 1975 మార్చి 30న ప్రారంభమైంది. కాల క్రమంలో ఇతర ప్రాంతాలకు కూడా సేవల్ని విస్తరించారు. ప్రస్తుతం ఈఎస్ఐసీ 2.0 సంస్కరణల కింద తెలంగాణలోని 33 జిల్లాలకూ ఈఎస్ఐ పథకం కింద సేవల్ని అందిస్తున్నారు. దీంతో తెలంగాణలో 33 జిల్లాలకు సేవల్ని అందిస్తున్నారు.

సామాజిక భద్రత కింద మొత్తం 19,15,700 మంది బీమా చందాదారులు, 74,32,916 మంది లబ్ధిదారులకు సేవలు అందిస్తున్నారు. 2.ఈఎస్ఐసీ ఆసుపత్రి, బెల్తోలా:-అస్సాంలోని బెల్తోలాలో ఈఎస్ఐ ఆసుపత్రి ద్వారా మేఘాలయలోని 47 జిల్లాలతోపాటు త్రిపుర, మిజోరం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్‌లోని 41 జిల్లాలకు సేవలు అందుతాయి. తద్వారా 3.42 లక్షల మంది బీమా చందాదారులు సహా మొత్తం 13.27 లక్షల మంది లబ్ధిదారులకు ఆరోగ్య సేవలు లభిస్తాయి. 3.ఈఎస్ఐసీ ఆసుపత్రి, శ్రీపెరంబుదూర్:- తమిళనాడులో ప్రముఖ తయారీ, ఎలక్ట్రానిక్స్ కూడలిగా ఎదిగిన శ్రీపెరంబుదూర్‌లో 100 పడకల ఈఎస్ఐసీ ఆసుపత్రి ఉంది.

ఇక్కడ ఓపీడీ, అత్యవసర సేవలు, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, ఐపీడీ, ఎక్స్‌రే, ల్యాబ్, ఫార్మసీ సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. దీని ద్వారా కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాల్లోని 5.5 లక్షల మందికి పైగా బీమా చందాదారులకు సేవలు లభిస్తాయి. 4. ఈఎస్ఐఎస్ ఆసుపత్రి, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం ఈఎస్ఐఎస్ ఆసుపత్రిలో 1,31,190 మంది బీమా చందాదారులు సహా మొత్తం 2,52,717 మంది లబ్ధిదారులకు సేవలు లభిస్తాయి. ఇక్కడ రోగుల కోసం 26 ఓపీడీ గదులు, 3 ఆధునిక మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, ఇతర కీలక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. 5. ఈఎస్ఐ డిస్పెన్సరీ, సురేంద్రనగర్, గుజరాత్:- సురేంద్రనగర్ జిల్లాలో సుమారు 9,192 మంది బీమా చందాదారులు ఉన్నారు. ఈ శాఖ ద్వారా సుమారు 35,000 మంది లబ్ధిదారులకు వైద్య సేవలు, సామాజిక భద్రతా ప్రయోజనాలు లభిస్తాయి. 6.ఈఎస్ఐ డిస్పెన్సరీ, కోటా ఉద్యోగ నగర్:- రాజస్థాన్‌లోని కోట పారిశ్రామిక ప్రాంతంలోని బీమా కార్మికులు, వారి కుటుంబాలకు ఈ కేంద్రం ఉపయోగపడుతుంది.

సుమారు 75,000 మంది బీమా చందాదారులు సహా మొత్తం 2,91,000 మందికి ఇక్కడ సేవలు లభిస్తాయి. 7.ఈఎస్ఐ డిస్పెన్సరీ, భవానీ మండి:- రాజస్థాన్‌లోని ప్రధాన వస్త్ర కేంద్రమైన భవానీ మండి పారిశ్రామిక ప్రాంత కార్మికుల కోసం ఈ డిస్పెన్సరీ ఏర్పాటైంది., 27,715 మంది బీమా చందాదారులు సహా మొత్తం 1,07,535 మందికి ఆరోగ్య సేవలు లభిస్తాయి.

# ఒడిశా నుంచి టూరిస్టు బస్సులో గంజాయి రవాణా

## డ్రైవర్, కండక్టర్, క్లీనర్ల అరెస్టు

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** గంజాయి స్మగ్లర్లపై పోలీసు శాఖ ఎన్ని రకాల దాడులు చేస్తున్నా ఎంతమందిని అరెస్టు చేస్తున్నా స్మగ్లర్ల ఆగడాలు ఆగడం లేదు. నిత్యం ఏదో ఒక కొత్త ఎత్తుగడతో ఒడిశా, ఎపి నుంచి తెలంగాణను గంజాయి స్మగ్లింగ్ చేస్తూనే వున్నారు. ఈ క్రమంలో టూరిస్టు బస్సుల్లో డ్రైవర్, కండక్టర్, క్లీనర్‌గా పనిచేస్తున్న ముగ్గురు కమీషన్‌కు కక్కుర్తిపడి ఒడిషా నుంచి 41 కిలోల గంజాయిని ఒడిషా నుంచి హైదరాబాద్‌కు తీసుకురాగా దీనిపై పక్కా సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివ రాలను ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఒడిషాకు చెందిన గంజాయి స్మగ్లర్లు రూటు మార్చి స్మగ్లింగ్ కార్యకలాపాలకు కొత్త పంథాను ఎంచుకున్న వైనం పోలీసులకు షాక్ గురిచేసింది. ఇప్పటి వరకు నేరుగా ప్రైవేటు బస్సులు, లారీలు, ట్యాక్సీ కార్లు, రవాణా ఆటోలలలో ఒడిషాలోని మల్కన్‌గిరి సహా పరిసర ప్రాంతాల నుంచి వందలాది కిలోల గంజాయిని తెలంగాణతో పాటు ఇక్కడి నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు తరలిస్తుండడం తెలిసిందే. ఈ క్రమంలో అనేక మంది దొరికిపోవడంతో స్మగ్లర్లు బస్సుల డ్రైవర్లు, క్లీనర్లకు కమీషన్ ఇస్తూ గంజాయిని హైదరాబాద్‌కు పంపుతున్నారు. ఒడిషాలో స్మగ్లర్లు గంజాయిని ప్యాకింగ్ చేసి టూరిస్టు బస్సుల్లో వుంచుతుండా హైదరాబా ద్‌లో దానిని ఇక్కడి స్మగ్లర్లు తీసుకుంటున్నారు.



గంజాయి రవాణా చేస్తూ ఈగల్ పోలీసులకు పట్టుబడిన టూరిస్టు డ్రైవర్లు, క్లీనర్లు

ఇదే క్రమంలో ఒడిషాలోని మల్కన్‌గిరికి చెందిన టూరిస్టు బస్సు హెల్పర్ లక్ష్మణ్ కురమి (22), కోరాపూర్‌కు చెందిన బస్సు డ్రైవర్ కొమ్మల కిల్ (32), ఇదే బస్సు కండక్టర్‌గా వున్న మల్కన్ గిరి వాసి బాబు మడకమి (33)లు ఆటోనగర్ లో టూరిస్టు బస్సులో 41 కిలోల గంజాయి తరలిస్తూ దొరికి పోయారు. వీరి వద్ద నాలుగు సెల్‌ఫోన్లు దొరికాయి. ఈ ఘటనలో ఒడిషాకు చెందిన స్మగ్లర్ నుబిన్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన మరో స్మగ్లర్ పరారీలో వున్నాడు. వీరి కోసం గాలిస్తున్నారు. ఈ కేసులో బాబా బోలోనాథ్ ట్రావెల్స్ టూరిస్టు బస్సు (నంబర్ ఒడి 30 హెచ్ 2277 )ను కూడా జప్తు చేశారు. అంతకు ముందు ఒడిషాకు చెందిన బంకేశ్వరి ట్రావెల్స్ టూరిస్టు బస్సు (నంబర్ ఒడి 15 ఎఈ 7227)ను ఇదే తరహాలో జప్తు చేసి అందులో వున్న 21 కిలోల గంజాయిని జప్తు చేశారు.

ఈ ఘటన లో ఇద్దరు డ్రైవర్లతో పా టు ఒక హెల్పర్‌ను అరెస్టు చేశారు. కాగా మాదకద్రవ్యాల విషయంలో కఠినంగా ఉంటామని ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం వున్నా 1908 లేదా 871267111కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

# పిఎం కుసుమ్ టారిఫ్‌కు కోత

## యూనిట్ రూ.3.13 నుండి రూ.2.98కి తగ్గింపు

## ఒక్కో రైతుకు నెలకు రూ.20 వేలు నష్టం

## విద్యుత్ కొనుగోలు ఒప్పందాల అమలుకు డిమాండ్

## రాష్ట్ర సర్కార్ నిర్ణయంతో రైతుల్లో ఆందోళన

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త :** ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎంకుసుమ్) పథకం కింద విద్యుత్ కొనుగోలు టారిఫ్‌ను తగ్గించాలన్న రాష్ట్ర సర్కార్ ప్రతిపాదనపై రైతుల్లో తీవ్రఆందోళన వ్యక్తమవుతోంది. గతంలోనే విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై (పీపీఏలు) సంతకాలు చేసిన రైతులు వాటిని విధిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గత సంవత్సరం పీపీఏలపై సంతకాలు చేసినప్పుడు, ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు యూనిట్‌కు రూ.3.13 చొప్పున కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు హామీ ఇచ్చింది. అయితే ప్రభుత్వం ఇప్పుడు ఆ టారిఫ్‌ను యూనిట్‌కు రూ.2.98కి తగ్గించాలని ప్రతిపాదిస్తోంది. ఈ చర్య తమ ప్రాజెక్టుల మనుగడపై గణనీయంగా ప్రభావం చూపుతుందని రైతులు అంటున్నారు. కాగా పిఎంకుసుమ్ పథకం కింద, సొంత లేదా లీజుకు తీసుకున్న భూమిపై గ్రిడ్‌కు అనుసంధానించబడిన సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి వ్యక్తిగత రైతులు, రైతు సంఘాలు, సహకార సంఘాలు, పంచాయతీలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఓలు), స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జిలు), ఇతరుల నుండి టిజిఆర్ఇడిసిఓ దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ పథకంలోని కాంపోనెంట్ ఎ కింద, తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ (టీజీఈఆర్‌సీ) నిర్ధారించిన టారిఫ్ ప్రకారం, ఉత్పత్తి అయిన విద్యుత్‌ను డిస్కామ్‌లు 25 సంవత్సరాల పాటు కొనుగోలు చేస్తాయి. రైతులు తమ సామర్థ్యాన్ని బట్టి 0.5 మెగావాట్లు, 1 మెగావాట్ లేదా 2 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవచ్చు. 1 మెగావాట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సుమారు రూ.3.75 కోట్లు ఖర్చవుతుంది. ప్రతిపాదిత సుంకాల సవరణపై రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ విషయంపై విద్యుత్ నియంత్రణ కమిషన్ ముందు విచారణ జరగాల్సి ఉండగా, దానిని ఇప్పుడు ఆగస్టు 4వ తేదీకి వాయిదా వేశారు. టారిఫ్ రేట్లను తగ్గించడానికి జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడమే కారణమని ప్రభుత్వం పేర్కొంది. అయితే, ఉక్కు, డీజిల్, రాగి, ఇతర ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో, జీఎస్టీ కోత వల్ల కలిగే ఆదా మొత్తం సమసిపోవడం లేదని రైతులు వాదిస్తున్నారు. తెలంగాణ పిఎంకుసుమ్ రైతు సంఘం సభ్యుల ప్రకారం, యూనిట్‌కు రూ.0.15 తగ్గించాలన్న ప్రతిపాదన వల్ల ఒక రైతుకు నెలకు సుమారు రూ.20,000 నష్టం వాటిల్లవచ్చు, ఇది ఒక ఉద్యోగి జీతానికి సమానమని దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అంచనా వేసిన తిరిగి చెల్లింపులు, ఆమోదించబడిన టారిఫ్ ఆధారంగా బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయని ఆ సంఘం కూడా పేర్కొంది. తక్కువ టారిఫ్ వల్ల, కొత్త ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడానికి బ్యాంకులు వెనుకాడతాయని, ఇది సోలార్ ప్లాంట్ల ఏర్పాటును ప్రభావితం చేస్తుందని వారు తెలిపారు.

# టాలీవుడ్ కొరియోగ్రాఫర్ల మధ్య వివాదం

## ఎన్నికల నిర్వహణపై శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ వర్గాల మధ్య ఘర్షణ

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జులై 12, ప్రభాతవార్త:** టాలీవుడ్ కొరియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికలు కొరియోగ్రాఫర్ల మధ్య వివాదానికి కారణమయ్యాయి. ఓ వర్గం వారు ఎన్నికలు వెంటనే నిర్వహించాలని పట్టుబట్టడం, మరోవర్గం కొన్నిరోజులపాటు వాయిదా వేయాలని కోరడంతో ఇరువర్గాల మధ్య వివాదానికి దారితీసింది. దీంతో టాలీవుడ్ అగ్రశ్రేణి కొరియోగ్రాఫర్లు శేఖర్ మాస్టర్-జానీ మాస్టర్ వర్గాల మధ్య తీవ్రవాగ్వాదం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. టాలీవుడ్ కొరియోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం మణికొండ చిత్రపురి కాలనీలో నిర్వహిం చారు. ఈ సమావేశానికి టాలీవుడ్‌లో పనిచేస్తున్న కొరియోగ్రాఫర్లు, డ్యాన్సు మాస్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఎన్నికల నిర్వహణపై చర్చ పెట్టారు. ఫెడరేషన్ అనుమతి లేకుండానే బైఎలక్షన్‌ల నిర్వహణకు ఓ వర్గం ప్రయత్నిస్తుందంటూ వివాదం మొదలైంది. దీంతోపాటు సభ్యత్వ నమోదు విషయంలో సైతం భేదా భిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ సమావేశం సందర్భంగా అగ్రశేణి కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ వర్గం ఎన్నికలు నిర్వ హించాలని పట్టుబట్టగా, జానీ మాస్టర్ వర్గం ఎన్నికలు నిర్వహించే ప్రక్రియను వ్యతిరేకించాయి. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తున్నది. ఈ మేరకు ఎన్నికల నిర్వహణ కోసం కోరం ఓటింగ్ నిర్వ హించగా, మూడువంతుల మంది ఎన్నికలు నిర్వహించాలని ఓటింగ్ చేసినట్లు తెలుస్తుంది. దీంతో సమావేశం రసాభాసగా మారి గందరగోళానికి దారి తీసింది. ఈ వివాదానికి నిరసనగా 10మంది డ్యాన్సు మాస్టర్లు తమ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు సమాచారం. కాగా ఈ విషయమై ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల కాలేదు. మరోవైపు టాలీవుడ్‌లో ఉన్న అగ్ర శ్రేణి కొరియోగ్రాఫర్లు శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ వర్గాల మధ్య చోటు చేసుకున్న ఈ వివాదం ఎక్కడికి దారితీస్తుందో అని సినీవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# షాబాద్ నిందితుని కోసం కొనసాగుతున్న గాలింపు

## షాద్‌నగర్ సమీపంలో నందిగామ వద్ద కారు స్వాధీనం

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన షాబాద్‌లో ఆరు హత్యల కేసులో నిందితుడు రాజ్‌కుమార్ కోసం పోలీసుల వేట కొనసాగుతోంది. తనపై పోక్సో కేసు పెట్టి జైలుకు పంపినందుకు శుక్రవారం అర్ధరాత్రి సమయంలో బాలికతోపాటు ఆమె తల్లి, నానమ్మలను చంపిన నిందితుడు ఆ తరువాత తన భార్య సరితతోపాటు ఇద్దరు కొడుకులను కత్తితో పొడిచి హత్య చేయడం తెలిసిందే. ఈ ఘటన షాబాద్‌లో తీవ్రఉద్రిక్తతలకు దారితీయగా పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని శాంతిభద్రతలు అదుపు తప్పకుండా ఉండేందుకు అదనపు బలగాలను మొహరించారు. పోక్సో కేసులో నెలన్నరపాటు జైల్లో ఉండి శుక్రవారమే బెయిల్‌పై విడుదలైన రాజ్‌కుమార్ అనంతరం కారును సెల్ఫ్‌డ్రైవింగ్ పేరిట అద్దెకు తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం అదే కారులో అర్థరాత్రి వరకు బయట తిరిగి చిత్తుగా మద్యం సేవించాడు. అనంతరం పక్కాగా వ్యవహరించి మొదట తనపై ఫిర్యాదు చేసిన మైనర్ బాలికను, ఆమె తల్లి, నానమ్మలను చంపాడు. ఈ ముగ్గురిని చంపడంతో ఆ కుటుంబంలో మిగిలిన మానసిక దివ్యాంగురాలు అనాధగా మారింది. దీని తరువాత కొంతదూరంలో వున్న తన ఇంటికి వెళ్లి భార్య, ఇద్దరు పిల్లలను చంపి కారులో పారిపోయాడు. ఇతని కోసం శనివారం అంతా గాలించినా ప్రయోజనం కలగలేదు. ఆరుగురిని చంపిన తరువాత తాను కూడా ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాజ్‌కుమార్ తన తండ్రికి ఫోన్ చేశాడు. దీంతో అతను ఒకవేళ ఏదైనా రైలు కింద ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావించిన పోలీసులు ఆ దిశగా విచారణ చేబట్టగా సమీప ప్రాంతాల్లో గల రైలు పట్టాలపై ఎలాంటి మృతదేహం లభించలేదు. అటవీ ప్రాంతంలో ఏదైనా గుర్తుతెలియని శవం వుంటే వాకబు చేయాలని ఆయా ప్రాంతాల పోలీసులను కోరినా ఎక్కడా ఎలాంటి మృతదేహం కనపించలేదు. దీంతో నిందితుడు బతికే ఉన్నాడని, తప్పించుకుని పారిపోయాడని నిర్ధారణకు వచ్చిన పోలీసులు అతని కోసం గాలింపు చేబట్టారు. హత్యల సందర్భంగా అతను వాడిన కారును షాద్‌నగర్ సమీపంలో గల నందిగామ వద్ద బెంగళూరు జాతీయ రహదారిపై తిమ్మాపూర్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిని షాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇతన్ని పట్టుకునేందుకు 12 ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలో దించారు. నిందితుడి ఆచూకి చెప్పిన వారికి రెండు లక్షల రూపాయల రివార్డు ఇస్తామని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్‌జోషి ప్రకటించడం తెలిసిందే. మరోవైపు నిందితుడి ఫోటోను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పంపి బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లలో గాలింపు చేబట్టారు. రాజ్‌కుమార్ శ్రీశైలంకు పారిపోయి ఉండవచ్చని అనుమానాలు రావడంతో అక్కడికి ఓ బృందాన్ని పంపారు. హత్యలకు ముందు ఇతను వాడిన సెల్‌ఫోన్‌లోని సిమ్‌కార్డుల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇతని ఫోన్‌కాల్ డేటాను పరి శీలిస్తున్నారు. ఈ కేసును కమిషనర్ తరుణ్ జోషితోపాటు చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతం స్వయంగా విచారిస్తున్నారు.

# పోలీసుల అదుపులో షాబాద్ నిందితుడు?

## రాజ్‌కుమార్ చిక్కలేదు : చేవెళ్ల డిసిపి యోగేష్‌గౌతమ్

**చేవెళ్ల, జులై 12, ప్రభాతవార్త:** శనివారం రాత్రి షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల నిందితుడు రాజ్‌కుమార్‌ను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు ప్రచారమవుతోంది. ఆరుగురి దారుణ హత్యల ఉదంతం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ మారణ హోమానికి ఒడిగట్టిన ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొత్తూరు మండలం కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన బండారు సుధాకర్ తాను నిందితుడు రాజకుమార్‌ను ప్రత్యక్షంగా చూశానని వెల్లడించారు. ప్రత్యక్ష సాక్షి బండారు సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు రాజ్‌కుమార్ తప్పించుకునే క్రమంలో కుమ్మరిగూడెం పరిసర ప్రాంతాల్లో తిరిగడని తెలిపారు. తాను రోడ్డుపై వెళ్తుండగా ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడని, పరిశీలించి చూడగా ఆరుగురిని చంపిన కిరాతకుడు రాజ్‌కుమార్ కావడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యానని బండారు సుధాకర్ తెలిపారు.. ఇంత దారుణానికి ఒడిగట్టి కూడా ఎలాంటి భయం లేకుండా తిరుగుతున్న అతడినిచూసి ఏం చేయాలో తెలియలేదని సుధాకర్ వెంటనే క్షణాల వ్యవధిలో చుట్టుముట్టిన పోలీసులు నిందితుడు రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వ్యూహాత్మకంగా వ్యవహరించిన పోలీసులు నిందితుడు రాజ్‌కుమార్ తప్పించుకునే అవకాశం ఇవ్వకుండా పోలీసులు చుట్టుముట్టారని చెప్పారు. నిందితుడి కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు క్షణాల వ్యవధిలోనే రంగంలోకి దిగి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఆరు హత్యల కేసు నిందితుడు రాజ్‌కుమార్ పోలీసులకు చిక్కాడంటూ జరుగుతున్న ప్రచారంపై చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతం స్పందించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ షాబాద్ ఆరు హత్యల కేసులో దర్యాప్తును వేగవంతం చేశామని తెలిపారు. నిందితుడి కోసం మొత్తం తొమ్మిది బృందాలతో గాలిస్తున్నామని.

నిందితుడు చేగురు రైల్వే ట్రాక్ దాటి అడవి ప్రాంతంలోకి వెళ్లినట్లు అనుమానిస్తున్నామన్నారు. రాజ్‌కుమార్ తన మొబైల్ ఫోన్‌ను శుక్రవారం రాత్రి 11:47 స్విచ్ ఆఫ్ చేశాడు. అతడి కోసం రైల్వే పోలీస్, ట్రాకింగ్ టీమ్, హ్యూమన్ ఇన్వెస్టిగేషన్, టెక్నికల్ టీమ్స్‌తో 9 బృందాలు గాలిస్తున్నాయి. రాజ్ కుమార్ పోలీసులకు చిక్కినట్టు మీడియాలో వస్తున్న విషయం వాస్తవం కాదని స్పష్టం చేశారు.

# నిర్మల్ జిల్లా రంజనీతండాలో ప్రమాదం

## క్షణాల్లో కళ్లముందే కాలిపోయిన కారు

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** నిర్మల్ జిల్లాలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న ప్రమాదంలో ఒక కారు క్షణాల వ్యవధిలో అందరు చూస్తుండగానే మంటలకు ఆహుతయ్యింది. జిల్లాలోని కుబీర్ మండలం రంజనీ తండాలో వ్యక్తిగత పనుల నిమిత్తం కారులో వచ్చిన జామ్గాం గ్రామానికి చెందిన పండరి అనే వ్యాపారి కిరాణా దుకాణంలో వస్తువులు కొనేందుకు కారును రోడ్డు పక్కన ఆపాడు. అయితే ఆయన కారును ఆపి కిరాణా దుకాణానికి వెళ్లిన కొన్ని క్షణాల తరువాత కారులో వున్నట్లుండి మంటలు చెలరేగాయి. కారులో మంటలు ఎందుకు చెలరేగాయనే దానికి కారణాలు తెలియడం లేదని పండరి తెలిపాడు. అయితే మంటల్లో చిక్కుకున్న కారును కాపాడేందుకు స్థానికులు బక్కెట్లు, బిందెలతో నీ టిని పోసినా ప్రయోజనం లేకుండా పోయింది. అందరు చూస్తుండగానే కారు పూర్తిగా కాలిపోయింది. అయితే కారు మంటల్లో చిక్కుకుని కాలి పోయిన సమయంలో అందులో ఎవరూ లేకపోవడం, యజమాని పండరి కూడా ముందుగానే దిగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీనిపై కుబీర్ పోలీసులకు బాధితుడు పండరి ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కుబీర్ ఎస్ఐ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై స్పష్టత లేదని, దీనిపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం

**స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్**

జిల్లా విద్యాధికారి మరియు ఎక్స్-అఫీషియో ప్రాజెక్ట్ ఆఫీసర్ కార్యాలయం, సమగ్ర శిక్ష, హైదరాబాద్ జిల్లా

**టెండర్ నోటిఫికేషన్**

టెండర్ నోటీసు నెం.: 1951/B6/SS/2026-27 తేదీ:- 10-07-2026

హైదరాబాద్ జిల్లాలోని 253 ప్రీ-ప్రైమరీ పాఠశాలలకు (సెక్షన్లకు) ఫర్నిచర్, ఇండోర్ మరియు అవుట్‌డోర్ ఆట వస్తువులు, ఒక్కో పాఠశాలకు రూ.1,00,000 (లక్ష రూపాయలు మాత్రమే) విలువైన బాల పెయింటింగ్ సరఫరా కొరకు సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి.

| క్ర. సం. | టెండర్ ఐటమ్ | అవసరమైన యూనిట్ల సంఖ్య | టెండర్ డాక్యుమెంట్ ధర | EMD ధర |
|---|---|---|---|---|
| 01. | ఇంటి లోపలి ఫర్నిచర్: పిల్లలకు అనువైన కుర్చీలు, బల్లలు, సెల్ఫ్ పెట్టెలు, పుస్తకాల అరలు, ఉపాధ్యాయుల బల్ల, కుర్చీ జాబితా ప్రకారం | జాబితా ప్రకారం | రూ. 5000/- (ఐదు వేల రూపాయలు మాత్రమే) | రూ. 5,06,000/- (ఐదు లక్షల ఆరు వేల రూపాయలు మాత్రమే) |
| 02. | బహిరంగ & ఇండోర్ ఆట సామగ్రి: ఆట బల్లలు, ఇంద్రధనుస్సు నిచ్చెన, పైకి క్రిందికి ఆడే సీ-సా, ఊయల నిచ్చెన, యాక్టివిటీ స్టేషన్లు మొదలైనవి. అన్ని వస్తువులు పిల్లల భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి మరియు ప్రీ-ప్రైమరీ, ప్రైమరీ పాఠశాలల వాతావరణాలకు మరియు బాల పెయింటింగ్స్‌కు అనుకూలంగా ఉండాలి. | జాబితా ప్రకారం | | |

టెండర్ పత్రాల విక్రయం: 14-07-2026 నుండి 18-07-2026 వరకు మ.03.00 గం. వరకు. టెండర్ల సమర్పణకు చివరి తేదీ: 18-07-2026 సా.05.00 గం. వరకు. సీల్డ్ టెండర్లను తెరవడం: 20-07-2026 ఉ.11.00 గం. స్థలం: అదనపు కలెక్టర్ ఛాంబర్, కలెక్టరేట్, హైదరాబాద్. టెండర్ల ఫారం ఖర్చు మరియు EMD డిమాండ్ డ్రాఫ్ట్ ఖర్చును "జిల్లా విద్యాధికారి, హైదరాబాద్ జిల్లా" వారి పేరిట డ్రా చేయాలి. టెండర్ల ఫారం, ముసాయిదా నిర్దేశాలు మరియు ఇతర సమాచారాన్ని పని దినాలలో హైదరాబాద్ జిల్లా విద్యాధికారి కార్యాలయం నుండి పొందవలెను.

DIPR.No.5938-PP/CL/Advt/1/2026-27, తేదీ: 12.07.2026 జిల్లా విద్యా అధికారి, హైదరాబాద్ జిల్లా

వార్త


ధైర్యం ఒక ఆయుధం, దాన్ని పట్టుకుంటే అసాధ్యాలన్నీ సుసాధ్యాలౌతాయి.

- జి. ఇలియట్

# చేదు వాస్తవం!

క్యాన్సర్ ప్రాణాంతకమేమీ కాదన్న శాస్త్రజ్ఞుల భరోసా ఉన్నా ఎంతో మంది రోగులకు ఇప్పటికీ నాణ్యమైన వైద్యం అందుబాటులో లేదని ఎన్నో సంఘటనలు రుజువు చేస్తున్నాయి. ఎన్నో కొత్త కొత్త ఔషధ ప్రయోగ ఆవిష్కరణలున్నా, ఆ రుగ్మతపై వస్తున్న సమాచారం ఇప్పటికీ మానవాళిని భయపెడుతూనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఐదుగురిలో ఒకరు కేన్సర్ బారిన పడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదికలో వెల్లడించింది. ప్రపంచంలో తాము కేన్సర్ రోగులపై చేసిన అధ్యయనాలు, తాజా అంకెల సేకరణను బట్టి 92శాతం మంది తమ జీవితంలో ఏదో ఒకసారైనా కేన్సర్‌కు ప్రభావితమైనవారేనని వివరించింది. కేన్సర్ నిర్ధారణ నుంచి నివారణ, చికిత్స విధానాలు, భరోసా వంటి అన్ని సందర్భాల్లోను రోగులు నిరాదరణకు గురవుతున్నారన్న అభిప్రాయాన్ని 'హు' వెల్లడించింది. ఈ వ్యాధిలో లక్షలాది మంది శారీరక భావోద్వేగ, ఆర్థిక కష్టనష్టాలను చవిచూశారని అంచనా. ఎన్నో కేన్సర్ రోగాల గురించి అవగాహన లేకపోవడమే కారణం కావొచ్చు. ఎందరో రోగులకు వైద్యసేవలు అందడమేలేదని డబ్ల్యుహెచ్ఓ అంగీకరించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతమున్న వైద్య చికిత్సల్లో సవాళ్ల కేన్సర్‌కేనని చెప్పాలి. అంతర్జాతీయ కేన్సర్ పరిశోధనా సంస్థతో కలిసి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ నివేదిక విడుదల చేసింది. యేటా ప్రపంచ వ్యాప్తంగా 2.6కోట్ల కొత్త కేన్సర్ కేసులు నమోదవుతుండగా, కనీసం కోటి మరణాలు సంభవిస్తున్నాయని ఆ నివేదిక తెలుపుతోంది. జనాభా పెరుగుదల, వృద్ధాప్యం, మారుతున్న జీవనశైలి కారణంగా 2050 నాటికి కేసుల సంఖ్య సుమారు 3.5 కోట్లకు చేరుకుంటుందని తెలిపింది. ఇప్పటికే ఆరోగ్య సంరక్షణ విధానాలపై ప్రభుత్వాలు ఎంతో వ్యయపరుస్తున్నా కేన్సర్ రోగుల అవసరాలకు తగినంతగా ప్రయోజనం చేకూరడం లేదనే అపోహలున్నాయి. సాధారణంగా ప్రాథమిక దశలోనే గుర్తిస్తే కేన్సర్ నయమవుతుందన్న భరోసా ఒకటున్నా ఆతర్వాత దశల మాటేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తాజాగా ప్రఖ్యాత ఆంకాలజిస్టు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు చెప్పిన మాటలు వింటుంటే కేన్సర్ రోగికి ప్రాణం లేచొస్తోంది. నాలగవ దశలో ఉన్న కేన్సర్‌ను కూడా తగ్గించవచ్చునని స్పష్టంగా చెబుతున్నారు. ముందు వ్యాధి లక్షణాలు తెలియగానే నిర్ధారణ చికిత్స విధానాలకు ఒక్కో రోగికి అత్యధిక మొత్తంలో ఖర్చు చేసుకోవాల్సి రావడమే కేన్సర్ రోగిని బాధించే విషయం. ఆ తర్వాతనేచికిత్సల ఖర్చు. గత అయిదారేళ్లుగా కేన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు రావడం శుభసూచకమే. జనాన్ని ప్రభావితం చేయగల కేన్సర్ వారియర్ సెలబ్రిటీలు కూడా కేన్సర్ రోగులకు రుగ్మతల నుంచి బయటపడి మార్గదర్శకులుగా సమాజానికి హితవు చెప్పగలుగుతున్నారు. వారి స్ఫూర్తితో మరెంతో మంది కేన్సర్ రోగులు బతుకు మీద ఆశలు పెంచుకుంటున్నారు. కేన్సర్ నాలుగోదశలో శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తుంది. ఇతర దీర్ఘకాలిక వ్యాధుల్లాగే ట్రీట్ చేస్తూ అత్యాధునిక చికిత్సల ద్వారా కొన్ని జీవిత కాలాన్ని పెంచే కృషిలో ఆంకాలజిస్టులు నిమగ్నమవుతున్నారు. టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునో థెరపీ వంటి ఆధునిక పద్ధతులతో కేన్సర్ వృద్ధిని అదుపులో ఉంచి రోగి జీవనప్రమాణాన్ని పెంచగలుగుతున్నారు. తాజాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రపంచానికి ఓ చేదు వాస్తవాన్ని వెల్లడించినట్లయింది. కేన్సర్ చికిత్సలో గణనీయ పురోగతి సాధించినట్లు భావిస్తున్న తరుణంలో కేన్సర్ రోగుల వ్యాప్తి అంశాలు వైద్యరంగానికి ఓ మేలుకొలుపులాగే చెప్పుకోవాలి. శాస్త్ర ప్రయోజనాలు ప్రతి రోగికి చేరడంలో అసమానతలు ఉన్నాయన్న అంశంపై చిత్తశుద్ధితో ప్రభుత్వాలు సరిచేయకపోతేకోట్లాది మంది ప్రాణాలకు ఆయువు తీరినట్లే. కేన్సర్ వ్యాధికి చికిత్స అంటే రోగి శరీరంలోని రోగనిరోధక వ్యవస్థతో నిరంతరపోరాటమే. అధిక ఆదాయ దేశాల్లో కేన్సర్ నిర్ధారణ, ఔషధాలు, రేడియోథెరపీ వంటి చికిత్సలు సులువుగా అందుతున్నాయి. పేద,మధ్యస్థ ఆదాయ దేశాలలో ఎంతో మందికి రోగులకు ప్రాథమిక చికిత్సలే అందుబాటులో లేవన్న ఆందోళనలున్నాయి. అందుకే కేన్సర్ రోగుల కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి వేయబడుతున్నాయి. భారత్ వంటి దేశాలకు 'హు' నివేదిక ఒక హెచ్చరికవంటిదే. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సైతంప్రత్యేక కేన్సర్ కేంద్రాల ఏర్పాటు వైద్యనిపుణుల నియామకం, వగైరా సమగ్ర ఆరోగ్య వ్యవస్థను సిద్ధం చేయాలి. ఈ నివేదిక వెలుగు చూడడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వైద్యవిధానాల కోసం చేస్తున్న ఏర్పాట్లు ఏమాత్రం చాలవని అర్థమౌతోంది. అంతేకాకుండా ప్రస్తుత వాతావరణ, సామాజిక పరిస్థితుల్లో కేన్సర్ ఇమ్యూనిటీపై మరిన్ని పరిశోధనలు అవసరం. విదేశీ శాస్త్రీయ విజ్ఞానమే కాకుండా స్వదేశీ విజ్ఞానంలో అద్భుతాలు చేయగలిగిన నైపుణ్యత భారతీయుల్లో ఉంది. దానిని సద్వినియోగం చేసుకోవాలి. దేశంలో హృద్రోగ మరణాల తర్వాత కేన్సర్ మరణాలదే ద్వితీయ స్థానం.82 శాతం దేశాలు జాతీయ కేన్సర్ నియంత్రణ ప్రణాళికలను రూపొందించుకున్నాయి. కానీ అవిచాలవు. ప్రపంచంలోనిమూడింట ఒక వంతు దేశాలు మాత్రమే తమ సార్వత్రిక ఆరోగ్య బీమా పథకాల్లో కేన్సర్ పరిరక్షణకు నడుం కట్టాయి. సంపన్న అభివృద్ధి చెందిన దేశాల్లో రొమ్ముకేన్సర్ బారినపడిన మహిళల్లో 87 శాతం మంది ఐదేళ్లకు పైగా జీవిస్తున్నారు. భారత్‌లో గర్భాశయ ముఖద్వారా కేన్సర్‌దే అగ్రస్థానం. దీనిపై శ్రద్ధపెట్టే బాధ్యత కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వశాఖ. ఆంకాలజిస్టులదే ఆ దిశా మార్పు జరిగితే కేన్సర్‌కు చెక్‌పెట్టవచ్చు.

> డబ్బు ఉన్నప్పుడు ఎడాపెడా ఖర్చు చేయడం, లేనప్పుడు ఇతరుల దగ్గర చేతులు చాచడం వల్ల మన వ్యక్తిత్వం దెబ్బతింటుంది.
>
> మహాత్మా గాంధీ



> అందరిలోనూ శక్తిసామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగించుకోవడంలోనే అసలు సమస్య ఉంటుంది.
>
> రామకృష్ణ పరమహంస



## ప్రజావాక్కు



### ఆహార ధరలను ఎందుకు తగ్గించడం లేదు?

కేంద్ర ప్రభుత్వం గతవారం వాణిజ్య అవసరాల కోసం వాడేఎల్పీజీ సిలిండర్ ధరను రూ.183.50 తగ్గించింది. ధరల పెంపుతో అసంతృప్తిగా ఉన్న హోటళ్లకు ఇది కొంత ఉపశమనం కలిగించింది. ప్రస్తుత బ్లాక్ మార్కెట్ కారణంగా సిలిండర్ల అమ్మకాలుతగ్గడంతో సరఫరా గొలుసు సాధారణ స్థితికి వచ్చింది. అయితే, హోటల్స్ లో దొరికే టిఫిన్,భోజనం,కాఫీ,టీ,ధరలు మాత్రం తగ్గలేదు. హోటల్ యజమానులు ధరలు తగ్గించకపోవటంతో వినియోగదారులు చాలా నిరాశ చెందుతున్నారు. సిలిండర్ ధరను యాభైలేదా వంద రూపాయలు పెంచిన వెంటనే, ఒక రకమైనటిఫెన్,భోజనం,టీ,కాఫీ ధరలను అమాంతం పది రూపాయలు పెంచారు. సిలిండర్ ధరల తగ్గింపు హోటళ్లకు ప్రయోజనకరమైనప్పటికీ, ఇది వినియోగదారులకు చాలా భారంగా మారింది. ధరల నియంత్రణకు సంబంధించి స్పష్టమైన నిబంధనలు అవసరం.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### అతివేగం అనర్థదాయకం

పెరుగుతున్న వాహనాల సంఖ్య, మితిమీరిన వేగం కారణంగా నేడు రోడ్డుప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఎందరో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి. రోడ్లను ప్రమాదరహితంగా మార్చడం అనేది కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం. రహదారి భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించడంవల్ల కలిగే పరిణామాలు అత్యంత భయంకరంగా ఉంటున్నాయి. ప్రమాదాల నివారణకు రహదారుల రూపకల్పనలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, రాత్రి వేళల్లో వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి.

- సి. సాయిరుత్విక్, శ్రీకాకుళం

### మొబైల్ వాడకాన్ని తగ్గించాలి

మానవ జీవితంలో నీరు,ఆరోగ్యం, ఆహారం,నిద్ర చాలా విలువైనవి.మానవుడు ఆర్యోగంగాఉండాలంటే పౌష్టికాహారమే కాదు సరైన నిద్ర కూడా అవసరం. ప్రధానంగా సాధారణ మనిషికి 8 నుండి 10 గంటల నిద్ర చాలు అయినప్పటికీ కొందరు వ్యక్తులు అతి నిద్ర పోతుంటారు. ఇలాంటి వ్యక్తుల ఆరోగ్యం సమతుల్యత లేకపోవడంతో భవిష్యత్తులో దెబ్బతినే అవకాశాలు మెండుగాఉంటాయి. నిద్ర సమయాన్ని పాటిస్తేనే ఆరోగ్యం బాగుంటుంది.

- ఎమ్. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### టీచర్లకు పరీక్షలు

ఇన్ సర్వీస్ టీచర్లకు, ప్రత్యేకించి ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న టీచర్లకు( టెట్), టీచర్ ఎజిబిలిటీ టెస్ట్ తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలని నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ 2020 ప్రాప్తి మేరకు టీచర్లు అప్డేట్‌గా ఉండాలని ఆ టెస్ట్ 2028 లోగా ఉత్తీర్ణులు అవ్వాలని ఎవరైతే ఇంతకుముందు ఆ టెస్ట్ రాయకుండా ఉద్యోగంలో చేరారో వారు కచ్చితంగా ఉత్తీర్ణులు కావాల్సిందేనని సుప్రీంకోర్టు తీర్పుఇవ్వడం ఆ తీర్పును అమలు జరపడానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు ముందుకు రావడం విడ్డూరం. ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రతి డిపార్ట్మెంట్కు ప్రమోషన్లు ఉంటాయి. కానీ ప్రభుత్వ పాఠశాలలోని టీచర్ల ప్రమోషన్లు చాలావిడ్డూరంగా ఉంటున్నాయి.కొత్తగా ఆనాడు వచ్చిన మార్కుల ఆధారంగా ఎక్కువ మార్కులు వచ్చిన వారి పేరు ముందు పెట్టి రిజర్వేషన్లలో కూడా అలాగే పాటించి తమకు నచ్చిన వారిపేర్లు ముందుపెట్టి రోస్టర్ పాయింట్స్ గందరగోళంచేసి మార్చడం ఎంతవరకు సమంజసం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### పెరుగుతున్న మోసాలు

ఆధార్‌ను ఆసరా చేసుకొని ప్రభుత్వాలు ప్రజలతో ఆడుకుంటున్నారు. డేట్‌ఆఫ్ బర్త్ చేంజ్ ఒకసారి, నేమ్ చేంజ్ లేదా స్పెల్లింగ్ కరెక్షన్స్ రెండుసార్లు పరిమితి పెట్టారు. మానవ తప్పిదాలు సహజంగా జరుగుతాయి. స్పెల్లింగ్ మిస్టేక్స్ రావడం ప్రింట్ పొరపాట్లు జరగడానికి అవకాశాలుంటాయి. దేశం బోర్డర్లో ఉన్న ప్రజలకు కఠినమైన నిబంధనలు ఉండడం అర్థం ఉంటుందేమో కానీ అందరికీ ఇలా ఇబ్బంది పెట్టడం తగదు. అన్నింటికీ ఆధార్ ఉపయోగిస్తున్నారు. అన్నింటితో ఆధార్‌ని లింక్ చేస్తున్నారు. ప్రజలందరూ డేటా సెంటర్ల చుట్టూ తిరగడానికే సరిపోతూఉన్నది. నిజానికి ఓటు వేయడానికి చేతి వేలి ముద్రలు, కన్నులు ఐరిష్ మ్యాచ్ అయితే దొంగ ఓట్లు వేయడానికి అసలు అవకాశం ఉండదు.

- వి. నీరజ, హైదరాబాద్

### మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల భవనాలు దాదాపుగా ఆధునీకరించబడినవి. ఏ ప్రభుత్వ కార్యాలయం అయినా మార్పులు చేసేటప్పుడు ప్రధానంగా పారిశుధ్యపు వసతి, నీటి సరఫరా, విద్యుత్ కలిపే చేస్తారు. మరి మహిళలకు ఒకటి వేరేగా వాష్‌రూమ్ ఉంటేనే సిబ్బంది, విద్యార్థినీలకు ఇబ్బంది ఉండదు. విద్యాశాఖ ఈ వసతి కూడా లేని పాఠశాలల్లో వాష్‌రమ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

-బి. మేఘనాదం, విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)


# చదువే పేదరిక నిర్మూలనకు మార్గం

**ఒక కుటుంబంలో ఒకరు ఉన్నత విద్యను పూర్తి చేసి స్థిరమైన ఉద్యోగం సాధిస్తే ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి పూర్తిగా మారుతుంది. కుటుంబ ఆదాయం పెరుగుతుంది. అప్పుల భారం తగ్గుతుంది. తల్లిదండ్రులకు భరోసా లభిస్తుంది. తదుపరి తరానికి మెరుగైన విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలు అందుబాటులోకి వస్తాయి. ఈ విధంగా విద్య ఒక వ్యక్తి జీవితాన్నే కాకుండా మొత్తం కుటుంబాన్ని, సమాజాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తిగా మారుతుంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా విద్యను పేదరిక నిర్మూలనకు అత్యంత శక్తివంతమైన సాధనంగా గుర్తిస్తున్నారు. ప్రభుత్వం విద్యపై చేసే ప్రతి రూపాయి ఖర్చు వ్యయం కాదు, అది మానవ వనరుల అభివృద్ధిపై, రాష్ట్ర భవిష్యత్తుపై చేసే అత్యంత విలువైన పెట్టుబడి.**



మన్నారం నాగరాజు

విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాదు, సమాజప్రగతికి, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, దేశ భవిష్యత్తుకు కూడా మూలాధారం. భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన విద్యావకాశాలను కల్పించాలనే లక్ష్యంతో సామాజిక న్యాయ స్ఫూర్తిని ప్రతిష్ఠించింది. ముఖ్యంగా ఆర్థికంగావెనుకబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వం ప్రత్యేక బాధ్యత తీసుకోవాల్సిందే. ఈ నేపథ్యంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు కేవలం సంక్షేమ కార్యక్రమాలు మాత్రమే కాదు, అవి సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజ్యాంగ విలువలను ఆచరణలో నిలబెట్టిన చారిత్రాత్మక సంస్కరణలు. ఈపథకాల ద్వారా లక్షలాది మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, న్యాయశాస్త్రం, డిగ్రీ, పీజీ, నర్సింగ్,మేనేజ్‌మెంట్, ఇతర వృత్తి విద్యా కోర్సులను అభ్యసించి దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించారు. చదువుతో ఒక్క విద్యార్థి మాత్రమే కాదు, అతని కుటుంబం, తదుపరి తరం కూడా పేదరికం నుంచి బయటపడగలదని ఈ పథకం స్పష్టంగా నిరూపించింది.ఒక కుటుంబంలో ఒకరు ఉన్నత విద్యను పూర్తి చేసి స్థిరమైన ఉద్యోగం సాధిస్తే ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి పూర్తిగా మారుతుంది. కుటుంబ ఆదాయం పెరుగుతుంది. అప్పుల భారం తగ్గుతుంది. తల్లిదండ్రులకు భరోసా లభిస్తుంది. తదుపరి తరానికి మెరుగైన విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలు అందుబాటులోకి వస్తాయి. ఈ విధంగా విద్య ఒక వ్యక్తి జీవితాన్నే కాకుండా మొత్తం కుటుంబాన్ని, సమాజాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తిగా మారుతుంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా విద్యను పేదరిక నిర్మూలనకు అత్యంత శక్తివంతమైన సాధనంగా గుర్తిస్తున్నారు. ప్రభుత్వం విద్యపై చేసే ప్రతి రూపాయి ఖర్చు వ్యయం కాదు, అది మానవ వనరుల అభివృద్ధిపై, రాష్ట్ర భవిష్యత్తుపై చేసే అత్యంత విలువైన పెట్టుబడి.2008లో ప్రారంభమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం భారత సంక్షేమ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన విద్యా సంస్కరణలలో ఒకటిగా నిలిచింది. పేదరికం కారణంగా ఉన్నత విద్యకు దూరమవుతున్న లక్షలాది మంది విద్యార్థులకు ఈ పథకం ఆశాకిరణంగా మారింది. గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ కూలీలు, చిన్న రైతులు, కార్మికులు, చిరు వ్యాపారుల కుటుంబాలకు చెందిన యువత వైద్యులు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు,బ్యాంకు అధికారులు, ఐటీ నిపుణులు, పారిశ్రామికవేత్తలుగాఎదిగారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దడంలోనూ, పరిశ్రమలు, ఫార్మా, బయోటెక్నాలజీ, సేవారంగం, స్టార్టప్‌ల అభివృద్ధికి అవసరమైన నైపుణ్య మానవ వనరులను అందించడంలోనూ ఈ పథకం కీలక పాత్రపోషించింది. ఈ అభివృద్ధి వల్ల రియల్ ఎస్టేట్, రవాణా, ఆరోగ్యం, విద్య, సేవారంగం వంటి అనుబంధ రంగాలు కూడా విస్తరించాయి. రాష్ట్ర ఆదాయం, ఉపాధి అవకాశాలు, తలసరి ఆదాయం పెరగడంలో కూడా ఈ పథకం పరోక్షంగా విశేష పాత్ర పోషించిందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఈపథకం ప్రభుత్వాల దయాదాక్షిణ్యంతో అమల్లోకి వచ్చినది కాదు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో జరిగిన ఉద్యమాల ఫలితమే ఇది. 'చదువే పేదరిక నిర్మూలనకు మార్గం' అనే సామాజిక తత్వానికి ఈ పథకం



ప్రతీకగా నిలిచింది. అందువల్ల దీనిని సాధారణ సంక్షేమ పథకంగా కాకుండా సామాజిక హక్కుగా చూడాల్సిన అవసరం ఉంది.అయితే ఇటీవలి కాలంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో చోటుచేసుకున్న జాప్యం విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు వేల కోట్ల రూపాయలకు చేరినట్లు వెల్లడవుతోంది. ప్రభుత్వ నిధులు సమయానికి విడుదల కాకపోవడంతో అనేక మంది విద్యార్థులు ఫీజులు చెల్లించలేక చదువులు మధ్యలో నిలిపివేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కళాశాలలు ప్రభుత్వ చెల్లింపులకోసం ఎదురుచూస్తూ బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని నిర్వహణ కొనసాగించాల్సి వస్తోంది. అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లించడం కష్టమవుతోంది. ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, ఇతర మౌలిక సదుపాయాల నిర్వహణ కూడా ప్రభావితమవుతోంది. దీని ప్రభావం నేరుగా విద్యా నాణ్యతపై పడుతోంది. ఇంకా ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ప్రభుత్వ బకాయిలు విడుదల కాకపోవడంతో అనేక మంది విద్యార్థులు తమ విద్యా సర్టిఫికెట్లు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతవిద్య, విదేశీ విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అవకాశాలను కోల్పోతున్నారు. ఒక విద్యార్థి భవిష్యత్తు అనిశ్చితిలో పడితే, దాని ప్రభావం అతని కుటుంబంపైనే కాదు, సమాజంపైనా పడుతుంది. చదువు ఆగిపోవడం వల్ల నిరుద్యోగం పెరుగుతుంది. నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత ఏర్పడుతుంది. సామాజిక అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది.ఈ నేపథ్యంలో ప్రభుత్వం 'బడ్జెట్ లేదు' అనే కారణాన్ని చూపడం సమంజసంగా కనిపించదు. ప్రతి సంవత్సరం సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలకు బడ్జెట్ కేటాయించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన, పరిపాలనా బాధ్యత. రాష్ట్ర ఖజానాకు పన్నుల రూపంలో, కేంద్ర నిధుల రూపంలో, భూముల విక్రయాల ద్వారా, ఇతర ఆర్థిక వనరుల ద్వారా భారీ ఆదాయం సమకూరుతున్నప్పుడు, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నిధులను మాత్రమే విడుదల చేయలేకపోవడం ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ పరిస్థితి ఒక్కసారిగా ఏర్పడలేదు. ప్రతి సంవత్సరం అవసరమైన నిధులనుక్రమం తప్పకుండా విడుదల చేయకపోవడం వల్లే బకాయిలు పేరుకుపోయాయి. వార్షిక బడ్జెట్‌లో ముందుగానే తగిన నిధులు కేటాయించి, త్రైమాసికం లేదా ఆరు నెలలకొకసారి విడతల వారీగా విడుదల చేసి ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదు. ప్రణాళికాబద్ధమైన ఆర్థిక నిర్వహణ ఉంటే కళాశాలలు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఇంతటి ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన అవసరం ఉండేది కాదు. అందువల్ల భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా శాశ్వత ఆర్థిక విధానాన్ని ప్రభుత్వం రూపొందించాల్సిన అవసరం ఉంది. ఇటీవల తీసుకొచ్చిన జీవో నెం.9 కూడా విద్యార్థుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విద్యార్థుల ఖాతాల్లో జమ చేసి,నిర్దిష్ట గడువులోపు కళాశాలలకు చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ చట్టం కింద చర్యలు తీసుకుంటామని పేర్కొనడం సంక్షేమ పథకాల అసలులక్ష్యానికి విరుద్ధంగా కనిపిస్తోంది. పేద విద్యార్థులుఉద్దేశపూర్వకంగా ఫీజులు చెల్లించకుండా ఉండరు.వారికి ఆర్థిక, సాంకేతిక, పరిపాలనా సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది.అలాంటి పరిస్థితుల్లో వారిపై శిక్షాత్మక నిబంధనలు విధించడంకంటే, వారికి అనుకూలమైన పరిపాలనా విధానాన్ని రూపొందించడం ప్రభుత్వ బాధ్యత. గతంలో అమలులో ఉన్న విధంగా ప్రభుత్వం నేరుగా కళాశాలల ఖాతాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేస్తే పారదర్శకత, సౌలభ్యం రెండూ పెరుగుతాయి. అందువల్ల జీవో నెం.9లోని వివాదాస్పద నిబంధనలను ప్రభుత్వం పునఃసమీక్షించడం సముచితంగా ఉంటుంది. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న విధానాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరంఉంది. అక్కడ అర్హులైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలులో దశలవారీ చెల్లింపుల విధానం కొనసాగుతోందని ప్రభుత్వం పేర్కొంటోంది. విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా, కళాశాలలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా నిధులు విడుదల చేసే వ్యవస్థపై దృష్టి సారిస్తోంది. మంచి పరిపాలన అంటే ఇతర ప్రాంతాల్లో అమలవుతున్న సమర్థవంతమైన విధానాలను అధ్యయనం చేసి ప్రజల ప్రయోజనాల కోసం స్వీకరించడం. విద్యలో పెట్టుబడి పెట్టడం అంటే కేవలం వ్యక్తిగత అభివృద్ధికే కాదు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికీ దోహదపడటం. ●

# భారత్ భవిష్యత్తుకు అరుదైన ఖనిజాలే ఆధారం

సి.హెచ్.ప్రతాప్

ఇరవై ఒకటో శతాబ్దంలో చమురు ఎంత వ్యూహాత్మక వనరో, రానున్న దశాబ్దాల్లో అరుదైన ఖనిజాలు చమురుతో సమానమైన వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి. లిథియం, కోబాల్ట్, నికెల్, గ్రాఫైట్, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ వంటి ఖనిజాలు విద్యుత్ వాహనాలు, సెమీకండక్టర్లు, మొబైల్ ఫోన్లు, సౌర విద్యుత్ ప్యానెల్లు, విండ్ టర్బైన్లు, రక్షణ రంగం, అంతరిక్ష సాంకేతికత, కృత్రిమ మేధ, అధునాతన సమాచార వ్యవస్థలకు జీవనాడిగా మారాయి. భవిష్యత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సాంకేతిక ఆధిపత్యాన్ని నిర్ణయించే శక్తిగా ఈ ఖనిజాలు ఎదుగుతున్నాయి. అందువల్ల అరుదైన ఖనిజాల భద్రత భారతదేశ ఆర్థికాభివృద్ధికి మాత్రమే కాకుండా, జాతీయ భద్రతకు, ఇంధన స్వావలంబనకు, పారిశ్రామికపురోగతికి, సాంకేతిక స్వాతంత్ర్యానికి కూడా అత్యంత కీలకంగా మారింది. భారత ప్రభుత్వం ఇప్పటికే 30 ఖనిజాలను 'క్రిటికల్ మినరల్స్'గా గుర్తించింది. వీటిలో 24 ఖనిజాలను గనులు ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) చట్టం తొలి షెడ్యూల్‌లోని పార్ట్ డిలో చేర్చి, వాటి అన్వేషణ, వేలం, తవ్వకాల ప్రక్రియలను వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక అధికారాలు కల్పించింది. 2025లో ప్రారంభమైన జాతీయ క్రిటికల్ మినరల్ మిషన్ కింద 2030-31 నాటికి 1,200 అన్వేషణ ప్రాజెక్టులు చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించారు.ఈమిషన్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.16,300 కోట్ల ప్రత్యక్ష వ్యయాన్ని కేటాయించగా, ప్రభుత్వ రంగ సంస్థలు,ఇతర భాగస్వాముల ద్వారా మరో రూ.18,000 కోట్ల పెట్టుబడులను సమీకరించే లక్ష్యాన్ని నిర్దేశించింది. మొత్తంగా ఈ మిషన్ పరిమాణం రూ.34,300 కోట్లు. ఇది కేవలం గనుల అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదు, దేశ పారిశ్రామిక, ఇంధన, సాంకేతిక భద్రతను బలోపేతం చేసే జాతీయ వ్యూహం కూడా. అయితే భారతదేశం ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు దిగుమతులపై అధికంగా ఆధారపడటమే. లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి పలు కీలక ఖనిజాల అవసరాలను ప్రస్తుతం భారత్ ప్రధానంగా దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. ప్రపంచ సరఫరా గొలుసులో కొద్ది దేశాలపై అధికంగా ఆధారపడటం వ్యూహాత్మక ప్రమాదాలకు దారితీస్తుంది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఎగుమతి ఆంక్షలు లేదా యుద్ధపరిస్థితులు ఏర్పడితే విద్యుత్ వాహనాలు, బ్యాటరీలు,ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, రక్షణ పరికరాల తయారీరంగాలు తీవ్రప్రభావాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది. సరఫరాలో స్వల్ప అంతరాయం కూడా పారిశ్రామిక ఉత్పత్తి, ఇంధన మార్పిడి కార్యక్రమాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. భారత్ 2070 నాటికి నెట్‌జీరో కార్బన్ ఉద్గారాల లక్ష్యాన్ని ప్రకటించింది. అలాగే పరిశుభ్రమైన ఇంధన వినియోగాన్ని, విద్యుత్ వాహనాల తయారీని, పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని వేగంగా విస్తరిస్తోంది. ఈ లక్ష్యాలు విజయవంతం కావాలంటే లిథియం అయాన్ బ్యాటరీలు, శక్తినిల్వ వ్యవస్థలు, సౌర పరికరాల తయారీకి అవసరమైన అరుదైన ఖనిజాల నిరంతర లభ్యత అత్యంత అవసరం.దేశీయ అన్వేషణను వేగవంతం చేయడంతోపాటు విదేశాల్లో గనుల అభివృద్ధిలో పెట్టుబడులు పెట్టడం, సర ఫరా దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకోవడం, ఖనిజాల రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం, ప్రత్యామ్నాయ సాంకేతికతలపై పరిశోధనలను విస్తరించడం కాలానుగుణ అవసరం. 'వికసిత భారత్-2047' లక్ష్యాన్ని సాకారం చేయాలంటే ఖనిజ భద్రతను జాతీయ భద్రతలో అంత ర్భాగంగా పరిగణించాల్సిందే. రేపటి ప్రపంచంలో ఆర్థిక శక్తిగా, సాంకేతిక నాయకుడిగా,ఇంధన స్వావలంబన సాధించిన దేశంగా భారత్ ఎదగాలంటే అరుదైన ఖనిజాల భద్రత విలాసం కాదు అది అనివార్యమైన జాతీయ అవసరం. ●

# ఒకే దేశం-ఒకే పన్ను ఎంతవరకు నిజమైంది?

తిప్పర్తి శ్రీనివాస్

భారత ఆర్థిక సంస్కరణల చరిత్రలో కొన్ని నిర్ణయాలు కాలగర్భంలో కలిసిపోకుండా, వ్యవస్థను శాశ్వతంగా మార్చివేస్తాయి. 2017 జులై 1న అమల్లోకి వచ్చిన వస్తు-సేవల పన్ను అలాంటి సంస్కరణలలో అగ్రగణ్యమైనది. స్వాతంత్ర్యానంతర కాలంలో పరోక్ష పన్నుల వ్యవస్థలో చేపట్టిన అతిపెద్ద మార్పుగా జీఎస్టీని పేర్కొనడం అతిశయోక్తి కాదు. 'ఒకే దేశం-ఒకే పన్ను-ఒకే మార్కెట్' అనే ఆకర్షణీయ నినాదంతో ప్రారంభమైన ఈ సంస్కరణ దశాబ్దపు ముంగిట నిలిచిన నేడు, దాని విజయాలను సంబరంగా గుర్తుచేసుకోవడంతోపాటు, ఇంకా మిగిలి ఉన్నలోపాలను నిర్మొహమాటంగా సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఏ సంస్కరణ విలువ దాని ఆరంభంలో కాదు, కాల పరీక్షలో నిలిచే సామర్థ్యంలో ఉంటుంది. జీఎస్టీ ప్రవేశానికి ముందు భారతదేశ పన్నువ్యవస్థ అనేక పరోక్ష పన్నుల అల్లికగా ఉండేది. కేంద్రం విధించే ఎక్సైజ్ సుంకం, సేవల పన్ను, రాష్ట్రాల వ్యాట్, ప్రవేశ పన్ను, ఆక్ట్రాయ్, వినోద పన్ను, లగ్జరీ ట్యాక్స్ ఇలా ఒకే వస్తువు ఉత్పత్తి నుంచి వినియోగదారుడి చేతికి చేరే వరకు అనేక దశల్లో పన్ను విధించబడేది. దాంతో పన్నుపై పన్ను పడే పరిస్థితి ఏర్పడి ఉత్పత్తి వ్యయం పెరిగేది. రాష్ట్ర సరిహద్దులు దాటే సరుకులు చెక్‌పోస్టుల వద్ద గంటల తరబడి నిలిచిపోయేవి. దేశీయ మార్కెట్ ఒకటే అయినప్పటికీ, పన్నుల పరంగా అది అనేక చిన్న చిన్న మార్కెట్లుగా విడిపోయి ఉండేది. ఆ విభజనను తొలగించి, ఆర్థిక ఏకీకరణకు పునాది వేయడమే జీఎస్టీ లక్ష్యం. ఆ లక్ష్య సాధనలో జీఎస్టీ గణనీయమైన పురోగతి సాధించిందని చెప్పాలి. దేశవ్యాప్తంగా వస్తువులు, సేవల రవాణా సులభతరమైంది. రాష్ట్రాలమధ్య పన్ను అవరోధాలు తగ్గడంతో లాజిస్టిక్స్ వ్యయం తగ్గింది. ఈకామర్స్, తయారీ, రవాణా రంగాలకు ఇది కొత్త ఊపునిచ్చింది. ముఖ్యంగా జాతీయ సరఫరా గొలుసు (సప్లై చైన్) మరింత సమర్థవంతంగా మారింది.గతంలో గిడ్డంగులు పన్నుప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు వ్యాపార అవసరాల ఆధారంగా వాటిని రూపొందించే పరిస్థితి ఏర్పడింది. ఇది జీఎస్టీ తీసుకొచ్చిన నిర్మాణాత్మక మార్పు. డిజిటల్ పరిపాలనకు జీఎస్టీ కొత్త దిశ చూపింది. జీఎస్టీఎన్, ఈవే బిల్లు, ఈఇన్వాయిస్ వంటి వ్యవస్థల ద్వారా పన్ను నిర్వహణలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించారు. నమోదు నుంచి రిటర్నుల దాఖలు వరకు దాదాపు అన్ని ప్రక్రియలు ఆన్‌లైన్‌లోకి మారాయి. డేటా విశ్లేషణ ఆధారంగా పన్ను ఎగవేతను గుర్తించే సామర్థ్యం పెరిగింది. ప్రభుత్వ యంత్రాంగంలో పారదర్శకత పెరగడంతో పాటు మానవ జోక్యం తగ్గింది. పరిపాలనా సంస్కరణల దృష్ట్యా ఇది ఒక కీలక ముందడుగు. పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరగడం జీఎస్టీ విజయాన్ని మరింత బలపరుస్తోంది. గతంలో పన్ను వ్యవస్థకు దూరంగా ఉన్న అనేక వ్యాపార సంస్థలు అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి వచ్చాయి. పన్ను ఆధారం విస్తరించడం వల్ల ప్రభుత్వ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. ఇటీవలి కాలంలో నెలవారీ




జీఎస్టీ వసూళ్లు తరచూ రూ.2 లక్షల కోట్లకు పైగా నమోదవుతున్నాయి. ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో చైతన్యం పెరిగిందనే సంకేతం మాత్రమే కాదు, పన్ను అనుసరణ కూడా మెరుగుపడిందని సూచిస్తోంది. అయితే, జీఎస్టీని సంపూర్ణ విజయ గాథగా ప్రకటించడానికి ఇంకా సమయం ఉంది. దాని నిర్మాణంలోనే కొన్ని బలహీనతలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ముఖ్యంగా బహుళ పన్ను శ్లాబ్‌లు జీఎస్టీ మూలస్ఫూర్తికే విరుద్ధంగా మారాయి. 0, 5, 12, 18, 28 శాతం పన్ను రేట్లతో పాటు సెస్‌లు కూడా అమలులో ఉండటంతో పన్ను వ్యవస్థక్లిష్టత తగ్గలేదు. ఒకేతరహా వస్తువుల వర్గీకరణపై తరచూ వివాదాలు తలెత్తుతున్నాయి. ఒకే దేశం-ఒకే పన్ను అన్న నినాదం ఉన్నప్పటికీ, ఒకే వస్తువుకు వేర్వేరు రేట్లు ఉండడం వినియోగదారులలోనూ, వ్యాపారులలోనూ గందరగోళాన్ని సృష్టిస్తోంది. రేట్ల హేతుబద్ధీకరణ ఇక వాయిదా వేయలేని సంస్కరణ. జీఎస్టీ అమలులో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఎదుర్కొన్న ఇబ్బందులను కూడా విస్మరించలేం. తరచూ మారిన నిబంధనలు, సాంకేతిక లోపాలు, సంక్లిష్టమైన రిటర్న్ విధానం, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌లో జాప్యాలుచిన్న వ్యాపారులపై అదనపు భారం మోపాయి. డిజిటలీకరణ పెద్ద సంస్థలకు అనుకూలంగా ఉన్నప్పటికీ,గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న వ్యాపారులు దానికి అనుగుణంగా మారడానికి సమయం పట్టింది. కంప్లయన్స్ ఖర్చు పెరగడం వల్ల కొన్ని చిన్న వ్యాపారాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సంస్కరణల లక్ష్యం పన్ను వసూళ్ల పెంచడం మాత్రమే కాకుండా, వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించడం కూడా కావాలి.మరో ప్రధాన చర్చనీయాంశం సహకార సమాఖ్య. జీఎస్టీ విజయానికి కేంద్ర-రాష్ట్రాల సమన్వయం అత్యంత కీలకం. ప్రారంభ ఐదేళ్లపాటు రాష్ట్రాలకు ఆదాయ నష్టపరిహారం అందించిన కేంద్రం, ఆ గడువు ముగిసిన తర్వాత రాష్ట్రాల ఆందోళనలను సమర్థవంతంగా పరిష్కరించాల్సిన బాధ్యత కలిగి ఉంది. జీఎస్టీ కౌన్సిల్ రాజకీయ భేదాలకు అతీతంగా విధాన నిర్ణయాలు తీసుకునే వేదికగా నిలవాలి. సంస్కరణ అంటే ఏకపక్ష నిర్ణయం కాదు, అన్ని భాగస్వాముల ప్రయోజనాలను సమన్వయం చేయడమే.ముందున్న దశాబ్దంలో జీఎస్టీ విజయాన్ని నిర్ణయించేది వసూళ్ల గణాంకాలు మాత్రమే కావు. పన్ను చెల్లింపుదారుడికి అది ఎంత సరళంగా మారింది? చిన్న వ్యాపారికి ఎంత స్నేహపూర్వకంగా ఉంది? వినియోగదారుడికి ధరల పరంగాఎంత ప్రయోజనం కలిగించింది? రాష్ట్రాల ఆర్థిక స్థిరత్వానికి ఎంత తోడ్పడింది? అనే ప్రశ్నలే అసలు ప్రమాణాలు. అందుకే రేట్ల హేతుబద్ధీకరణ, కంప్లయన్స్ సరళీకరణ, సాంకేతిక మౌలిక సదుపాయాల బలోపేతం, వివాద పరిష్కారవ్యవస్థ వేగవంతం, విధాన స్థిరత్వం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలి. సంస్కరణల గమ్యం గణాంకాల్లో కాదు, ప్రజల అనుభవంలో ప్రతిబింబించాలి. వ్యాపారానికి సౌలభ్యం, వినియోగదారుడికి న్యాయం, రాష్ట్రాలకు సముచిత ఆదాయం, ప్రభుత్వానికి పారదర్శకత ఈ నాలుగు లక్ష్యాలు సమన్వయమైతేనే జీఎస్టీ తన అసలు ఉద్దేశాన్ని సార్థకం చేసుకున్నట్లు అవుతుంది. దశాబ్ది ముంగిట నిలిచిన జీఎస్టీకి ఇప్పుడు అవసరమైంది విస్తరణ కాదు పరిపక్వత. కొత్త పన్నులు కాదు సరళమైన విధానం,అధిక వసూళ్ల మాత్రమే కాదు విశ్వాసాన్ని పెంపొందించే పాలన. ●

# హార్ముజ్ జలసంధి మళ్లీ మూసివేత

## గల్ఫ్ దేశాలలోని అమెరికా బేస్‌లపై ఇరాన్ దాడులు

### పశ్చిమాసియాలో మళ్లీ వార్ ఉధృతం



**టెహ్రాన్,జులై 12:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకున్నాయి. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు అత్యంత ప్రమాదకర స్థాయికి చేరాయి. హార్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకపై ఇరాన్ దాడికి ప్రతీకారంగా, తెల్లవారు జామున అమెరికా సైన్యం ఇరాన్‌పై మరోసారి భీకర దాడులు జరిపింది. వారం వ్యవధిలో ఇరాన్‌పై అమెరికా దాడులకు దిగడం ఇది మూడోసారి కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించిన వివరాల ప్రకారం, తెల్లవారుజామున 5:45 గంటలకు ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై అమెరికా బలగాలు దాడులు చేశాయి. అంతకు ముందు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ), హార్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న ఎమ్/వి జీఎఫ్ఎస్ గెలాక్సీ అనే వాణిజ్య నౌకపై దాడి చేసింది. ఈ ఘటనలో నౌక ఇంజిన్ రూమ్ తీవ్రంగా దెబ్బతిని మంటలు చెలరేగాయి. ఒక సిబ్బంది కూడా అదృశ్యమయ్యాడు. వాణిజ్య నౌకలపై దాడులు చేసే ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు ఈ దాడులు జరిపినట్లు సెంట్‌కామ్ స్పష్టం చేసింది. ఈ దాడులపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ ఇరాన్ తప్పుడు నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు దానికి తగిన మూల్యం చెల్లించుకుంటోందని తీవ్రంగా హెచ్చరించారు. అమెరికా దాడులకు కొన్ని గంటల ముందే ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన వాణిజ్య రవాణా మార్గమైన హార్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాంతంలో అమెరికా జోక్యం ఆగిపోయే వరకు ఏ అంతర్జాతీయ నౌకను అనుమతించేది లేదని ఐఆర్‌జిసి నేవీ స్పష్టం చేసింది. దశాబ్దాలుగా ఇది అంతర్జాతీయ జలమార్గంగా ఉన్నప్పటికీ, తమ సార్వభౌమ ప్రాంతంగా పరిగణిస్తూ నౌకల నుంచి పన్నులు వసూలు చేస్తామని ఇరాన్ వాదిస్తోంది.

అమెరికా దాడుల తర్వాత ఇరాన్‌లోని ఖేష్మ్ ద్వీపం, బందర్ అబ్బాస్, సిరిక్‌లలో భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ పరిణామాలపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందిస్తూ, అమెరికానే తమ మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్లో ఇరాన్‌చమురు అమ్ముకోవ డానికి ఇచ్చిన మినహాయింపులను అమెరికా ఏకపక్షంగా రద్దు చేయడమే దీనికి కారణమన్నారు. హార్మూజ్ జలసంధిలో ఇరాన్ దాడులకు పాల్పడటం వల్లే చమురు మినహాయింపులు రద్దు చేశామని అమెరికా వాదిస్తోంది.

ఈ పరస్పర దాడులు, ఆరోపణలతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం మరింతగా ముదిరింది. మరోపక్క ఇరాన్‌కూడా గల్ఫ్‌దేశాల్లోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేస్తోంది. ఈ దాడులతో ఇపుడు గల్ఫ్‌దేశాల్లోకూడా కలవరం వ్యక్తం అవుతోంది.

## 23న జనం మధ్యకు ఖమేనీ!

### తండ్రి స్మారక కార్యక్రమంలో పాల్గొనే అవకాశం



**టెహ్రాన్,జులై 12:** ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఎట్టకేలకు ప్రజల ముందుకు రానున్నారు. తన తండ్రి, దివంగత సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్మారకార్థం ఈనెల 23న టెహ్రాన్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొజ్తబా బహిరంగంగా కనిపించనుండటం ఇదే తొలిసారి కావడంతో ఈ పరిణామంపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆసక్తి నెలకొంది. టెహ్రాన్‌లో సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల మధ్య జరిగే ఈ కార్యక్రమానికి దేశంలోని కీలక నేతలు హాజరుకానున్నారు. ఈ యేడాది ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన వైమానిక దాడిలో అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఈ సంఘటన తర్వాత ఇరాన్-అమెరికా మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. తండ్రి మరణానంతరం మొజ్తబా ఖమేనీని ఇరాన్ కొత్త సుప్రీంలీడర్‌గా ప్రకటించారు. అప్పటి నుంచి ఆయన అజ్ఞాతంలోనే ఉన్నారు. భద్రతా కారణాల రీత్యా ఆయన బయటకు రావడం లేదని అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్ నుంచి హత్యకు గురయ్యే ప్రమాదం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో ఆయన తనతండ్రి, భార్య అంత్యక్రియలకు సైతం హాజరుకాలేదు. ఇదే సమయంలో మొజ్తబా ఆరోగ్యంపై కూడా తీవ్రస్థాయిలో ఊహాగానాలు వ్యాపించాయి. ఫిబ్రవరి 28 దాడిలో ఆయన గాయపడ్డారని, చికిత్స తీసుకుంటున్నారని వార్తలు వచ్చాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం ఆయన ఆరోగ్యంపై సందేహాలు వ్యక్తం చేశారు. దాడుల్లో ఆయన ముఖం రూపురేఖలు మారిపోయి ఉండొచ్చని అన్నారు. అయితే, ఈ వాదనలను ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. మొజ్తబా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని స్పష్టం చేస్తూ, ఇరానియన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఇటీవల ఆయన కొత్త ఫోటోను కూడా విడుదల చేసింది.



## ముగిసిన 3 దేశాల ప్రధాని మోడీ పర్యటన

### ఇండొనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాధినేతలతో ద్వైపాక్షిక చర్చలు, పలు కీలక ఒప్పందాలు

**న్యూఢిల్లీ, జులై 12:** ప్రధాని మోడీ ఇండోనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో తన ఆరు రోజుల విజయవంతమైన పర్యటనను ముగించుకుని న్యూఢిల్లీకి తిరిగి వచ్చారు. తన మూడు దేశాల పర్యటనలో భాగంగా తొలి అంచెలో మోడీ ఇండోనేసియాలో పర్యటించారు. ఈ పర్యటన సందర్భంగా, ఇండోనేషియాలో, ప్రధాని మోడీ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో చర్చలు జరిపారు. ఈ పర్యటన సందర్భంగా, ప్రధాన మంత్రి మోడీకి ఇండోనేసియా అత్యున్నత పౌర పురస్కారం 'బింటాంగ్ ఆదిపూర్ణను ప్రదానం చేశారు. ఉమ్మడి సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెబుతూ, పునరుద్ధరించిన ప్రంబనన్ ఆలయాన్ని సంయుక్తంగా ప్రారంభించారు.

ఆ తర్వాత ప్రధాని మోడీ ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌కు వెళ్లారు, అక్కడ నిర్వహించిన మూడవ వార్షిక భారత్-ఆస్ట్రేలియా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌ను మోడీ కలిశారు. ఈ పర్యటన సందర్భంగా, ఆస్ట్రేలియన్ సూపర్ సంస్థ భారతదేశ జాతీయ పెట్టుబడి, మౌలిక సదుపాయాల నిధికి ఐదు వందల మిలియన్ల ఆస్ట్రేలియన్ డాలర్ల పెట్టుబడిని ప్రకటించింది. ఈ పర్యటన "బంధాలను మరింత బలపరిచి, భాగస్వామ్యాలను పటిష్టం చేసి, ఉమ్మడి భవిష్యత్తుకు రూపునిచ్చింది" అని, వాణిజ్యం, భద్రత, సాంకేతికత, ప్రాంతీయ సహకారం వంటి రంగాలలో గణనీయమైన ఫలితాలు సాధించిందని విదేశాంగ మంత్రిత్వశాఖ అభివర్ణించింది. అనంతరం ప్రధాని మోడీ ఆక్లాండ్‌ను సందర్శించారు. ఈ పర్యటన సందర్భంగా, భారత, న్యూజిలాండ్ వాణిజ్యం, రక్షణ, సాంకేతికత, విద్య, ఆవిష్కరణలు, పర్యాటకం, ప్రజల మధ్య సంబంధాలపై దృష్టి సారిస్తూ 'రోడ్‌మ్యాప్ టు 2030ని ఆమోదించాయి. రక్షణ, సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధం, విపత్తు నిర్వహణ, వ్యవసాయం, పర్యాటకం, ఆహార సాంకేతికత, స్వచ్ఛ ఇంధనం రంగాలను కవర్‌చేస్తూ ఇరు దేశాలు 18 ఒప్పందాలను ప్రకటించాయి. ఈ ఏడాది ప్రారంభంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో, 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు.

## జమ్మూ కాశ్మీర్‌లో బిజెపి ఆపరేషన్ లోటస్

### ఒక్కో ఎన్సీ ఎమ్మెల్యేకు 30 కోట్ల నగదు ఆఫర్



**శ్రీనగర్,జులై 12:** జమ్మూకశ్మీర్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. తమ ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఆపరేషన్ లోటస్‌కు తెరలేపిందని, తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సంచలన ఆరోపణలు చేశారు. శ్రీనగర్‌లోని హజ్రత్‌బాల్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ బిజెపికి చెందిన ఓ కీలక నేత, సుప్రీంకోర్టు న్యాయవాది మా పార్టీ ఎమ్మెల్యేను రహస్యంగా కలిశారు. పార్టీ మారితే రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల నగదు, మంత్రి పదవి ఇస్తామని, జమ్మూ కశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా కల్పిస్తామని ఆశ చూపారు. కానీ మా ఎమ్మెల్యేల విశ్వాసాన్ని, నిబద్ధతను వారు కొనలేక పోయారు. రూ.100 కోట్లుఇచ్చినా నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు అమ్ముడుపోరు. బలహీనులుగా భావించి వెనుక ద్వారం గుండా అధికారంలోకి రావాలని బిజెపి చూస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఒమర్ ఆరోపణలను బిజెపి జమ్మూకశ్మీర్ సీనియర్ నేత రవీందర్ రైనా ఖండించారు. ఈ వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని, భ్రమ కలిగించేలా ఉన్నాయని కొట్టిపారేశారు.

కేంద్రం నిధులు ఇవ్వకపోతే ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేమని కొద్దిరోజుల క్రితం స్వయంగా ముఖ్యమంత్రే అన్న విషయాన్ని రైనా గుర్తుచేశారు. ప్రస్తుతం 90 స్థానాలున్న అసెంబ్లీలో 41 మంది ఎమ్మెల్యేలతో నేషనల్ కాన్ఫరెన్స్ బలంగా ఉంది. కాంగ్రెస్ (6), స్వతంత్రులు (5), సిపిఎం (1) బయటి నుంచి మద్దతు ఇస్తుండటంతో ఒమర్ ప్రభుత్వానికి ఎలాంటి ప్రమాదం లేదు. మరోవైపు, జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని ఒమర్ అబ్దుల్లా తప్పుబట్టారు. "సరైనసమయం వచ్చినప్పుడు రాష్ట్ర హోదా ఇస్తామని కేంద్రం చెబుతోంది. ఆ సరైన సమయం ఎప్పుడు వస్తుందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో, రాష్ట్ర హోదా కోసం ఈనెల 20న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ప్రకటించారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, గులాం నబీ ఆజాద్ సహా ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులందరూ ఈ నిరసనలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## దాడులు ఆపకపోతే తీవ్ర పరిణామాలు

### ఇరాన్‌ను హెచ్చరించిన అమెరికా



**వాషింగ్టన్,జులై 12:** హార్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను వెంటనే నిలిపివేయాలని, లేకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్‌ను అమెరికా హెచ్చరించింది. హార్మూజ్ జలసంధి అంతర్జాతీయ నౌకాయానానికి పూర్తిగా తెరిచి ఉంటుందని, వాణిజ్య నౌకలపై ఎలాంటి దాడులు జరగవని పేర్కొంటూ 24 గంటల్లోగా ఇరాన్ బహిరంగ ప్రకటన చేయాలని వాషింగ్టన్ స్పష్టం చేసినట్టు సమాచారం. గడువులోగా చెప్పినట్లు చేయకుంటే తీవ్రమైన సైనిక, ఆర్థిక చర్యలు తీసుకుంటామని అమెరికా హెచ్చరించినట్టు తెలుస్తోంది. ఈ హెచ్చరికను మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌కు అమెరికా చేరవేసినట్టు సమాచారం. నౌకలపై కాల్పులు ఆపేస్తామని బహిరంగంగా చెప్పాలి. అలాగే తాము తప్పు చేశామని వాళ్ల కనీసం పరోక్షంగానైనా అంగీకరించాలని మేము కోరుకుంటున్నాం. కాల్పులు ఆపేస్తామనేదే రేపు వారి ప్రకటన కావాలని, లేకపోతే వారికి అది మంచి రోజు కాబోదని అమెరికా అధికారి హెచ్చరించినట్టు తెలుస్తోంది. ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ఒమాన్‌లో మధ్యవర్తిత్వ చర్చల్లో పాల్గొననున్నారు. ఈ సమావేశం అనంతరం ఇరాన్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉందని అమెరికా అధికారులు భావిస్తున్నారు. అయితే గడువులోగా స్పష్టమైన హామీ రాకపోతే పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా మారే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఒమన్ తీరంలో సైప్రస్‌జెండా ఉన్న నౌకపై దాడి

### 11 మంది భారత సిబ్బందిలో పదిమంది సురక్షితం, ఒకరు గల్లంతు..



**సనా,జులై 12:** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఒమన్ తీరంలోని హోర్ముజ్ జలసంధిలో సైప్రస్ జెండాతో ప్రయాణిస్తున్న జీఎఫ్ఎస్ గెలాక్సీ అనే వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనలో నౌకలో ఉన్న 11 మంది భారత సిబ్బందిలో ఒకరు గల్లంతయ్యా రని, మిగిలిన 10 మందిని సురక్షితంగా కాపాడా మని భారత విదేశాంగ శాఖ ధృవీకరించింది. దాడి తర్వాత నౌకలో మంటలు చెలరేగి భారీగా దెబ్బ తినడంతో సిబ్బంది ప్రాణాలతో బయటపడేందుకు నౌకను విడిచిపెట్టినట్లు తెలుస్తోంది.

ఈ దాడిని భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండిం చింది. ఒమన్ తీరంలో జీఎఫ్ఎస్ గెలాక్సీ వాణిజ్య నౌకపై జరిగిన దాడిని ఖండిస్తున్నాం. నౌకలోని 11 మంది భారతీయులలో 10 మందిని రక్షించగా, ఒకరు గల్లంతయ్యారని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. గల్లంతైన భారతీయుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుం టోందని తెలిపింది. ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులు ఆందోళనకరమని, ఉద్రిక్తతలను తక్షణమే తగ్గించాలని భారత్ పిలుపునిచ్చింది. గల్ఫ్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం జరుగుతున్న చర్చలను ముగించి, దౌత్య పరమైన పరిష్కారం కనుగొనాలని భారత్ సూచించింది. అంతర్జాతీయ చట్టాల ప్రకారం వాణిజ్య నౌకలు, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోరాదని, అంతర్జాతీయ జలాల్లో స్వేచ్ఛాయుత వాణిజ్యం, రవాణాకు ఎలాంటి ఆటంకాలు ఉండరాదని స్పష్టం చేసింది.

మరోవైపు నౌక అనధికార మార్గంలో ప్రయాణిం చడం వల్లే దారి మళ్లించే చర్యగా దాడి చేశామని ఇరాన్ తన చర్యను సమర్థించుకుంది. ఈ ఘటన తర్వాత హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దీనికి ప్రతిస్పందనగా, అమెరికా ఇరాన్‌పై కొత్తగా మూడుసార్లు దాడులు ప్రారంభించింది. నౌకపై దాడి తర్వాత ఒక సిబ్బంది గల్లంతైనట్లు, నౌక ప్రయాణాన్ని కొనసాగించలేని విధంగా దెబ్బతిన్నట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ధ్రువీకరించింది. ఇప్పటికే పలు దాడులకు పాల్పడిన ఇరాన్‌కు మరో అవకాశం ఇచ్చినా నిబంధనలను ఉల్లంఘించింది. అందుకే, పౌర నావికులపై దాడి చేసే ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీసేలా భారీ మూల్యం చెల్లించేలా చేస్తున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ హెచ్చరించింది. ఇరాన్, ఒమన్ విదేశాంగ మంత్రులు సమావేశమైన మరుసటి రోజే ఈ దాడి జరగడం, ఇరుపక్షాల మధ్య దాడులు, ప్రతిదాడులు పెరగడం మధ్యప్రాచ్యంలో శాంతి ప్రయత్నాలకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

## సంక్షిప్త వార్తలు

### రష్యాకు షాక్.. సిజ్రాన్ రిఫైనరీపై ఉక్రెయిన్ మెరుపుదాడి



**కీవ్, జులై 12:** రష్యాకు ఉక్రెయిన్ మరో షాక్ ఇచ్చింది. సమర రీజియన్‌లోని సిజ్రాన్ చమురుశుద్ధి కర్మాగారంపై కీవ్ డ్రోన్లు మెరుపు దాడి చేశాయి. దీంతో ఆయిల్ రిఫైనరీకి భారీ నష్టం వాటిల్లింది. ఈ నెల 11,12 తేదీల మధ్యలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి. ఈ విషయాన్ని ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. ఈ రిఫైనరీ యేటా 8.5 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురును ప్రాసెస్ చేయగలదు. ఇక్కడి నుంచి సమర రీజియన్‌కు అవసరమైన పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ ఫ్యూయల్ వెళతాయి. వీటిని రష్యా సైనిక దళాలు కూడా వినియోగిస్తాయి. దీనిని రోస్‌నెఫ్ట్ కార్పొరేషన్ నిర్వహిస్తోంది. తాజా దాడితో ఇక్కడ కార్యకలాపాలను నిలిపివేశారు.

### బావిలో విషవాయువులు లీక్.. ఐదుగురు దుర్మరణం

**షిల్లాంగ్, జులై 12:** మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో ఓ విషాద ఘటన చోటుచేసుకుంది. ఒక ప్రైవేట్ నిర్మాణ స్థలంలోని ఓ బావిలో విషవాయువుతో ఐదుగురు మృతి చెందారు. తూర్పు ఖాసీ హిల్స్ జిల్లా పోలీసు అధిపతి వివేక్ సియెమ్ తెలిపిన వివరాల ప్రకారం.. లాపాలాంగ్ ప్రాంతంలోని ప్రైవేట్ స్థలంలో ఉన్న బావిలో నలుగురు కూలీలు నీళ్ల తోడుతున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ప్రమాదం సంభవించింది. బావిలో ఉన్న జనరేటర్ నుంచి విషపూరిత వాయువు వెలువడింది. ఈ విషవాయువు కారణంగా వారికి ఊపిరాడక అక్కడే కుప్పకూలారు.

### అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం కన్నుమూత



**వాషింగ్టన్, జులై 12:** అమెరికా సెనెటర్, ట్రంప్ సన్నిహితుడు లిండ్సే గ్రాహం (71) కన్నుమూశారని ఆయన కార్యాలయం వెల్లడించింది. ఇటీవల ఆయన అనార్యోగానికి గురై చికిత్స తీసుకుంటుండగా శనివారం సాయంత్రం స్వగృహంలో ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. అయితే ఆయన అనారోగ్యానికి కారణాలు వెల్లడించలేదు. 2003 నుంచి యుఎస్ సెనేట్‌లో సౌత్ కరోలినాకు ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జాతీయ భద్రత, విదేశాంగ విధాన చర్చలు వంటి వాటిలో చురుకుగా వ్యవహరిస్తూ.. దేశంలోని కీలక నేతల్లో ఒకరిగా పేరు పొందారు. అమెరికాకు చెందిన అనేక కీలక అంశాల్లో ట్రంప్‌కు బలమైన మద్దతుదారుగా వ్యవహరించారు. ఇటీవల అమెరికా-ఇరాన్ మధ్య పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించిన సమయంలోనూ ఇస్లామాబాద్‌పై లిండ్సే గ్రాహం తీవ్ర విమర్శలు చేశారు.

### అమర్‌నాథ్ యాత్రీకుల బస్సు బోల్తా, 16 మందికి గాయాలు

**సిమ్లా,జులై 12:** అమర్‌నాథ్ యాత్రికులతో వెళ్తున్న బస్సు బోల్తా పడటంతో 16 మంది గాయాలపాలయ్యారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటన హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాలో చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 57 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. జమ్మూ నుంచి డెహ్రాడూన్‌కు వెళ్లేందుకు యాత్రికులు ఈ ప్రైవేట్ బస్సును అద్దెకు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

### ఇండోర్‌లో కళాశాల విద్యార్థిని ఆత్మహత్య

**ఇండోర్,జులై 12:** మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఓ కళాశాల విద్యార్థిని తాను అద్దెకు ఉంటున్న గదిలో ఆత్మహత్యకు పాల్పడింది. చనిపోయే ముందు ఆమె తన గది గోడపై చాక్‌పీస్‌తో రాసిన సూసైడ్ నోట్ సంచలనం రేపుతోంది. తన చావుకు తన తండ్రి, నానమ్మే కారణమని అందులో పేర్కొనడం కలకలం సృష్టిస్తోంది. పోలీసుల వివరాల ప్రకారం బాధితురాలిని రాజ్‌గఢ్ జిల్లాకు చెందిన వైష్ణవి బనావడే (20)గా గుర్తించారు. ఆమె ఇండోర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చదువు నిమిత్తం ఎంఐజీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూ నగర్‌లో అద్దె గదిలో ఒంటరిగా ఉంటోంది. వైష్ణవి గత ఏడాదిగా ఓ యువకుడితో ప్రేమలో ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది.

## వీసాగడువు ముగిసినా భారత్‌లోనే ఉన్న పాకిస్థానీయుల అరెస్టు

**బెంగళూరు,జులై 12:** కర్ణాటకలో గత 22 ఏళ్లుగా అక్రమంగా నివసిస్తున్న పాకిస్థాన్ జాతీయులైన తల్లి, కుమారుడిని పోలీసులు అరెస్టు చేశారు. చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి తాలూకాలో శనివారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వీసా గడువు ముగిసినప్పటికీ దేశం విడిచి వెళ్లకుండా, నకిలీ పత్రాలు ద్వారా భారత ప్రభుత్వ గుర్తింపు కార్డులు పొందారనే ఆరోపణలపై వారిని అదుపులోకి తీసుకున్నారు. బాగేపల్లి సమీపంలోని దాసగరిపల్లి గ్రామంలో నివసిస్తున్న ఫర్హానాజ్ (52), ఆమె కుమారుడు మహమ్మద్ ఫర్దీన్ (21) రేషన్ కార్డు పొందడంతో పాటు ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. వారు సమర్పించిన పత్రాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులకు అనుమానం కలగడంతో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ విచారణలో వారు భారత పౌరసత్వంలేని పాకిస్థాన్ జాతీయులని నిర్ధారణ అయింది.వీసా గడువు ముగిసిన తర్వాతకూడా వారు పాకిస్థాన్‌కు తిరిగి వెళ్లకుండా, బెంగళూరు చిరునామాలను ఉపయోగించి నకిలీ ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు సృష్టించి బ్యాంకు ఖాతాలు కూడా పొందినట్లు అధికారులు గుర్తించారు.

## క్షిపణుల తయారీ ప్రైవేట్‌కు!

### రక్షణ మంత్రిత్వ శాఖ సన్నద్ధం, ఆస్త్రా మార్క్ 2 క్షిపణిలకు బిడ్‌లు

### ఎగుమతులు పెంచడం, పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడమే లక్ష్యం



**న్యూఢిల్లీ, జులై 12:** తన రక్షణ ఉత్పత్తి విధానంలో అతిపెద్ద సంస్కరణలలో భాగంగా, క్షి పణి తయారీని ప్రైవేట్ కంపెనీలకు తెరవడానికి భారత్ సిద్ధమవుతోంది. రక్షణ పరిశోధన- అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) ఆస్త్రా క్షి పణిని కొనుగోలు చేసేందుకు ఇండోనేషియా ఆసక్తి చూపడంతో, పెరుగుతున్న ఎగుమతి డిమాండ్‌ను తీర్చడానికి దేశీయ తయారీ సామర్థ్యాన్ని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. విమానాలు, డ్రోన్లు, ఫిరంగి, నౌకాదళ ప్లాట్‌ఫారమ్‌ల వంటి రంగాలలో భారత్ ఇప్పటికే ప్రైవేట్ భాగస్వామ్యాన్ని అనుమతించినప్పటికీ, క్షి పణి తయారీ మాత్రం చాలా వరకు ప్రభుత్వ ఆధీనంలోని రక్షణ సంస్థల కిందనే ఉంది. రక్షణ మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం, ఆస్త్రా మార్క్ 2 బియాండ్ విజువల్ రేంజ్ (బివిఆర్) గగనతల నుంచి గగనతల క్షి పణిని తయారు చేయడానికి భారతీయ ప్రైవేట్ కంపెనీలను ఆహ్వానిస్తూ రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రతిపాదనల కోసం అభ్యర్థన (ఆర్‌ఎఫ్‌ఆర్) జారీ చేయనుంది. ఇందులో పాల్గొనే కంపెనీలలో ఐకామ్(ఐసిఓఎంఎం), అదానీ, భారత్ ఫోర్జ్, టాటా గ్రూప్, మహీంద్రా గ్రూప్ ఉన్నాయని భావిస్తున్నారు. భారత సాయుధ దళాల నుండి, అలాగే మిత్ర దేశాల నుండి పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారని, ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రస్తుతం ఈ డిమాండ్‌ను పూర్తిగా తీర్చలేకపోతోందని నివేదిక పేర్కొంది. డిఆర్‌డిఒ అభివృద్ధి చేసిన ఆస్త్రా మార్క్ 2, 180- 200 కిలోమీటర్ల దాడి పరిధిని కలిగి ఉంది. ఆపరేషన్ సింధూర్‌కు ముందు పాకిస్థాన్‌కు చైనా సరఫరా చేసిన పిఎల్-15ఇ దీర్ఘ శ్రేణి గగనతల నుంచి గగనతల క్షి పణిని ఎదుర్కోవ దానికి దీనిని రూపొందించారు. ఈ క్షి పణిని తేజస్ మార్క్ 1ఎ, మిగ్29, ఎస్‌యు30 ఎంకెఐ, రఫేల్ మెరైన్ యుద్ధ విమానాలతో అనుసంధానించ నున్నట్లు భావిస్తున్నారు.

**తదుపరి ప్రళయ క్షిపణి:**

డిఆర్‌డిఒ వర్గాల కథనం ప్రకారం, అభివృద్ధి, తయారీ రెండింటికీ ప్రైవేట్ కంపెనీలకు తెరవబడే తదుపరి క్షి పణి వ్యవస్థ ప్రళయ వ్యూహాత్మక బాలిస్టిక్ క్షి పణి అయ్యే అవకాశం ఉంది. ప్రళయ క్షి పణి సుమారు 500 కిలోమీటర్ల పరిధిని కలిగి ఉంది. ఇది ధ్వని వేగం కంటే ఆరు రెట్లు వేగంతో ప్రయాణించగల రెండుదశల క్షి పణి. ఇది లాంగ్‌రేంజ్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్ మిస్సైల్ (ఎల్ఆర్ ఎల్ఎసిఎం), తదుపరి తరం బ్రహ్మోస్ క్షి పణి, విస్తృతశ్రేణి పినాకా రాకెట్ వ్యవస్థతో పాటు భారత దేశపు సమీకృత రాకెట్ దళాలలో భాగంగా ఉంది.

**'ఆపరేషన్ సింధూర్' రక్షణ ప్రాధాన్యతలతోనే:**

స్టాండ్‌ఆఫ్ ప్రెసిషన్ ఆయుధాల ప్రాముఖ్యత పెరుగుతోందని ఆపరేషన్ సింధూర్ నుండి నేర్చుకున్న పాఠాల నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందని నివేదిక పేర్కొంది. నిరోధక శక్తిని బలోపేతం చేయడానికి భారతదేశపు క్షి పణి, రాకెట్ నిల్వలను వేగంగా విస్తరించడంపై, అదే సమయంలో క్షి పణి రక్షణ సామర్థ్యాలను పెంచ డంపై కేంద్రం ఇప్పుడు దృష్టి సారించింది. ఇటీవలి ఇరాన్-అమెరికా



# రామయ్య సేవలో మంత్రి వివేక్

## ఎస్సీ వర్గీకరణ మహార్యాలీతోపాటు

## పార్టీ నాయకులతో కీలక సమావేశం

**భద్రాచలం, ప్రభాతవార్త:** కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి, స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఆదివారం భద్రాచలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దామోదర్ ఆధ్వర్యంలో అర్చకులు మంత్రి వివేక్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికి వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం తీర్థప్రసాదాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలం ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆలయ అభివృద్ధి కోసం కేటాయించిన సుమారు రూ.500 కోట్ల నిధులను సమర్థవంతంగా వినియోగించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణలో అత్యంత ప్రాచీన, ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన అభివృద్ధికి అవసరమైతే మరిన్ని నిధులు కూడా కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పుష్కరాలు, పర్వదినాల్లో వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం ఎస్సీ వర్గీకరణ అమలు, రోస్టర్ విధానం రద్దు డిమాండ్లతో నిర్వహించిన మహా ర్యాలీ, బహిరంగ సభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. సామాజిక న్యాయం సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.తదుపరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి గడ్డం వివేక వెంకటస్వామిని పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, బుడగం శ్రీనివాస్, చింతీరాల రవికుమార్, కొండిశెట్టి కృష్ణమూర్తి, బొంబోతుల రాజీవ్, నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రక్తం చిందించే ధైర్యం హారీశ్‌కు లేదు

## పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్య

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే సాహా సం ఏమిటో తెలుసని రక్తం చిందించే ధైర్యం హరీశ్‌రావుకు లేదని ఆత్మ హత్యలు చేకుకునేలా రెచ్చగొట్టే స్వభావం హరీశ్‌రావుదని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి అన్నారు.గాంధీభవన్‌లో ఆయన ఆదివారం మాట్లాడుతూ ఉద్యమం సమయంలో మీరు ఇచ్చిన స్పీచ్‌లు విని తెలంగాణ యువత పెట్రోల్ పోసుకోని బలైనారని హరీశ్‌రావు మాత్రం అగ్గిపెట్ట మర్చి పోయారని అపహాస్యం చేశారు. మాట నిలుపు కొనే సంస్కృతి కాంగ్రెస్ పార్టీది మాత్రమే అని బిఆర్ఎస్‌ది కాదనీ చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించడమే హరీష్‌రావు పెట్ట కొన్నారని అన్నారు. కెసిఆర్‌తో ఈటల రాజేందర్‌కు బంధం ఉందనీ కెసిఆర్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉండి డబ్బులు తీసుకొన్నప్పుడు ఆయన మాట్లాడటంలో సహజన్యాయం ఉందని అన్నారు. బిజెపి ఎంపిగా ఎన్‌డిఎస్‌తో ఈటల మాట్లాడాలని సిఎం, నీటిపారుదల శాఖ మంత్రులు ఇప్పటికే చెప్పారని గుర్తుచేశారు. కెసిఆర్ హరీశ్‌రావులను ఢిల్లీకి ఈటల తీసుకొని పోవాలని సలహా ఇచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలుస్తోందని జోస్యం చెప్పారు.

# ఒయు మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుప్పాల లక్ష్మీనారాయణ కన్నుమూత



**హైదరాబాద్ (తార్నాక), జులై 12, ప్రభాతవార్త :** ఉస్మానియా విశ్వ విద్యాలయం మాజీ రిజిస్ట్రార్, ఇంజినీరింగ్ కళాశాల సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ పుప్పాల లక్ష్మీనారాయణ అనారోగ్యంతో కన్ను మూశారు. ఆయన మృతి ఉస్మానియా విశ్వ విద్యాలయ వర్గాలను తీవ్రవిషాదంలో ముంచెత్తింది. విద్యా పరిపాలనలో విశేష అనుభవం కలిగిన డాక్టర్ లక్ష్మీనారాయణ సుదీర్ఘ కాలంపాటు ఉస్మానియా విశ్వ విద్యాలయంలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగుల మన్ననలు పొందారు. రిజిస్ట్రార్‌గా విశ్వవిద్యాలయ పాలనలో పారదర్శకత, క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తూ తనదైన ముద్ర వేశారు.అందరివాడిగా, అజాతశత్రువుగా పేరొందిన ఆయన ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారని సహచరులు గుర్తు చేసుకుంటున్నారు. నిరాడంబర వ్యక్తిత్వం, మానవీయ విలువలు, సేవా దృక్పథంతో ఆయన విద్యా రంగంలో చెరగని ముద్ర వేశారని పలువురు విద్యావేత్తలు, మాజీ విద్యార్థులు నివాళులర్పించారు.




బాగ్‌లింగంపల్లిలోని బిసి రాజ్యాధికార సమితి కార్యాలయంలో రాహుల్ మృతిపై 46వ రోజు న్యాయపోరాట దీక్షలో పాల్గొన్న సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్, రాహుల్ తల్లిదండ్రులు రాజేష్, వనిత, న్యాయవాదులు.

# హైకోర్టు చీఫ్‌జస్టిస్ చెబితే తప్ప సామాన్యుడికి న్యాయం జరగదా?

## బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డిమాండ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి) జులై 12, ప్రభాతవార్త:** హైకోర్టు చీఫ్ జస్టిస్ జోక్యం చేసుకుని ఆదేశాలు ఇస్తే గానీ సామాన్యుడికి పోలీసులు న్యాయం చేయరా? అని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ ప్రభుత్వాన్ని, దర్యాప్తు సంస్థలను ప్రశ్నించారు. బీటెక్ విద్యార్థి అంకం రాహుల్ అనుమానాస్పద మృతి కేసులో న్యాయం చేయాలంటూ ఆయన తల్లిదండ్రులు చేపట్టిన న్యాయపోరాట దీక్ష ఆదివారంతో 46వ రోజుకు చేరుకుంది. బాగ్‌లింగంపల్లిలోని సమితి కార్యాలయంలో జరిగిన ఈ దీక్షా కార్యక్రమంలో దాసు సురేష్ పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి న్యాయం అనేది రాజ్యాంగబద్ధమైన హక్కు అని, అయితే న్యాయం కోసం ఒక సాధారణ కుటుంబం హైకోర్టు తలుపులు తట్టాల్సిన పరిస్థితి రావడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ కేసులో ఇప్పటివరకు జరిగిన పరిణామాలు పోలీసు వ్యవస్థపై తీవ్ర సందేహాలను కలిగిస్తున్నాయన్నారు. బాధ్యులెవరైనా చట్టం ముందు నిలబెట్టే వరకు ఎవరినీ వదిలిపెట్టేది లేదని ఆయన హెచ్చరించారు.

# నేడు చిన్నారులకు నులిపురుగు నివారణ మందుల పంపిణీ

## రాజ్‌భవన్ స్కూల్‌లో ప్రారంభించనున్న మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా చిన్నారుల్లో నులి పురుగుల (నట్టలు) సమస్యను నివారించేందుకు నేడు(సోమవారం) రాష్ట్ర వ్యాప్తంగా ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లు పంపిణీ చేయ దానికి ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్ర మాన్ని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంట లకు ప్రారంభించనున్నారు. విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ఆరోగ్య శాఖ ఈ కార్యక్ర మాన్ని నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సున్న 96,81,855 మంది చిన్నారులు, విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలు వేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం కార్య క్రమాన్ని నిర్వహిస్తారు. నేడు ఏ కారణంతోనైనా మాత్రలు వేయించుకోలేకపోయిన పిల్లలకు ఈ నెల 20న మాప్‌అప్ కార్యక్రమం ద్వారా తప్పనిసరిగా మాత్ర వేయాలని ఆరోగ్యశాఖ లక్ష్యంగా పెట్టు కుంది. 1 నుంచి 19 సంవత్సరాల వయసున్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్ర తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు. పిల్లల్లో నులిపురుగులు ఉండడం వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం, బరువు తగ్గడం వంటి సమస్యలు వస్తాయని మంత్రి తెలిపారు. ఈ సమస్యల కారణంగా చదు వుపై పిల్లల శ్రద్ధ తగ్గిపోయే ప్రమాదం ఉంటుం దన్నారు. నులిపురుగులు బయటకు కనిపించక పోయినా పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపు తాయని మంత్రి హెచ్చరించారు. ఈ నేపథ్యంలో తప్పనిసరిగా ఆల్బెండజోల్ వేయించాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, అంగన్‌వాడీ సెంటర్లలో సోమవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఈ సమాచారాన్ని పిల్లల తల్లిదండ్రులందరికీ షేర్ చేయాలని మంత్రి ప్రజలను కోరారు. ట్యాబ్లెట్లను ఇంటి వద్దకు తీసుకెళ్లవద్దని, నిపుణుల పర్యవేక్షణలోనే పిల్లలు ఈ ట్యాబ్లెట్ వేసుకోవాల్సి ఉంటుందని తల్లిందండ్రులకు కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ట్యాబ్లెట్ వేయించడానికి ముందు పిల్లలకు తప్పనిసరిగా ఆహారం తినిపించాలని, ఖాళీ కడుపుతో ట్యాబ్లెట్ వేయించొద్దన్నారు.

# అర్హులైన సివిల్స్ అభ్యర్థులకు రూ.లక్ష సాయం

## సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** రాష్ట్రం నుంచి సివిల్ సర్వీసెస్ మెయిన్స్ కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ యేడాది కూడా ఆర్థిక ప్రోత్సాహం అందించాలని సింగరేణి కాలరీస్ సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో వీటి వివరాలను అందించారు. ఈ ఏడాది యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులై మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థుల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికీ సింగరేణి సంస్థ తరఫున రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందజేస్తామని తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని, దరఖాస్తులను పరిశీలించి అర్హత సాధించిన ప్రతీ అభ్యర్థికి ఈ ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందజేస్తామని పేర్కొన్నారు. సింగరేణి అందిస్తున్న ఈ ఆర్థిక ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకుని ఈ యేడాది మరింత ఎక్కువ మంది తెలంగాణ యువత సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించి రాష్ట్రానికి, దేశానికి సేవలందించాలని ఆయన ఆకాంక్షించారు. కాగా సింగరేణి సంస్థ తన కార్పోరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా ఈ పథకాన్ని 2024లో ప్రారంభించినట్లు వెల్లడించారు. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం పేరుతో 2024 సివిల్స్ ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణులైన 140 మంది అభ్య ర్థులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం అందించామని తెలిపారు. వారిలో 20 మంది ఇంటర్వ్యూకు ఎంపిక కాగా, వారికి మరో రూ.లక్ష చొప్పున అదనపు ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించామని, చివరకు ఏడు గురు సివిల్ సర్వీసెస్‌లో విజేతలుగా నిలిచారని వెల్లడించారు. గత ఏడాది ఈ పథకం కింద 206 మంది అభ్యర్థులకు ఆర్థిక ప్రోత్సాహకం అందించగా, వారిలో 50 మంది ఇంటర్వ్యూకు ఎంపిక య్యారని, చివరకు 20 మంది సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించారని తెలిపారు. రెండేళ్లలో 346 మంది అభ్యర్థులక సింగరేణి సంస్థ ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించిందని పేర్కొ న్నారు.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఎన్.రామచందర్‌రావు

# మధ్యాహ్నా భోజన కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలి

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచంద్రరావు, బిఆర్ఎస్‌వి రాష్ట్ర చీఫ్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జులై 12, ప్రభాతవార్త:** మధ్యాహ్నా భోజన కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, బిఆర్‌ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధార్నచౌక్‌లో ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్నాభోజన వంట కార్మికుల సంఘం రాష్ట్ర కమిటీ ఏజెన్సీల రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ధర్నాకు ముఖ్య అతిధిగా హాజరై రామచందర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్నా భోజన కార్మికులకు ప్రతి నెల 10వేల రూపాయల గౌరవవేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నా భోజన కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు వారికి అండగా బీజేపీ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబుయాదవ్, బీఆర్ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు అమలుకాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. యూనియన్ అధ్యక్షులు వడ్ల హనుమాండ్లు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లించాలన్నారు.

# రాష్ట్రంలో అవకాడో సాగుపై దృష్టి

## కొత్త పంటలపై ఎక్స్‌లెన్స్ పరిశోధనలు

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** తెలంగాణలో అవకాడో సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో రాష్ట్రంలోని రైతులు కొత్తపంటలు సాగు చేయాలనే లక్ష్యంతో ములుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఫ్రూట్స్ సంస్థ పరిశోధనలు చేస్తోంది. అందులో భాగంగా అత్యంత పోషకాలు, ఔషధాలు ఉండే అవకాడో సాగు చేపట్టింది. అమెరికా, మెక్సికోలో విస్తారంగా సాగుచేసే అవకాడోలో అనువైన రకాలను ఎంపికచేసి పరిశోధనలు సైతం పూర్తి చేసింది. తెలంగాణకు అనుకూలమైన ఆరసుప్రీం, కూర్గ్ అనే రకాలను ఎంచుకున్నది. ప్రధానంగా ఆర్క సుప్రీం, కూర్గ్ రవి అవకాడో వంగడాలను తీసుకొచ్చి ఎకరా విస్తీర్ణంలో సాగు చేయాలని నిర్ణయించారు. ఇందుకు ప్రత్యేకంగా స్థలాన్ని గతంలో గుర్తించి వేయడం కూడా జరిగింది. అవకాడో మొక్కలను పెంచే విధానం, దిగుబడి, మార్కెట్‌లో విక్రయాలు తదితర అంశాలను పూర్తి స్థాయిలో పరిశీలించారు. ఫలాలు చేతికొచ్చిన తర్వాత ఎక్సలెన్స్ లో మొక్కలు పెంచి రాష్ట్రంలోని రైతులకు అందించాలని నిర్ణయించారు. కాగా తెలంగాణలో అవకాడో సాగు ఇప్పుడు కొత్తగా వస్తున్న పంటలలో ఒకటి. రైతులు ఈ పంటను సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు, ఎందుకంటే ఇది మంచి లాభదాయకమైన పంటగా భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అవకాడో సాగుకు అనుకూలమైన వాతావరణం ఉందని, అలాగే దీనికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని కొందరు రైతులు ఇప్పటికే నిరూపించారు. ఎకరా విస్తీర్ణంలో ఈ పంట సాగుకు 208 మొక్కలు అవసరం. ఇక ఎకరాలో సాగుకు రూ.1.20 లక్షల ఖర్చవుతుంది. నాటిన మూడేళ్ల తర్వాత దిగుబడి ప్రారంభమై, 20 ఏళ్ల పాటు నిరంతరాయంగా దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.300 రూ.400 వరకు ధర పలుకుతోంది. ఈ అంశాలు పరిశీలించి భవిష్యత్తులో రైతులకి అందించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. సరికొత్త పంటలు సాగు చేయించాలన్నదే లక్ష్యమన్నారు. ఇందుకు పరిశోధనల ద్వారా కొత్తగా తీసుకొచ్చిన అవకాడో రకాలను ఇక్కడ సాగు చేస్తున్నట్లు తెలిపారు. పెంపకం, దిగుబడి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని భవిష్యత్తులో రైతులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

# 54 యేళ్ల చారిత్రక ఉత్తర ద్వారం తొలగింపు

## ఆలయ విస్తరణలో పాత చరిత్రకు వీడ్కోలు

## నవ్య వైకుంఠద్వారానికి స్వాగతం

**భద్రాచలం, జులై 12, ప్రభాతవార్త:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి, విస్తరణ పనుల్లో భాగంగా 54 ఏళ్ల చరిత్ర కలిగిన ఉత్తర ద్వారాన్ని ఆదివారం అధికారులు తొలగించారు. వైకుంఠ ద్వార దర్శనానికి ప్రతీకగా నిలిచిన ఈ చారిత్రక ద్వారం స్థానంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఉత్తర ద్వారాన్ని నిర్మించేందుకు రంగం సిద్ధమైంది.ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా ఉత్తర భాగంలో



రెండు ప్రాకారాల నిర్మాణం చేపడుతున్నారు. ఇందుకోసం ఇప్పటికే భూసార పరీక్షలు పూర్తి చేయగా, ప్రస్తుతం ఉన్న ఉత్తర ద్వారం పూర్తిగా తొలగించారు. అలాగే 2010లో భక్తుల రద్దీ నియంత్రణ కోసం రూ.15 లక్షలతో నిర్మించిన ఇనుప బ్రిడ్జిని కూడా తొలగించారు.ప్రతి ఏడాది వైకుంఠ ఏకాదశి సందర్భంగా లక్షలాది మంది భక్తులు ఉత్తర ద్వార దర్శనం కోసం భద్రాచలానికి తరలివస్తుంటారు. ఈ ఏడాది డిసెంబర్ 10 నుంచి 30 వరకు నిర్వ హించనున్న అధ్య యనోత్సవాలు, వైకుంఠ ద్వార దర్శనం నాటికి కొత్త ఉత్తర ద్వారం అందుబాటులోకి తీసుకు రావాలనే లక్ష్యంతో అధికారులు పనులను వేగవంతం చేశారు. 1972లో అప్పటి దేవస్థానం చైర్మన్ అల్లూరి మూర్తిరాజు ఆధ్వర్యంలో ఉత్తర ద్వారం నిర్మించ బడింది. కేవలం 45 రోజుల్లో నిర్మాణం పూర్తిచేసి అదే ఏడాది నుంచి వైకుంఠ ఏకాదశి రోజున స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం ఇవ్వడం ప్రారంభమైంది. అనంతరం 2010లో అప్పటి ఈవో ఎస్.ఎస్. చంద్రశేఖర్ ఆజాద్ ఆధ్వర్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉత్తర ద్వారాన్ని వెనక్కి జరిపి మరింత వెడల్పుగా అభివృద్ధి చేశారు.తాజా విస్తరణ పనులతో పాత ఉత్తర ద్వారం చరిత్రలో కలిసిపోగా, దాని స్థానంలో ఆధ్యాత్మిక వైభవానికి, ఆధునిక నిర్మాణ శైలికి ప్రతీకగా నిలిచే నూతన వైకుంఠ ద్వారం నిర్మాణం చేపడుతున్నారు. భక్తుల సౌకర్యం, రద్దీ నియంత్రణ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న ఈ నిర్మాణం భద్రాచలం ఆలయ అభివృద్ధి చరిత్రలో మరో మైలురాయిగా నిలవనుంది.

# షాబాద్ నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** షాబాద్ నరమేధం అత్యంత విషాదకరమని, నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో చిన్నారులతో సహా ఆరుగురిని కసాయిలా నరికి పొట్టనబెట్టుకున్న నరమేధంపై సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తుందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషాదకర ఘటనలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనబడుతోందని, ఈ పాశవిక చర్యకు పాల్పడిన నిందితుడిని వెంటనే అరెస్టు చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి కఠిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. నిందితుడికి బెయిలు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నీతులు చెబుతున్న నీటిచోరులు

## బ్యారేజిలు నింపితే కూలిపోతాయి

## ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** నీటి దొంగలు నీతులు చెబు తున్నారనీ బ్యారేజిలు నింపితే కూలిపోతాయని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రిటైర్డ్ ఇంజినీర్‌లు ఇచ్చిన నివేదిక ఎందుకు పక్కన పెట్టిండు మీ మామ, బ్యారేజీలు నింపితే కూలిపోతుందంటే.. లేదు నీళ్ల నింపు అంటు న్నావు బ్యారేజి పరిస్థితి నీకు అర్థం అవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ఎన్నేళ్లు అయ్యింది కట్టి.. కనీసం కుంగలేదు. కెటిఆర్ ఇది గ్రహించు అని హితవు చెప్పారు. కాళేశ్వరం వారం రోజులు ఇవ్వు అని కెటిఆర్ అంటే నాకు మూడు నెలలు ఇవ్వు అని హరీశ్ అంటున్నాడు. నీకు, నీ బావకే అవగాహన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక మీద పిల్లర్లు కట్టి ఇప్పుడు నీళ్ల నింపు అంటూ బిజెపి ఎంపి ఈటల రాజేందర్ కూడా ఇప్పుడు సన్నాయి నొక్కులు. ఈయన అటు పోతాడో .. ఆయన ఇటు వస్తాడో తెలియదని అన్నారు. ప్రజల రక్తం పీల్చిన జలగలు ఆ నలుగురు అని ఆరోపించారు.

# గాంధీభవన్‌లో సామెల్ అనుచరుల నినాదాల హోరు

## తుంగతుర్తి వివాదంపై అభిప్రాయాలు సేకరించిన పిసిసి పరిశీలకులు జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** గాంధీభవన్‌లో రెండోరోజు ఆది వారం తుంగతుర్తి వివాదంపై పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, తుంగతుర్తి పరిశీలకుడు జగ్గారెడ్డి, భువనగిరి పార్లమెంట్ వైస్‌ప్రెసిడెంట్ బస్వరాజ్ సారయ్య నాయకత్వంలో ఎమ్మెల్యే మందుల సామెల్‌ను ప్రశ్నించి సమాచారం రాబట్టారు. నియోజకవర్గంలోని తొమ్మిది మండలాలలో పార్టీ సంస్థాగత నిర్మాణం చేయడంలో పార్టీ జెండా పట్టుకొన్న వారికి కాకుండా కొత్తగా పార్టీలోకి చేరిన వారికి పదవులు ఇచ్చావనే ఆరోప ణలపై వివరణ ఇవ్వాలని జగ్గారెడ్డి, బస్వరాజ్ సారయ్య కోరారు. పార్టీ లో పదవుల పందేరానికి ఎఐసిసి మార్గదర్శకాలు పాటించలేదని ఆరో పణలు వస్తున్నాయని, ఎందుకు పాటించలేదు నిజమేనా అని సామె ల్‌ను అడుగగా ఆయన వివరించారు. తొమ్మిది మండలాల్లో పదవులు పొందిన వారి అర్హతలు కూడా తీసుకొని చూశారు. ఇదిలా ఉంటే సామెల్ అనుచరులు పెద్దఎత్తున గాంధీభవన్ చేరుకొని నినాదాలు చేశారు. సామెల్ నాయకత్వం వర్ధిల్లాలని బిసి ఎస్సీ ఎస్టీ ఐక్యత వర్ధిల్లాలని సామెల్ అనుచరులు నినదించడండంతో గాంధీభవన్ పరిసరాలు దద్దరిల్లాయి. జగ్గారెడ్డి నివేదికను పిసిసి చీఫ్‌కు త్వరలో అంది స్తానని తెలిపారు. జగ్గారెడ్డి అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ తుంగతుర్తిలో చెలరేగిన వివాదం అన్నదమ్ముల మధ్య ఉండే పోటీ వంటిదని, వ్యవస్థలో మొదట ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత ఉంటుందని తరువాత ఎంపికి, డిసిసికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. వివాదంపై అందరి అభిప్రాయం తీసుకొంటానని వివరించారు.

# అబద్ధాల వరద పారిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## కాళేశ్వరం కూలేశ్వరమైనా క్షమాపణలు చెప్పని హరీశ్‌రావు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నాయకులు అసహనంతో జారుడు బండపైన ఉన్నారని ముఖ్యమంత్రి కాళేశ్వరం పైన స్పష్ట మైన సమాచారం ఇస్తుంటే బిఆర్ఎస్ నాయకులు ముఖ్యంగా హరీష్‌రావు అబద్దాలు పారిస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. హరీశ్‌రావు చదువుకున్నది పాలిటెక్నిక్ అయినా పెద్ద ఇంజనీర్‌లా మాట్లాడు తున్నాడని అన్నారు. తన మెదడు అంతా రంగ రించి నిర్మించా నని మామ చెపితే హరీశ్‌రావు ఆయనకు తోడయ్యాడనీ విమర్శించారు. కాళేశ్వరం కూలేశ్వరం అయినా సిగ్గుపడకుండా మాట్లాడు తున్నాడని మేడిగడ్డ కూలిపోయిందని కుమిలి పోయి రాష్ట్ర రైతులకు క్షమాపణ చెపుతారని భావించామనీ ఆ దిశగా ఆయన కనీసం ఆలోచించడం లేదని, పైగా బుకాయిస్తున్నారనీ అన్నారు. ఎల్లంపల్లిని 2004 జులై 28న ఆనాటి సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎల్లంపల్లికి శంకుస్థాపన చేశారు. 2004, 2009 మధ్యనే బ్యారేజీ, ప్రధాన కాల్వలు పూర్తి అయ్యాయని తెలిపారు.. ఎల్లంపల్లి బ్యారేజ్ నిర్మాణానికి రాళ్లు తానే మోసినట్లుగా హరీష్ రావు మాట్లాడుతున్నాడనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎల్లంపల్లిని కూడా తమ ఖాతాలో వేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారనీ ఎద్దేవా చేశారు. ఎల్లంపల్లి తెలంగాణకు గుండె కాయ, మేడిగడ్డ తెలంగాణ గుండెకాయ అన్నారేకాని అది జారిపోయిందని అన్నారు. సైకోలుగా మారి బిఆర్ఎస్ నాయకులు కన్నెపల్లి పంప్ హౌస్ ను ఆన్ చేయాలంటే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో నీళ్ల ఉండాలనీ అన్నారు. నీళ్లను నిల్వ చేస్తే బ్యారేజీలకు ప్రమాదం అని బిఆర్ఎస్ హయాంలోనే ఎన్‌డిఎస్ ఏ సూచిం చిందని అన్నారు. కన్నెపల్లిలో మీటనొక్కితే ఎల్లంపల్లిలో నీళ్ల ఎలా వచ్చిపడతాయి? అని ఆది శ్రీనివాస్ అమాయకంగా ప్రశ్నించారు. ఊర్లు కొట్టుకు పోయినా సరే రాజకీయాలు ముఖ్యం అన్నట్లు బిఆర్ఎస్ నేతల తీరు ఉందనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండోసారి అధికారంలోకి వచ్చినప్పుడు హరీశ్‌రావుకు మంత్రి పదవే ఇవ్వకుండా కెసిఆర్ పక్కన పెట్టాడనీ అన్నారు.. నీటిని ఎత్తిపోస్తే జరిగే పరిణామాలను మా సిఎం చాలా స్పష్టంగా వివరించారు.. సైకో లా మారి రైతులను తప్పు దోవపట్టించే ప్రయత్నం చేస్తున్నారనీ ఆరోపించారు. బ్యారేజ్‌లకు మరమ్మత్తులు జరిగాకే నీటిని ఎత్తిపోస్తామనీ నిర్ద్వంద్వంగా ప్రకటించారు. ఇక నైనా కాళేశ్వరంపైన తప్పుడు ప్రచారం మాను కోవాలని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.వి.రాఘవేంద్రరావు

# ఆర్టీసీ లాభాల బాటలో ఉంటే పదవీవిరమణ ప్రయోజనాలు ఎందుకు ఇవ్వడం లేదు?

## ఇప్పటికైనా సిఎం, డిసిఎం జోక్యం చేసుకోవాలి

**హైదరాబాద్ (సైఫాబాద్), జులై 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆర్టీసీ లాభాల బాటలో నడుస్తున్నదని గొప్పలు చెప్పే మంత్రులు పదవీ విరమణ చేసిన అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు రావాల్సిన ప్రయోజనాలు చెల్లించడంలో ఘోరంగా విఫలం చెందారు. సంవత్సరాలు తరబడి ఎదురు చూస్తున్న పట్టించుకోవడం లేదు, ఇప్పటికే 400 మంది మృతి చెందారని, ఇకైనా సిఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క జోక్యం చేసుకుని తమకు సహాయం చేయాలని వారు మీడియా ముందు అభ్యర్థించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వి.రాఘవేంద్రరావు, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కొమరయ్య తదితరులు మాట్లాడుతూ గత 4 సంవత్సరాల నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగులు, అధికారులు, కార్మికులు మొత్తం 17 వేల మందికి ఆర్టీసీ యాజమాన్యం కేవలం 871 కోట్లు చెల్లించలేని దుస్థితిలో ఉందన్నారు. భయటకు మాత్రం ఆర్టీసీ లాభాల బాటలో ఉందని, కోట్లాది మంది తెలంగాణ ప్రజలను నమ్మిస్తూ పదవీవిరమణ చేసిన వారికి ఇవ్వవలిసిన ప్రయోజనాలను చెల్లించడంలో మాత్రం చేతగావడం లేదన్నారు. ఏ మంత్రిని, ఏ అధికారిని అడిగినా చేద్దామం, చూద్దామం అని చెపుతు న్నారేకాని చెల్లిస్తామని ఎవరూ చెప్పడం లేదని, ఇప్పటికైనా సిఎం, డిసిఎం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని వారు కోరారు.



ఆస్ట్రేలియాలో జరిగే ఫెసపల్లో పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రేణుక దాస్ జెన్వాడ్కర్

## ఫెసపల్లో వరల్డ్ కప్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** ఆస్ట్రేలియాలో త్వరలో జరగనున్న ఫెసపల్లో వరల్డ్ కప్ పోటీలకు నగరానికి చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ఫెసపల్లో అసోసియేషన్ అధ్యక్షుడు రేణుక దాస్ జెన్వాడ్కర్ ఎంపికైన క్రీడాకారుల వివరాలు వెల్లడించారు. తెలంగాణలో శిక్షణ పొందిన విశాల్, ఉద్దేశ్, జూగూటి ఆర్ఎన్ అక్షయ్, వైష్ణవ్, అరుణ్ సాయి మనదేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. ఆస్ట్రేలియాలో అక్టోబర్ 2 నుంచి 5 వరకు జరిగే ఈ పోటీలలో పది దేశాలు పాల్గొన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ క్రీడను ప్రోత్సహించేందుకు చాలా మంది వ్యాపారవేత్తలు ముందుకు వస్తున్నారు. అంతే కాకుండా తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ శాఖ అధికారులు సహకరించి, ఆర్థికంగా తోడ్పాటు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సెక్రటరీ జైదీప్ లఖానే, అసోసియేషన్ ప్రతినిధులు మయూర ఆకుల, విశాల్, మనీషా భారతీయలు పాల్గొన్నారు.

## ఎసిపి భార్య ఆత్మహత్య

**హైదరాబాద్ (అల్వాల్), జులై 12 ప్రభాతవార్త:** చార్మినార్ అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీసు(ఎసిపి)గా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్ సాయి బృందావన్ కాలనీలో ఎసిపి చంద్రశేఖర్ భార్య హేమలత(52)తో పాటుగా కుమారుడు చంద్రాస్, కోడలు లహరి, కమార్తె గీతాంజలి, అల్లుడు ప్రతీష్‌లుతో నివాసం ఉంటున్నారు. చంద్రశేఖర్ చార్మినార్ ఎసిపిగా ప్రస్తుతం పని చేస్తున్నారు. భార్య హేమలత ఇంటి వద్దనే బంగారు నగల దుకాణాన్ని నడుపుతున్నారు. సోమవారం కొడుకు ఎలక్ట్రికల్ సమాన్లు కొసం అల్వాల్‌కు వెళ్ళాడు. అదే సమయంలో చంద్రశేఖర్ కొడుకుకి ఫోన్ చేసి తక్షణం ఇంటికి వెళ్ళమని ఆదేశించాడు. ఇంటికి వెళ్ళగా తల్లి బెడ్‌రూమ్‌లో లోపలి నుంచి గడియ వేసుకుని ఉండడాన్ని గమనించాడు. తలుపులు ఎంత కొట్టినా తీయక పోవడంతో వాచ్‌మెన్ సహాయంతో తలుపులు తెరిచి చూడగా తల్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉంది. చికిత్స కోసం కొంపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. హేమలత కొంత కాలంగా స్పాండిలైటిస్ ఆర్థటిస్ సమస్యతో బాదపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం తెరపిస్ట్ ఇంటికి వచ్చి వైద్యం కూడా చేశాడు. ఆరోగ్యపరమైన సమస్యలు కారణంగానే బాధితురాలు ఆత్మహత్యకు పాల్పడినట్లు తేలింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 22న శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ సమావేశం

### సిఇఒ నియామకంపై నిర్ణయం

**అయోధ్య, జులై 12:** అయోధ్యలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ జూలై 22న నిర్వహించే సమావేశంలో ట్రస్ట్‌కు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) నియామకంపై నిర్ణయం తీసుకోనున్నట్లు శ్రీరామ జన్మభూమి ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా ఆదివారం వెల్లడించారు. ఆలయ హుండీ నిధుల చోరీ ఆరోపణల నేపథ్యం లో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ట్రస్ట్‌కు అనుబంధంగా పని చేస్తున్న వివిధ కమిటీలు, ఉపకమిటీల భవిష్యత్తుపై కూడా ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు



తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. సీఈవోను నియమించిన తర్వాత, ట్రస్ట్ పర్యవేక్షణలో అవసరమైన సిబ్బందిని నియమించే అధికారాన్ని సీఈవోకు అప్పగిస్తామని, దీంతో ట్రస్ట్ పరిపాలనా వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని నృపేంద్ర మిశ్రా వివరించారు. అలాగే ట్రస్ట్‌లో ఎక్స్ ఆఫిషియో సభ్యులకు ఓటు హక్కు ఉండదని స్పష్టం చేశారు. ఇటీవలి పరిపాలనా పరిణామాలు, ముఖ్యంగా ఆలయ హుండీ నిధుల చోరీ ఆరోపణల కారణంగా అయోధ్యకు వచ్చే భక్తుల సంఖ్య తగ్గిందనే వార్తలను ఆయన ఖండించారు. రామమందిర దర్శనం కోసం ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు అయోధ్యకు వస్తూనే ఉన్నారని తెలిపారు.

## రాష్ట్రంలో ఫ్లైఓవర్ల కింద విద్యుత్ సబ్‌స్టేషన్లు

### ప్రయోగాత్మకంగా హైదరాబాద్‌లో అమలు

### విద్యుత్ పంపిణీ సంస్థల కీలక నిర్ణయం

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త :** పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌తో పాటు, నాణ్యమైన, అవాంతరాలు లేకుండా సరఫరా చేసేందుకు గాను రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లోని ఫ్లైఓర్ల కింద విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని విద్యుత్ పంపిణీ సంస్థలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఇందులో భాగంగా తొలుత హైదరాబాద్ మహానగరంలోని ఫ్లైఓవర్ల కింద విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. నగరంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి, స్థలాల కొరతను అధిగమించడానికి ఫ్లైఓవర్ల కింద 33/11కేవీ సామర్థం గల సబ్‌స్టేషన్లను నిర్మించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ వినూత్న ప్రాజెక్టులో భాగంగా సిటీలోని వేర్వేరు ఫైవంతెనల కింద మొత్తం పది ఉపకేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ప్రాథమికంగా మూడు కీలకమైన ప్రాంతాలలో నిర్మాణ పనులు చేపట్టేందుకు అనువైన స్థలాలను అధికారులు ఇప్పటికే అధికారికంగా ఎంపిక చేశారు.

## ప్రాజెక్టులపై చిత్తశుద్ధి ఉంటే చర్చకు సిద్ధమా?

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి జగదీశ్‌రెడ్డి సవాల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై12:** కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి, మంత్రులు అవగాహన లేకుండా మూర్ఖంగా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కన్నెపల్లి పంపు హౌస్ నుంచి నీళ్ల వదిలితే రాష్ట్రాన్ని కరువు బారి నుంచి కాపాడుకోవచ్చని హితవు పలికారు. ప్రాజెక్టులపై, రైతులపై చిత్తశుద్ధి ఉంటే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. గంధమళ్ళ, బస్వాపూర్ నుంచి మొదలుపెట్టి కొండపోచమ్మ, మల్లన్న సాగర్, అప్పర్ మానేర్, మిడ్ మానేర్, అన్నపూర్ణ, రంగనాయక్ సాగర్, సుందిళ్ల, ఎస్సారెస్పీ, అన్నారం బ్యారేజీ నీళ్ల మొత్తం తీసుకుపోయి గోదావరిలో ఒక్కదగ్గర పోసినా కూడా భద్రాచలానికి ఏమీ కాదని పేర్కొన్నారు. నీటిని స్టోరేజీ చేస్తే భద్రాచలం మునిగిపోతుందని చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ వాదనలను తిప్పికొట్టారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలవి డ్రామాలు

### రైతుల ఆగ్రహానికి ఆ రెండు పార్టీలు బలికాక తప్పదు

### కేంద్రమంత్రి బండి సంజయ్ హెచ్చరిక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 12:** కాళేశ్వరంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు డ్రామాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ సెటైర్లు గుప్పించారు. 'కాంగ్రెస్ డైరెక్షన్.. బీఆర్ఎస్ యాక్షన్ మూవీ.. రక్త కన్నీరు2' అని ఆదివారం సాయంత్రం ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రజలకు రెండు పార్టీల నేతలు రక్తకన్నీరు సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. 'రక్త కన్నీర్లు నాగభూషణాన్ని మించి నటనలో జీవిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని నీళ్ల పాల్జేసిందని ఆరోపించారు. ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా చర్యలు తీసుకోకుండా కాంగ్రెస్ సర్కార్ కాళేశ్వరాన్ని కోమాలోకి నెట్టిందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. ఈ రెండు పార్టీల పాపాలకు తెలంగాణ రైతన్నలే బలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేతకానితనాన్ని ఎన్డీఎస్ఏపై నెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. డ్యామ్ సేఫ్టీ యాక్ట్2021 ప్రకారం బ్యారేజీల యజమాని తెలంగాణ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఎన్డీఎస్ఏ, సీడబ్ల్యూసీ కమిటీలు సలహాలు మాత్రమే ఇస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. బ్యారేజీ మరమ్మతు పనులు చేయాల్సింది కాంగ్రెస్ సర్కార్‌నే... బాధ్యత వహించాల్సింది కూడా ఈ ప్రభుత్వానిదేనని బండి సంజయ్ స్పష్టం చేశారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ ఇప్పటికే మూడుసార్లు నివేదిక ఇచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదు? అని ప్రశ్నించారు. పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని పదేపదే చెప్పినా ఎందుకు పెడచెవిన పెడుతున్నారు? అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సర్కార్ చేతగానితనాన్ని కేంద్రంపై నెట్టడం సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌కు అలవాటుగా మారిందని మండిపడ్డారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, బాధ్యులను జైల్లో వేస్తామని గతంలో కాంగ్రెస్ ప్రకటించలేదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. అధికారంలోకి వచ్చాక రూ.లక్ష కోట్ల అవినీతిపై విచారణ జరపకుండా రూ.9 వేల కోట్ల అవినీతిపై విచారణకే పరిమితమైంది నిజం కాదా? అని నిలదీశారు. అసలు విజిలెన్స్ నివేదికను బయటపెట్టే దమ్ముందా? అని బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాపాలను రేవంత్‌రెడ్డి మోయడం వెనుక మతలబు ఏమిటి? అని నిలదీశారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం మరమ్మతుల విషయంలోనూ రెండున్నరేళ్లు జాప్యం చేసింది మీరు కదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజల నుంచి ఒత్తిడి వస్తుంటే చర్చను దారి మళ్లించేందుకు ఎన్డీఎస్ఏకు అప్పగిస్తామంటూ కేంద్రంపై నెట్టాలని చూస్తున్నారని ఆగ్రహించారు.

# కెటిఆర్, హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించొద్దని సిఎంతో చెప్తా

### జిల్లాలో మరో ఆరు సీట్లు పెరగడం ఖాయం

### వచ్చే ఎన్నికల్లో జిల్లాలో 18 సీట్లు కైవసం చేసుకుంటాం: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**యాదాద్రి భువనగిరిబ్యూరో, ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లా రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపేలా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేయడంతో పాటు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య రాజకీయ భవిష్యత్తుపై కీలక సంకేతాలు ఇస్తూ భవిష్యత్తులో ఐలయ్యను రాష్ట్ర మంత్రివర్గంలో చూస్తారని ప్రకటించడం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపగా, జిల్లా రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీసింది. ఆదివారం రామన్నపేట, వంగపల్లి గ్రామాల్లో సుమారు రూ.700 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన భారీ బహిరంగ సభలో రాష్ట్ర రాజకీయాలు, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, ప్రతిపక్షాల విమర్శలు, ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి, భవిష్యత్ రాజకీయాలపై తనదైన శైలిలో ప్రసంగించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేయడమే కాకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగితే ఉమ్మడి నల్గొండ జిల్లాలో మరో ఆరు అసెంబ్లీ స్థానాలు పెరగడం ఖాయమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లాలోని 18 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంటుందని, రాష్ట్రంలో మరోసారి స్పష్టమైన ప్రజా తీర్పు కాంగ్రెస్‌కే వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతలు కేటీఆర్, హరీశ్‌రావు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలకు స్పందించాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచిస్తానని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై మంత్రి ప్రశంసల జల్లు కురిపించారు. ఐలయ్య తనకు సొంత తమ్ముడు లాంటి వారని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ పార్టీలు, వర్గాలకు అతీతంగా సేవ చేస్తున్న నాయకుడని కొనియాడారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, బీసీ బిడ్డగా తనకు ప్రజలు అందించిన ఆదరణ జీవితాంతం మరువలేనిదని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో ప్రజాసేవ చేసే



అవకాశం దక్కిందని పేర్కొన్నారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధే తన ఏకైక లక్ష్యమని, ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించే వరకు విశ్రాంతి తీసుకోనని స్పష్టం చేశారు.

## ఆర్‌సిపురంలో మాంగళ్య షాపింగ్ మాల్ 31వ శాఖ ప్రారంభం

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** 2012లో తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్, వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తోంది. నాణ్యమైన వస్త్రాన్ని సరసమైన ధరలకు అందిస్తూ ప్రజల ఆదరణను పొందిన మాంగళ్య ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో తన ఉనికిని చాటింది. ఈ క్రమంలో ఆర్‌సి పురంలో శాఖను ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి రాశి ఖన్న ముఖ్య అతిథిగా హాజరై దీప ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి అభిమానులతో సంతోషంగా గడిపారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చి ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. రిబ్బన్ కటింగ్ అనంతరం నటి రాశి ఖన్నా మాట్లాడుతూ.. ఆర్‌సి పురం ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారని నమ్మకం ఉందని వారి ఆశీర్వాదాలతో ఈ మాల్ మరింత విజయవంతమవుతుందన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నరసింహా మూర్తి, కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు కొనుగోలు చేయవచ్చన్నారు.



రూ. 99 నుంచి ప్రారంభమై రూ.1 లక్ష వరకు ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉండటంతో పాటు, మాంగళ్య ఒక సంపూర్ణ ఫ్యామిలీ షాపింగ్ మాల్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్, రాబోయే రోజుల్లో ఈ మూడు రాష్ట్రాల్లోనే 10 కొత్త ప్రాజెక్టులు ప్రారంభించనుండగా, భవిష్యత్తులో తమిళనాడు రాష్ట్రానికి కూడా విస్తరించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన మాంగళ్య షాపింగ్ మాల్, పాన్ ఇండియా స్థాయిలో నంబర్ వన్ షాపింగ్ మాల్‌గా నిలుస్తోందన్నారు. ఆర్‌సి పురం ప్రజలు తమ తమ శుభకార్యక్రమం ఏది ఉన్న ఒకసారి మాంగళ్య షాపింగ్ మాల్‌కు సకుటుంబ సపరివారంగా విచ్చేసి ఒక నూతన షాపింగ్ ఒరవడి సృష్టించాలని డైరెక్టర్స్ కోరారు.

## కాళేశ్వరం పునరుద్ధరణలో ప్రభుత్వం పూర్తిగా విఫలం

### సిఎంకు బిజెపి రాష్ట్ర చీఫ్ రామచందర్‌రావు బహిరంగ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై12:** కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణలో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా వైఫల్యం చెందిందని ఆరోపిస్తూ సీఎం రేవంత్ రెడ్డికి బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ చేతగానితనం వల్లే ఉత్తర తెలంగాణకు సాగు, తాగునీరు అందడం లేదని ఆయన మండిపడ్డారు. ఎన్‌డిఎస్‌ఏ నివేదికలను పట్టించుకోకుండా మూడు వర్కింగ్ సీజన్లను వృథా చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు కేంద్ర కమిటీపై నెపం నెట్టి తన బాధ్యతల నుండి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పునరుద్ధరించలేకపోయారని లేఖలో పేర్కొన్నారు. ఎన్‌డిఎస్ఎ సిఫారుసులను సకాలంలో అమలు చేయలేకపోవడం వల్ల..ప్రజలు, రైతాంగ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రామచందర్ రావు విమర్శించారు.

## 27, 28 తేదీల్లో ఢిల్లీలో జాతీయ బిసి సెమినార్

### ఎంపి ఆర్. కృష్ణయ్య వెల్లడి

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో పాటు కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 27, 28 తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో జాతీయ స్థాయి బీసీ సెమినార్‌ను నిర్వహించనున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఈ సదస్సుకు కేంద్ర మంత్రులు, అన్ని పార్టీల పార్లమెంట్ సభ్యులతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో బీసీ మేధావులు, ప్రొఫెసర్లు, సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అవినీతి రహిత పాలనతో దూసుకుపోతోందని కొనియాడారు.

## వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య 'వర్సిటీల్లో ఇంటర్వ్యూలు లేకుండానే ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

### ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం సర్కార్ కొలువుల భర్తీలో తొలిసారి కీలక ముందడుగు వేసింది. రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య యూనివర్సిటీల్లో తొలిసారిగా ఇంటర్వ్యూలు లేకుండా ప్రొఫెసర్ ఉద్యోగాలను భర్తీ చేయనుంది. వ్యవసాయ శాఖ అధికారవర్గాల వివరాలు ప్రకారం విద్యార్హతలు, రాత పరీక్షకు 50 మార్కుల చొప్పున కేటాయించి మొత్తం 100 మార్కులకు సెలక్షన్ ప్రొసెస్ ఉండనుంది. ఇక ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 1,000 ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీకి రంగం సిద్ధం చేస్తుంది. అగ్రికల్చర్ యూనివర్సిటీలో 48 ప్రొఫెసర్ పోస్టులు, 148 అసోసియేట్ పోస్టులు, 370 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల చొప్పున మొత్తం 566 పోస్టులను భర్తీ చేయనుంది. ఇక ఉద్యాన యూనివర్సిటీలో 17 ప్రొఫెసర్ పోస్టులు, 44 అసోసియేట్ పోస్టులు, 79 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు కలిపి మొత్తం 140 పోస్టులు, పశువైద్య యూనివర్సిటీలో 235 పశువైద్య పోస్టులు, 20 డెయిరీ పోస్టులు, 39 మత్స్యశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు కలిపి మొత్తం 294 పోస్టులను భర్తీ చేయనుంది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆమోదం కూడా వచ్చేసింది.

ఇంటర్వ్యూలు లేకుండా ఈ పోస్టులను భర్తీ చేయాలనే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల ప్రకారం.. దీనికి అనుగుణంగా అగ్రి యూనివర్సిటీ విధివిధానాల రూపకల్పన చేసి ప్రభుత్వానికి సమర్పించింది. ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిన అనంతరం నియామకాలకు వరుస నోటిఫికేషన్‌లు జారీ చేస్తారు. ఒక వేళ అగ్రి యూనివర్సిటీ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపితే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో విద్యార్హతలకు గరిష్ఠంగా 50 శాతం మార్కులు ఉంటాయి.

ఇందులో బ్యాచిలర్ డిగ్రీకి 10 శాతం, మాస్టర్స్ డిగ్రీ 15 శాతం, పీహెచ్‌డీ 5 శాతం, అంతర్జాతీయ సంస్థల్లో ఫెలోషిప్ 5 శాతం, గోల్డ్ మెడల్ సాధించిన వారికి 3 శాతం, జర్నల్స్‌లో ఆర్టికల్స్ 4 శాతం, ఆవిష్కరణలు, పేటెంట్లు 4 శాతం, పరిశోధన సంస్థల్లో అనుభవం 4 శాతం చొప్పున వెయిటేజీ ఉంటుంది. ఇక మిగిలిన 50 మార్కులను రాత పరీక్షకు కేటాయిస్తారు. అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ పోస్టులకు ఐకార్, యూజీసీ నిబంధనలను అనుసరించి విద్యార్హతలకు ఏకంగా 80 శాతం మార్కులు కేటాయించి, మిగిలిన 20 మార్కులను డెమో లెక్చర్‌కు 20 శాతం మార్కులు కేటాయించనున్నారు.

## ఆ కారు ఎవరిది?

### ఫిల్మ్‌నగర్‌లో అపార్ట్‌మెంట్ గేటులోకి దూసుకెళ్లిన ఫెరారీ కారు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జులై 12, ప్రభాతవార్త:** ష్.. అంతా గప్‌చుప్.. మాకేం తెలియదు.. మమ్మల్ని అడగొద్దు.. ఎలాంటి ఫిర్యాదు రాలేదు.. ఫెరారీ రోమా కారు ఎవరిదో పూర్తి వివరాలు తెలియదు.. ఇది ఫిల్మ్‌నగర్‌లో జరిగిన ఫెరారీ కారు ప్రమాద సంఘటనలో పోలీసుల తీరు! దాదాపు రూ. 3.5 కోట్ల కారు తెల్లవారుజామున 4.30 గంటలకు ఫిల్మ్‌నగర్ రోడ్ నంబరు 5లోని హిల్ వ్యూ అపార్ట్‌మెంట్‌లోకి దూసుకొచ్చింది. వేగంగా వచ్చి కారు ఢీకొట్టడంతో కారులోని బెలూన్‌లు తెరుచు కున్నాయి. అపార్ట్‌మెంట్ వాసులు శబ్దానికి కంగారపడి కిందకు వచ్చి చూడగా ధ్వంసమైన గేటు, గోడ ముందు ఫెరారీ కారు కనిపించింది. అప్పటికే కారులో ఉన్న వారు ప్రమాదం అనంతరం కారును వదిలి పరారయ్యారు. విషయం తెలుసుకున్న ఫిల్మ్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సంఘటనా స్థలంలో కారులోని బెలూన్‌లు అన్ని తెరుచుకొని కనిపించాయి. కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. కాగా ఈ ప్రమాదంపై పలు ప్రచారాలు జరుగుతున్నాయి. కారులో సంపన్నవర్గాలకు చెందిన ముగ్గురు యువకులు మద్యం మత్తులో అత్యంత వేగంగా ప్రయాణిస్తూ ఈ ప్రమాదానికి పాల్పడ్డట్లు తెలుస్తుంది. ప్రమాదం అనంతరం కారులో ఉన్న యువకులు మరో కారులో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సంఘటనాస్థలంలో ఉన్న కొందరు చెబుతున్నారు. అయితే కారుప్రమాద విషయాలపై ఫిల్మ్‌నగర్ పోలీసులను వివరాలు కోరగా తమ వద్ద ఎలాంటి వివరాలు లేవని, కారు ఎవరిదనే విషయం తమకు తెలియదని చెప్పారు. దెబ్బతిన్న గేటును, గోడను తిరిగి ఏర్పాటు చేస్తామని కారు సంబంధీకులు అపార్ట్‌మెంట్ వాసులకు చెప్పడంతో ఎలాంటి ఫిర్యాదు చేయలేదని చెబుతున్నారు. ఇదిలా ఉండగా కారు ఒక కంపెనీ పేరుతో ఉందని, కారులో ఇద్దరు ఉన్నట్లు ఫిల్మ్‌నగర్ డిఐ తెలిపారు. కారు నడుపుతున్న వ్యక్తిని సతీష్‌గా గుర్తించామని, అతని వివరాలు సేకరించామన్నారు. అతనికి శ్వాస విశ్లేషణ పరీక్షలు నిర్వహించగా ఎలాంటి మద్యం సేవించలేదని తేలిందని స్పష్టం చేశారు. ఫిర్యాదు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదని ఆయన తెలిపారు. కారు ఏ కంపెనీ పేరుతో ఉందో తనకు గుర్తులేదని ఉదయం ఈ కేసును ఎఎస్సై చూసినట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా కారు ఎక్కడి నుంచి బయలుదేరింది, ఉదయం వేళ ఎక్కడికి వెళ్లి వస్తున్నారు, ఎంత వేగంతో వస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరి పుత్రరత్నాలు వారు అనే విషయాన్ని, సీసీ ఫుటేజీలను పోలీసులు గుర్తించకపోవడం అనుమానాలకు తావిస్తుంది. కారు నంబరు ఎంహెచ్ 01 ఇసి 1234 నంబరుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విశ్వ సముద్ర హోల్డింగ్స్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో ఈ కారు ఉన్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా మూడు రోజుల క్రితమే జూబ్లీహిల్స్‌లో ఒక కారు సినీనటుడు ధర్మమహేష్ ఇంట్లోకి దూసుకెళ్లగా, ఇప్పుడు ఈ కారు అపార్ట్‌మెంట్ గేటులోకి దూసుకెళ్లడం గమనార్హం.



గేటులోకి దూసుకెళ్లిన ఫెరారీ కారు



కారు డ్రైవింగ్ సీట్లో కూర్చున్న ఆరున్నరేళ్ల బాలిక

## చట్టం ఎస్సై చుట్టమా!

### ఆరేళ్ల మనవరాలితో కారు నడిపించి అభాసుపాలు

### ప్రశ్నించిన వాహనదారులను దబాయించిన ఎస్ఐ

### కేసు నమోదు చేసిన నార్సింగి పోలీసులు

**హైదరాబాద్ (నార్సింగి), జులై 12, ప్రభాతవార్త :** చట్టాన్ని అమలు పరిచే బాధ్యతను నిర్వహిస్తున్న ఓ ఎస్.ఐ, చట్టం మా చుట్టమన్నట్లు ఆరేళ్ల వయసున్న తన మైనర్ మనుమరాలితో ప్రధాన రహదారిపై కారును నడిపించి ఇతర వాహనదారులకు ఇక్కట్లను కలిగించాడు. రోడ్డుపై జిగ్‌జాగ్‌గా, మెల్లగా కారు నడువడంతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. దీంతో కొందరు వాహనదారులు వెళ్లి నిదానంగా వెళ్తున్న కారును ఆపి, డ్రైవింగ్ సీట్లో ఆరేళ్ల మైనర్ బాలికను చూసి ఖంగు తిన్నారు. మైనర్‌కు వాహనంను ఇవ్వడం చట్టరీత్య నేరమని ఇతర వాహనదారులు అడిగడితే కారులో ఉన్న సదరు ఎస్.ఐ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. కారు మొత్తం నా కంట్రోల్‌లోనే ఉందని, ఈ కారు ఆటోగేర్‌దని, అయితే ఇప్పుడు ఏమి చేస్తారని పేర్కొన్నాడు. వాహనదారులు పోలీసులకు సమాచారం ఇస్తామని చెప్పడంతో డ్రైవర్ సీట్లో ఉన్న ఆరేళ్ల బాలిక మా తాతనే ఎస్.ఐ అని చెప్పింది. చట్టాన్ని ఉల్లంఘించడమే కాకుండా, ప్రశ్నించిన వాహనదారులను ఎస్.ఐ దబాయించి పోలీసు శాఖకు మాయని మచ్చను తీసుకు వచ్చారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని నిత్యం ప్రజలకు సూచనలు చేసే పోలీసు శాఖలో పని చేస్తున్న సదరు ఎస్.ఐ తాను చట్టానికి అతీతుడను అన్నట్లు వ్యవహరించారు. ఈ తతంగమంతా తోటి వాహనదారులు మొబైల్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టారు. అది వైరల్‌గా మారి ప్రధాన మీడియాలో పతకా శీర్షికల వార్తగా మారింది. ప్రధాన మీడియా, సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న సదరు ఎస్.ఐ తీరును గమనించిన పోలీసు ఉన్నతాధికారులు అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలోని గంధంగూడ-బైరాగిగూడ ప్రధాన రహదారిపై ఆదివారం ఉదయం జరిగింది. మైనర్ మనుమరాలితో కారు(టిఎస్07 జిపి 7450)ను నడిపించి, ఇతర వాహనదారులను ఇబ్బందులకు గురి చేసిన ఎస్.ఐ పూజారి తిరుపతి ప్రస్తుతం హైదరాబాద్ పోలీసు కమీషనరేట్ పరిధిలో ఎస్.ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడిపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. భారత న్యాయ సంహిత సెక్షన్ 125, మోటార్ వెహికిల్ యాక్ట్ సెక్షన్‌లు 180, 184.కింద కేసులు పెట్టి, దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు.



# ధవళేశ్వరం బ్యారేజీకి నూతన జీవం

**● 117 వరద గేట్ల మార్పిడికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు శ్రీకారం**

**● గోదావరి డెల్టా భద్రత, సాగునీటి భవిష్యత్తుకు చరిత్రాత్మక అడుగు**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 12 ప్రభాతవార్త:** ఉభయ గోదావరి జిల్లాల వ్యవసాయ, తాగునీటి అవసరాలకు దాదాపు రెండు శతాబ్దాలుగా జీవనాడిగా నిలిచిన ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కానుంది. సుమారు రూ152.95 కోట్ల వ్యయంతో 117 పాత వరద గేట్ల స్థానంలో అత్యాధునిక వరద గేట్ల ఏర్పాటు పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో పిచ్చుకలంక గేట్ నెంబర్ ఒకటి వద్ద సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. గోదావరి డెల్టా సాగునీటి భద్రత, ఆనకట్ట దీర్ఘకాలిక సంరక్షణ దిశగా ఇది అత్యంత కీలకమైన మైలురాయిగా అధికారులు పేర్కొంటున్నారు.

1847లో ప్రారంభమై 1852లో పూర్తయిన ధవళేశ్వరం ఆనకట్టతో గోదావరి జలాలను సక్రమంగా వినియోగించేందుకు మార్గం సుగమమైంది. అప్పటి వరకు సముద్రంలో కలిసిపోయే వరద జలాలను వ్యవసాయానికి మళ్లించి,గోదావరి డెల్టాను దేశంలోనే అత్యంత సారవంతమైన ప్రాంతాల్లో ఒకటిగా తీర్చిదిద్దడంలో సర్ ఆర్థర్ కాటన్ పాత్ర చారిత్రాత్మకంగా నిలిచింది. ఈ కృషికి గుర్తింపు గా గోదావరి ప్రాంత రైతులు నేటికీ ఆయనను కృతజ్ఞతాభావంతో స్మరిస్తుంటారు. కాలక్రమేణా పాత ఆనకట్ట వయోభారానికి లోనవడంతో, 1963 వరదల అనంతరం ఆధునిక బ్యారేజీ నిర్మాణ అవసరం ఏర్పడింది. 1969లో ప్రారంభమైన సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నిర్మాణం 1984లో పూర్తయింది. దాదాపు 5.837 కిలోమీటర్ల పొడవున్న ఈ బ్యారేజీ ప్రస్తుతం 10.13 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడంతో పాటు లక్షలాది మంది ప్రజలకు తాగునీటి ప్రధాన ఆధారంగా కొనసాగుతోంది. వరద నియంత్రణ, డెల్టా వ్యవసాయ పరిరక్షణలోనూ ఇది కీలక పాత్ర పోషిస్తోంది.

నాలుగు దశాబ్దాలుగా నిరంతర వినియోగం, భారీ వరదల ఒత్తిడి, యాంత్రిక భాగాల సహజ శిథిలీకరణ నేపథ్యంలో బ్యారేజీ భద్రతపై కేంద్ర జల సంఘం, డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్, హైడ్రోమెకానికల్ నిపుణుల కమిటీలు పలు దఫాలు పరిశీలనలు నిర్వహించాయి. వాటి సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం బ్యారేజీ ఆధునీకరణకు శ్రీకారం చుట్టింది.

201415లో తొలి దశలో 175 వరద గేట్లలో 58 గేట్లను రూ.31.77 కోట్లతో మార్చగా, ఇప్పుడు మిగిలిన 117 గేట్ల మార్పిడి, అన్ని 175 గేట్లకు కొత్త రబ్బర్ సీల్స్, రోలర్ అసెంబ్లీలు, వైర్ రోపులు, మాస్టర్ కంట్రోల్ ప్యానెల్స్, విద్యుత్ కేబుళ్ల మార్పిడి, శాండ్ బ్లాస్టింగ్, పెయింటింగ్ వంటి సమగ్ర పనులు చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే బ్యారేజీ భద్రత, వరద నిర్వహణ సామర్థం మరింత మెరుగుపడుతుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

ప్రభుత్వం 2025లో ఈ పనులకు పరిపాలనా అనుమతి మంజూరు చేయగా, సాంకేతిక ఆమోదం అనంతరం ఎంఎస్ బికెం ఇన్ ప్రా ప్రాజెక్టుస్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థకు పనులు అప్పగించారు. రెండు సంవత్సరాల్లో పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రాజెక్టు అమలవుతోంది.

ఈ కార్యక్రమం కేవలం గేట్ల మార్పిడితో పరిమితం కాకుండా, గోదావరి డెల్టా భవిష్యత్తుకు భద్రత కల్పించే దీర్ఘకాలిక పెట్టుబడిగా భావిస్తున్నారు. ముఖ్యంగా తూర్పు, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల రైతాంగంతో పాటు మత్స్యకారులు, గ్రామీణ ప్రజల జీవనోపాధి మరింత స్థిరపడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

ఇటీవల ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిన గోదావరి ప్రాంత వారసత్వ సంపద సంరక్షణ దిశగా కూడా ఈ ఆధునీకరణ కార్యక్రమం ప్రాధాన్యం సంతరించుకుంది. చారిత్రక విలువ కలిగిన బ్యారేజీ నిర్మాణ వారసత్వాన్ని పరిరక్షిస్తూనే, ఆధునిక సాంకేతికతతో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే ప్రయత్నంగా దీనిని భావిస్తున్నారు.

సర్ ఆర్థర్ కాటన్ సృష్టించిన జలవనరుల వారసత్వాన్ని సంరక్షిస్తూ, భవిష్యత్ తరాలకు సురక్షితమైన సాగునీటి వ్యవస్థను అందించాలనే లక్ష్యంతో చేపడుతున్న ఈ కార్యక్రమం గోదావరి డెల్టా చరిత్రలో మరో సువర్ణ అధ్యాయంగా నిలవనుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.



## జ్యోతి సురేఖ, ప్రీతిక ప్రదీప్, చికిత తానిపర్తికి సిఎం చంద్రబాబు అభినందనలు

**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్4 మహిళల కాంపౌండ్ ఈవెంట్‌లో రజతం సాధించిన జ్యోతి సురేఖ, ప్రీతిక ప్రదీప్, చికిత తానిపర్తికి ముఖ్యమంత్రి చంద్రబాబ అభినందనలు తెలిపారు. యువ అథ్లెట్లకు రాష్ట్ర ముద్దుబిడ్డ జ్యోతి సురేఖ స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. ఛాంపియన్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ టోర్నమెంట్‌లో టీమ్ ఇండియా మరిన్ని విజయాలు సాధించాలన్నారు.

**క్రీడా మంత్రి అభినందన:** ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్4లో పతకాలను సాధించిన జ్యోతి సురేఖ, ప్రీతిక ప్రదీప్, చికిత తానిపర్తికి ఎపి క్రీడా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అభినందించారు. వారు మంచి విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. వారు విలుక్రీడలో రాణించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహన్ని అందిస్తుందన్నారు.

# హంద్రీనీవా విస్తరణకు శ్రీకారం

**● రూ.790 కోట్ల పనులు ప్రారంభించిన మంత్రి నిమ్మల రామానాయుడు**



**హిందూపురం, జులై 12 ప్రభాతవార్త:** హంద్రీనీవా కాలువ వెడల్పు చేస్తూ మడకశిర బ్రాంచ్ కెనాల్ వరకు విస్తరించే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శంకుస్థాపన చేశారు. హిందూపురం పర్యటనకు వచ్చిన సందర్భంగా బాలయ్య రాచపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం భూమి పూజ చేసి ప్రారంభించగా రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, ఎమ్మెస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా లాంఛనంగా కాలువ వెడల్పు పనులను స్వయంగా బాలకృష్ణ హిటాచి వాహనం నడుపుతూ ప్రారంభించడం విశేషం. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ ఐదేళ్ల గొడ్డలి పార్టీ పాలనలో రాయలసీమకు చేసిందేమీ లేదని, సీమ ద్రోహులుగా మిగిలిపోయారని ఘాటుగా విమర్శించారు. తమ ప్రభుత్వం రాయలసీమ రతనాల సీమగా మార్చుతోందని అన్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కృషితోనే 790 కోట్ల రూపాయల నిధులు హంద్రీ నీవా పనులకు విడుదల అయ్యాయని చెప్పారు. తమ ప్రభుత్వంలో రూ. 3,800 కోట్లు నిధులు విడుదల చేశామని చెప్పారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ హిందూ పురం ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. అనంతరం పట్టణంలో ఎంజీఎం క్రీడా మైదాములో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంను బాలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురం ప్రజల రుణం తీర్చుకోలేనిదని అభివృద్ధి పనులు చేస్తూ ప్రజలకు అండగా ఉంటామని వివరించారు. కష్టపడిన పార్టీ కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని స్పష్టం చేశారు. ఇండోర్ స్టేడియం ప్రారంభంతో ఎంతో కాలంగా ఉన్న సమస్య తీరిందని దేహ దారుడ్యానికి క్రీడలు ఎంతో కీలకం అన్నారు. అనంతరం బాలయ్యతో పాటు ఎంపీ పార్థసారథి, కలెక్టర్ శ్యాంప్రసాద్, చైర్మన్ రవి నాయుడు షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. అదేవిధంగా టేబుల్ టెన్నిస్ కూడా ఆడుతూ క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. రాచపల్లిలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హాజరు అయ్యారు. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్రబాబు, శ్రీనివాసరావు, వీరయ్య, బాలాజీ తోపాటు మున్సిపల్ మాజీ చైర్మన్లు అనిల్ కుమార్, రమేష్ కుమార్, పట్టణ టిడిపి అధ్యక్షులు వెంకటేష్ మొదలగు వారు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సవిత

## విద్యకు అధిక ప్రాధాన్యత: మంత్రి సవిత

**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** బిసి విద్యార్థుల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత వ్యాఖ్యానించారు. సన్నబియ్యంతో రుచికరమైన భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. డైట్ ఛార్జీల బిల్లులు 10శాతం పెంచబోతున్నామని తెలిపారు. బిసి బిడ్డలకు రుచికరమైన, కడుపు నిండేలా భోజనం అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. బిసి విద్యార్థులు అత్యున్నత స్థానాల్లో నిలవాలన్నదే సిఎం చంద్రబాబు లక్ష్యమని ఉద్ఘాటించారు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండల కేంద్రంలో మంత్రి సవిత పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వత్సవాయి ఎంజెపి గురుకుల పాఠశాలలో పి4 విధానంలో రూ.75 లక్షలతో నిర్మించిన డైనింగ్ హాల్, డార్మెటరీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజగోపాల్, మాజీ మంత్రి, కెడిసిసి బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడారు. సిఎం చంద్రబాబు ఆశయాన్ని కొనసాగిస్తూ పి4 విధానంలో వత్సవాయి ఎంజెపి స్కూల్‌ను అభివృద్ధి చేసిన ఎన్‌ఆర్ఐ చిరుమామిళ్ల రాంబాబు దంపతులను అభినందించారు. చిరుమామిళ్ల రాంబాబు ఎంతో మంది దాతలకు స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. బిసి గురుకులాలను స్థాపించిన ఘనత దివంగత మాజీ సిఎం నందమూరి తారక రామారావుది అని తెలిపారు. సిఎం చంద్రబాబు వందలాది బిసి గురుకులాలను ఏర్పాటు చేశారని ప్రస్తావించారు. సమాజం నుంచి పేదరికాన్ని పారదోలాలని సిఎం చంద్రబాబు పి4 విధానం తీసుకువచ్చారని పేర్కొన్నారు. మన చుట్టు పక్కల ఉన్న పేదల కోసం ధనవంతులు ఎంతో కొంత సాయం చేయాలనే సదుద్దేశంతో పి4 విధానాన్ని సిఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని ప్రస్తావించారు. కార్పొరేట్ విద్యాసంస్థల కంటే ఎంజెపి సీట్లకే డిమాండ్ ఎక్కువగా ఉందని వెల్లడించారు. పదోతరగతి, ఇంటర్‌లో ఎంజెపి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని మంత్రి సవిత ప్రశంసించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఫొటోతో కూడిన విద్యామిత్ర కిట్లను అందజేస్తున్నామని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకొస్తున్న సంస్కరణల ఫలితంగా పదోతరగతి, ఇంటర్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఫలితాలు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం ఎపిలో 109 గురుకులాలు ఉండగా, ఈ యేడాది కొత్తగా మరో 10 గురుకులాలను ప్రారంభించామని చెప్పుకొచ్చారు. 6 ఎంజెపి బాలికల గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశామని వెల్లడించారు. రూ.500 కోట్ల సాస్కి నిధులతో ఎంజెపి గురుకులాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేశామని అన్నారు. కొత్తగా బిసి హాస్టళ్లకు బదులు గురుకులాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఎంజెపి స్కూళ్లు, బిసి హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఆర్వో ప్లాంట్లు, సిసిటివి కెమెరాలు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేశామని మంత్రి సవిత పేర్కొన్నారు.

# వలసల నివారణకే పలాస ఎయిర్‌పోర్ట్

**● 500 ఎకరాల్లో పరిశ్రమల స్థాపన ● కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

**● భూసేకరణపై రైతులకు గరిష్ఠ పరిహారం: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**పలాస (శ్రీకాకుళం జిల్లా), జులై 12 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లాను వెనుకబడిన ప్రాంతమనే ముద్ర నుంచి దూరం చేసి, ఉపాధి వలసలను శాశ్వతంగా నివారించడమే లక్ష్యంగా పలాస ప్రాంతంలో ప్రతిపాదిత విమానాశ్రయాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఆదివారం పలాసలో విమానాశ్రయ ఏర్పాటు, భూసేకరణ, పరిహారం చెల్లింపులపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఉడాన్ పథకం కింద ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిధులతో ఈ విమానాశ్రయం పూర్తి ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మితమవుతుందని, ప్రైవేటుకి కట్టబెడతారనే అపోహలను ఎవరూ నమ్మవద్దని కోరారు. జిల్లాలో విమానాశ్రయం కేవలం ప్రయాణికుల కోసమే కాదని, దీనితో పాటు సేకరించే భూముల్లో దాదాపు 500 ఎకరాలను ప్రత్యేకంగా పరిశ్రమల స్థాపన కోసం కేటాయిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. పరిశ్రమల స్థాపన ద్వారానే స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. విమానాశ్రయం, పరిశ్రమల వల్ల వచ్చే ఉద్యోగాలలో స్థానిక ప్రజలకే మొదటి ప్రాధాన్యత దక్కేలా ఒక పక్కా క్రమబద్ధమైన విధానాన్ని తీసుకువస్తామని హామీ ఇచ్చారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ కారణంగా అక్కడ భూముల ధరలు పెరగడం, హోటళ్లు, రవాణా రంగాల ద్వారా వేలాది మందికి ఉపాధి లభించిన విషయాన్ని ఆయన ఉదాహరణగా గుర్తుచేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో జిల్లాలోని మూలపేట పోర్ట్ పనులు అత్యంత వేగంగా సాగుతున్నాయని మంత్రి రామ్మోహన్ నాయుడు కొనియాడారు. మూలపేట ప్రాంత ప్రజలు ప్రాజెక్టు కోసం భూత్యాగం చేయడం వల్లే ఈరోజు ప్రపంచ స్థాయి కంపెనీలు అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని, అదే తరహాలో పలాస విమానాశ్రయానికి కూడా ప్రజలు సహకరించాలని కోరారు. రాబోయే 20, 30, 40 ఏళ్లలో మన పిల్లల భవిష్యత్తు బాగుండాలన్నా, ఉపాధి కోసం దుబాయ్, గల్ఫ్, సింగపూర్ వంటి దేశాలకు వలస వెళ్లే దుస్థితి తప్పాలన్నా ఈ ప్రాజెక్ట్ ఒక కేంద్ర బిందువుగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ, విమానాశ్రయ భూసేకరణ ప్రక్రియలో ఏ ఒక్క గ్రామాన్ని కూడా ఖాళీ చేయించడం లేదా తరలించడం జరగదని స్పష్టం చేశారు. భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు, భూములు కోల్పోతున్న బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయమైన, గరిష్ఠ పరిహారాన్ని పారదర్శకంగా అందిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజల పూర్తి అంగీకారం, సమన్వయంతోనే ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, ఆర్డీఓ కృష్ణమూర్తి, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీషలతో పాటు పలువురు స్థానిక నాయకులు, శాఖల ఉన్నతాధికారులు, పరిసర గ్రామాల ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భూసేకరణపై రైతులు అడిగిన పలు సందేహాలను అధికారులు ఈ సందర్భంగా నివృత్తి చేశారు.

# సర్ ప్రక్రియ పారదర్శకంగా ముగించండి

**● తిరుపతిలో తనిఖీల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి నవీన్ కుమార్**




**తిరుపతి, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఇంటింటి సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆర్. గోవిందరావు, ఇన్‌చార్జి కమిషనర్ శారదాదేవి, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి తదితర అధికారులతో కలిసి ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. సమీక్ష అనంతరం ఎన్నికల కమిషన్ బృందం సెక్షన్ ఆఫీసర్ అనిత కుక్రేజా, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఉదిత్ కుమార్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. తిరుపతిలోని రామకృష్ణ థియేటర్ సర్కిల్, లక్ష్మీపురం, వైకుంఠపురం ప్రాంతాలతో పాటు చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తిరుచానూరు, చిన్నగొట్టిగల మండలం భాకరాపేట, ఎర్రావారిపాలెం మండలం నెరబైలు ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు, బిఎల్ఓలను కలిసి వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య, సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్ పనితీరును పరిశీలించి సచివాలయ సిబ్బంది, బీఎల్ఏలతో మాట్లాడారు. తిరుచానూరు ప్రాంతంలో ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన పలువురు తిరిగి వెళ్లిపోవడంతో 2002 ఓటర్ల జాబితాతో పోల్చడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోందని బీఎల్ఏలు సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు. అనంతరం వైకుంఠపురంలోని 250వ పోలింగ్ కేంద్ర పరిధిలో ఇంటింటి సర్వేలో పాల్గొని స్థానిక ఓటర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, తిరుపతి అర్బన్ తహసీల్దార్ సురేష్‌బాబు, తిరుపతి రూరల్ తహసీల్దార్ జనార్దన్‌రాజు, సచివాలయ సిబ్బంది, బిఎల్ఓలు, బిఎల్ఎలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి

**తిరుపతి, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు "డయల్ యువర్ సిఎండి" కార్యక్రమాన్ని ఎస్పీడీసీఎల్ నిర్వహించనుంది. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661 నంబర్‌కు కాల్‌చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. కాగా జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను ఎస్ఇల దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు ఈ నంబర్లకు కాల్ చేయాల్సి ఉంటుంది. తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 99637 07847 కాల్‌చేసి విద్యుత్ సమస్యలను ఎస్ఇల దృష్టికి తీసుకురావచ్చు.

# విశాఖను కుదిపిన భూప్రకంపనలు

**● రిక్టర్ స్కేల్‌పై 4.5 తీవ్రత నమోదు.. అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచనలు**



**విశాఖపట్నం, జులై 12 ప్రభాతవార్త:** విశాఖనగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారుజామున సంభవించిన భూప్రకంపనలు ప్రజలను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేశాయి. ఉదయం 5:05:46 గంటలకు నమోదైన ప్రకంపనలు రిక్టర్ స్కేల్‌పై 4.5 తీవ్రతతో నమోదైనట్లు అధికారికంగా నిర్ధారణ అయింది. సాగర్‌నగర్, తాటిచెట్లపాలెం, సీతమ్మధార, మాధవధార, లాసన్స్ బే కాలనీ, పెదవాల్తేరు, ఈస్ట్ పాయింట్ కాలనీ, హెచ్‌బీ కాలనీతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు. భూప్రకంపనలతో పలువురు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగినట్లు ఇప్పటివరకు సమాచారం లేదు. ఈ సందర్భంగా మాజీ ఆంధ్ర విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్, లయన్స్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు ప్రజలు భూకంపం సమయంలో భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. 'డ్రాప్-కవర్-హోల్డ్' విధానాన్ని పాటించాలని, లిఫ్ట్‌లను ఉపయోగించకుండా మెట్ల ద్వారానే బయటకు రావాలని, కిటికీలు, భారీ వస్తువులకు దూరంగా ఉండాలని సూచించారు. భూకంపం అనంతరం గ్యాస్ లీకేజీ, విద్యుత్ సరఫరాను తనిఖీ చేయాలని, అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలని, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులకు ప్రాధాన్యంగా సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# రొయ్యల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ● సిఎం చంద్రబాబుకు బహిరంగ లేఖ**

**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో తీవ్ర ఆక్వా సంక్షోభం నెలకొని రొయ్యల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని, వారిని తక్షణమే ఆదుకునేందుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆక్వా రైతులను ఆదుకోవాలని కోరుతూ సీఎంకి ఈశ్వరయ్య ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 6 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుండగా, లక్షలాది కుటుంబాలు ఈ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే ఇటీవల కాలంలో పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, పడిపోతున్న రొయ్యల ధరలు, నాసిరకం సీడ్, కల్తీ మందులు, విద్యుత్ సమస్యలు, ఎగుమతుల్లో ఎదురవుతున్న ఇబ్బందులతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల సీపీఐ బృందం పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పర్యటించి రొయ్యల రైతులతో మాట్లాడిందని ఈశ్వరయ్య తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే రొయ్యల మేత ధర టన్నుకు రూ.10 వేల నుంచి రూ.12,500 వరకు పెరిగిందని, ముఖ్యమంత్రి సమక్షంలో మేత ధరలను కిలోకు రూ.4 తగ్గించాలని ప్రభుత్వం సూచించినప్పటికీ కంపెనీలు కేవలం రూ.2 మాత్రమే తగ్గించి, ప్రస్తుతం ఆ తగ్గింపును కూడా అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని కంపెనీలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. అదేవిధంగా వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి 100 కౌంట్



రొయ్యల ధరను కిలోకు రూ.260 నుంచి రూ.235కు తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మార్కెట్లో నాణ్యతలేని రొయ్య పిల్లలు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని, ఒక్క ఎకరానికి లక్ష నుంచి 1.15 లక్షల పిల్లలు వదిలినా అందులో సగం మాత్రమే జీవిస్తున్నాయని పేర్కొన్నారు. కల్తీ మందుల అమ్మకాలను అరికట్టడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఆక్వా, నాన్‌ఆక్వా జోన్లతో సంబంధం లేకుండా యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని ఈశ్వరయ్య గుర్తు చేశారు. పైగా పవర్ ఫ్యాక్టర్ పేరుతో తీసుకొచ్చిన జీవో నంబర్ 169 వల్ల సబ్సిడీ పొందే అర్హత ఉన్న రైతులు కూడా నష్టపోతున్నారని విమర్శించారు.

# దక్షిణ కొరియా పర్యటనలో ప్రధాన ఆకర్షణగా శ్రీసిటీ

**● శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి**



**సత్యవేడు(తిరుపతి జిల్లా), జులై 12 ప్రభాతవార్త:** పెట్టుబడుల ఆకర్షణలో భాగంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, హెచ్‌ఆర్‌డీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ఈ నెల 5 నుంచి 11 వరకు సాగిన దక్షిణ కొరియా పర్యటనకు విశేష స్పందన రాగా, వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పెట్టుబడి దారుల చర్చల్లో శ్రీసిటీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ పెట్టుబడుల అవకాశాలు మరింత బలోపేతం కాగా శ్రీసిటీ ప్రపంచ స్థాయి పారిశ్రామిక కేంద్రంగా విస్తృత గుర్తింపు పొందిందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. శ్రీసిటీని ప్రపంచ పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా ప్రముఖ కొరియా కంపెనీలు, పరిశ్రమల సమాఖ్యలు, ప్రభుత్వ సంస్థలకు సమర్థవంతంగా పరిచయం చేసిన మంత్రి లోకేష్‌కు రవీంద్ర సన్నారెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సియోల్, బుసాన్ నగరాల్లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశాల్లో శ్రీసిటీని ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక హబ్‌గా, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, డిస్‌ప్లే తయారీ, ఎలక్ట్రిక్ వాహన భాగాలు, అధునాతన తయారీ కృత్రిమ మేధస్సు ఆధారిత పరిశ్రమలు, సముద్ర సాంకేతిక రంగాలకు అత్యంత అనువైన కేంద్రంగా మంత్రి లోకేష్ వివరించినట్లు వెల్లడించారు. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, సోలమ్ గ్రూప్ హ్యుండాయ్ మొబిస్, సియోల్ సెమికండక్టర్, సునిక్ సిస్టమ్స్, సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్, మోటివ్ లింక్,హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ తదితర ప్రముఖ కొరియా సంస్థలతో జరిగిన చర్చల్లోను శ్రీసిటీ కీలక అంశంగా నిలిచిందన్నారు. ఈ పెట్టుబడుల ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు(ఈడీబీ), కొరియా ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ (కేవోటీఆర్ఏ), భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ), సియోల్‌లోని భారత రాయబార కార్యాలయం తదితర భాగస్వామ్య సంస్థలకు రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటన రాష్ట్రానికి నాణ్యమైన పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలను మరింత పెంచుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# లక్ష్యం దిశగా నడవాలన్నా..



ఆడపిల్లలుగా పోటీ ప్రపంచంలో నెగ్గుకురావాలంటే ఎన్నో అవాంతరాలు ఎదురుకావొచ్చు. అలాగని ప్రతి చిన్నదానికీ నిరాశపడితే మీరు మరింత బలహీనంగా మారొచ్చు. లక్ష్యం దిశగా నడవాలన్నా, శక్తిని పుంజుకోవాలన్నా.. మీ అలవాట్లను, ఆలోచనా శైలినీ ఇలా మార్చుకుని చూడండి.

చాలామంది తమలో లేనివి ఏంటో గమనించుకోవడం వదిలేసి.. ఇతరులతో పోటీపడుతుంటారు. ఇలాంటి పోలిక, పోటీ మీకు మేలు చేయకపోగా అది దక్కనప్పుడు ప్రతికూల ఆలోచనలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఫలితంగా మిమ్మల్ని మరింత నిరాశలోకి నెట్టేసే ప్రమాదం ఉంది. ఎదుటివారి విజయాన్నీ మనస్ఫూర్తిగా స్వీకరించండి. మీలోని లోపాల్ని బేరీజు వేసుకోండి. మీ బలహీనతల్ని సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది. పురుషాధిక్యత, ఇతర సామాజిక పరిస్థితులు మీకెన్నో ఆంక్షల్ని అడ్డుపెట్టొచ్చు. అంత మాత్రాన మీ ప్రయాణాన్ని ఆపేయాల్సిన అవసరం లేదు. దానికోసం మనలోని శక్తిని వందశాతం వినియోగించు కోవడానికి ప్రయత్నించాలి. అప్పుడే మీ శక్తి సామర్థ్యాల మీద వాస్తవిక అంచాన రావడంతోపాటు, లోటుపాట్లను సరిదిద్దుకునే అవకాశమూ దక్కుతుంది. విశాల ప్రపంచంలో అవకాశాలు అపారం. వాటిని అందుకోవా లంటే.. ముందు మనపై మనకు నమ్మకం ఉండాలి. ఏదైనా లక్ష్యం చేరుకోవాలను కున్నప్పుడు మాట్లాడాల్సిన ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండటం ముఖ్యం. దానికోసం ఎప్పటి కప్పుడు మిమ్మల్ని మీరు అప్‌డేట్ చేసుకోవ డానికి ప్రయత్నించండి మీరు చేరుకునే వ ర్గంలో మీకు ఇదెంతో తోడ్పడుతుంది.

# వీటికి దూరంగా ఉండడమే మేలు!

మధుమేహం ఉన్నవారితోపాటు, అధిక బరువు తగ్గాలనుకునే కొంతమంది చక్కెరకు బదులుగా కృత్రిమ తీపి పదార్థాలను తీసుకుంటుంటారు. అయితే వీటితో కొన్నిటిలో ఆస్పర్టేమ్‌ని ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ఇది ఆరోగ్యానికి అంత మంచిది కాదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కృత్రిమ తీపి పదార్థాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరి స్తున్నారు. కొన్ని ఆహార పదార్థాల్లాగే కృత్రిమ తీపి పదార్థాలు కూడా అందరికీ



పడకపోవచ్చు. కొంతమందిలో వీటిని తీసుకోవడం ద్వారా కడుపుబ్బరం, జీర్ణ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి వీలైనంతవరకు వీటికి దూరంగా ఉండడమే మంచిదంటున్నారు.

**క్యాలరీల విషయంలో...** కృత్రిమ తీపి పదార్థాల్లో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. కొన్ని పదార్థాల్లో అయితే అసలు క్యాలరీలే ఉండవు. అందుకే కొంతమంది తమ ఫిట్‌నెస్ కాపాడుకోవడా నికి, బరువు తగ్గడా నికి ప్రయత్నించే వారు కూడా కృత్రిమ తీపి పదార్థాలను తమ ఆహారంలో భాగం చేసుకుంటారు. అయితే ఆరోగ్యకరమైన బరువు ఉండాలంటే శరీరానికి అవసరమైన నిర్ణీత క్యాలరీల విషయంలో రాజీ పడకూడదంటున్నారు నిపుణులు.

**సహజసిద్ధమైనవే...** కృత్రిమ తీపి పదార్థాలు సహజ సిద్ధంగా లభించే పదార్థాలను ఎప్పటికీ భర్తీ చేయలేవు. కాబట్టి తక్కువ క్యాలరీలు ఉన్న తీపి పదార్థాల కోసం సహజంగా లభించే పదార్థాలను ఉపయోగించడమే మంచిదంటున్నారు నిపుణులు. వీటిని తీసుకోవడం వల్ల కేవలం రుచి మాత్రమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందే అవకాశం ఉంటుంది.

**నిపుణులను సంప్రదించాలి..** అలాగే మధుమేహ రోగులకృత్రిమ తీపి పదార్థాలను వాడే విషయంలో సంబంధిత వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.

**నీటి మోతాదు తగ్గకుండా..** మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ తగినన్ని నీళ్లు తీసుకోవడం తప్పనిసరి. అయితే కొంతమంది కృత్రిమ తీపి పదార్థాలు ఉన్న పానీయాలు తీసుకున్నప్పుడు నీళ్లు తాగరు. కానీ, ఇలాంటప్పుడు కూడా నీళ్లు తాగాలంటూన్నరు నిపుణులు. నీళ్లు శరీరంలోని మలినాలను తొలగించి డీ హైడ్రేషన్‌కు గురి కాకుండా కాపాడతాయి.

# పెద్దమ్మాయికి బాధ్యత ఎక్కువ !



చిన్నదానికి దెబ్బ తగిలింది, కూడా ఉన్నావుగా.. చూసుకోలేదా.. అంటూ ఇంట్లో పెద్ద పిల్లలను అజమాయిషీ చేస్తారంతా. తీరా చెల్లెలికన్నా పెద్దమ్మాయిది రెండేళ్లు ఎక్కువ ఉంటుంది. అయినా చిన్నవాళ్ల బాధ్యత పెద్దవాళ్లదే అంటారంతా. దీంతో పాటు పుట్టిన క్రమం పిల్లల వ్యక్తిత్వాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుందంటున్నాయి పలు పరిశోధనలు.

సంతానంలో పిల్లలు పుట్టే క్రమం వారి స్వభావం, ప్రవర్తనను ప్రభావితం చేస్తాయంటున్నాయి అధ్యయనాలు. అందరికన్నా పెద్దవాళ్లు కుటుంబంలో బాధ్యతగా, నాయకత్వ స్థానంలో ఉంటాయి. తల్లి దండ్రుల ఏకాగ్రత, అడిగిందల్లా పొందడం వంటివన్నీ ముందుగా వీరికే దక్కుతాయి. దీంతో అందరి ప్రేమ దక్కి తాము కూడా స్నేహభావం తో ఉంటారు. తన తర్వాత పుట్టిన పిల్లల బాధ్యత రావడంతో బాధ్యతాయుతంగా మారతారు. తమ్ముడు అల్లరి చేస్తే తప్పు అని చెప్పాలి కదా అనే తల్లిదండ్రుల మాటలతో తనకన్నా చిన్న వారికి తాను రోల్‌మోడల్‌గా ఉండాలనే వ్యక్తిత్వం వస్తుంది.

**మధ్యవాళ్లు..** తనకన్నా పెద్దవాళ్లు, చిన్నవాళ్లకు మధ్య సతమతుల్యంగా ఉంటారు. తమకంటూఐ గుర్తింపు పొందడానికి కృషి చేస్తూ, నైపుణ్యాలను పెంచుకుంటారు. తమకన్నా పెద్దవారికి, చిన్నవారికి సహకారాన్ని అందిస్తూ, వాళ్ల మధ్య వచ్చే విభేదాలకు మధ్యవర్తిత్వం వహిస్తారు. ఇక, చివరి పిల్లలు పుట్టే సమయానికి తల్లిదండ్రులకు పెంపకంలో అనుభవం వస్తుంది. ఒత్తిడికి గురికాకుండా పెంచడంవల్ల ఈ పిల్లల్లో ఆందోళన ఉండదట. అందరి ప్రేమ పొంది గారంగా పెరుగుతారు. నిర్లక్ష్యం వైఖరి వస్తుంది. నియమాలు, నిబంధనలు సడలి సాహసోపేతంగా ఉంటారు.

**ఒకే ఒక్కరైతే...** తల్లిదండ్రుల నుంచి ఎక్కువ ప్రేమ దొరుకుతుంది. పోటీ లేకుండా పెరుగుతారు. మనసుకు నచ్చింది చేస్తారు. అమ్మానాన్నతో ఎక్కువ గడుపుతారు. అయితే అనుకున్నది అందకపోతే తీవ్రమైన ఒత్తిడికి గురవుతారు. ఉన్నతవిద్యను అభ్యసించడంలో, సామాజిక నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో ముందుంటారట. పిల్లల వరుసక్రమం ప్రకారం కాకుండా, ప్రతి సంతానం వ్యక్తిగత జలాలను పెంపొందించేలా తల్లిదండ్రులు మద్దతు అందించగలిగితే వాళ్ల వ్యక్తిత్వాన్ని సరైన రీతిలో మలచొచ్చు అంటున్నారు నిపుణులు.

# వెలుగు దీపం

బౌద్ధ సాహిత్యంలో ప్రాచీన గ్రంథాలలో ధమ్మపదం ఒకటి. ఇది భగవాన్ గౌతమ బుద్ధుడు బోధించిన అమూల్యమైన ధర్మ సూత్రాల సంకలనం. ధమ్మపదం అంటే "ధర్మానికి చూపే పదాలు" లేదా "ధర్మ వచనాలు" అని అర్థం. ఇందులోని ప్రతి గాథ మానవ జీవితాన్ని సత్యం, శాంతి, కరుణ, జ్ఞానం వైపు నడిపించే దివ్య సందేశాన్ని అందిస్తుంది. "మనస్సే అన్ని కార్యాలకు మూలం" అని బుద్ధుడు మనస్సు గొప్పతనాన్ని వివరిస్తాడు .మన ఆలోచనలు పవిత్రంగా ఉంటే మన మాటలు, మన చేతలు కూడా పవిత్రంగా ఉంటాయి. మంచి ఆలోచన లు మంచి జీవితానికి పునాది అని ధమ్మపదం బోధిస్తుంది.ధమ్మపదం ప్రధాన సందేశం అహింస, కరుణ, మైత్రి. ద్వేషాన్ని ద్వేషంతో కాదు, ప్రేమతోనే జయించవచ్చని బుద్ధుడు బోధించాడు. ఈ బోధన నేటి సమాజంలో కూడా ఎంతో ప్రాసంగికమైనది. క్షమాగుణం, దయ, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలను అలవర్చుకోవడం ద్వారా వ్యక్తి మాత్రమే కాదు, సమాజం కూడా శాంతి మయంగా మారుతుంది. ధమ్మపదం మనకు సత్యం, ధర్మం, నియమశీలత ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ఇంద్రియా లను అదుపులో ఉంచుకొని, చెడు ఆలోచన లను విడిచిపెట్టి, సత్కార్యాలను ఆచరించే వ్యక్తి నిజమైన విజేత అని బుద్ధుడు పేర్కొన్నాడు. వేల మందిని యుద్ధంలో జయించడం కంటే తన మనస్సు ను జయించిన వాడే గొప్పవాడని ధమ్మపదం ప్రకటిస్తుంది. ఈ ప్రపంచంలోని సంపదలు, కీర్తి, భోగాలు శాశ్వతం కావు. కానీ ధర్మం, సద్గుణాలు, సేవాభావం మాత్రం మన జీవి తాన్ని చిరస్థాయిగా గొప్పదిగా నిలబెడతాయి. ధమ్మపదం మనకు మానసిక ప్రశాంతతను, ఆధ్యాత్మిక బలాన్ని, నైతిక జీవనానికి అవసర మైన మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. మతంతో సంబంధం లేకుండా ప్రతి మనిషి ఈ గ్రంథం లోని బోధనలను ఆచరిస్తే వ్యక్తిగతంగా సంతో షాన్ని, సామాజి కగా శాంతిని పొందగలడు. సత్యం, కరుణ, అహింస, సహనం, ఆత్మ నిగ్రహం, జ్ఞానం వంటి మహోన్నత విలువ లను మన జీవితంలో ఆచరించమని పిలుపు నిచ్చే దివ్య గ్రంథం. ధమ్మపదంలోని బోధన లను మన దైనందిన జీవితంలో అనుసరించి నప్పుడు మన వ్యక్తిత్వం వికసిస్తుంది, కుటుంబంలో ఆనందం పెరుగుతుంది, సమాజంలో శాంతి నెలకొంటుంది. ఈ పవిత్ర ధర్మవచనాలు ప్రతి హృదయానికి వెలుగునిచ్చి, మానవాళిని శాశ్వత శాంతి మరియు మోక్షమార్గం వైపు నడిపించుగాక.

# పుస్తక పఠనమే..



కొంతమంది పిల్లలు గట్టిగా బయటకు చదివితే నెమ్మదిగా చదవలేవా అంటూ తిడుతుంటాం. కానీ ఇలా పుస్తక పఠనం చేయడం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నాయంటు న్నారు. నిపుణులు. అవేంటంటే..

పిల్లలు పుస్తకంలో పదాలను గుర్తిస్తూ బయటకు చదివేటప్పుడు వాటిని గుర్తుంచు కోవడానికి ప్రయత్నిస్తారు. అంతేకాదు విషయాన్ని సులభంగా గ్రహించగలుగుతారు. ఇది వారిలో జ్ఞాపకశక్తి పెంచుతుంది. విని నేర్చుకునే వారిని ఆడియో లెర్నర్స్ అంటారు. ఇలాంటివారు దేన్నైనా శ్రద్ధంగా వినడానికి ప్రయత్నిస్తారు. వారిలో భాషానైపుణ్యం మెరుగుపడి చిన్నతనం నుంచే ఉచ్చారణ అలవాటు అవుతుంది. పదాలు సులభంగా నేర్చుకుంటారు. చాలామంది పిల్లలకు చదవమంటే చిరాకు వస్తుంది. అదే గట్టిగా చదువు అంటే మాత్రం ఎంతో హుషారుగా ఉంటారు. దీని వల్ల వారిలో ఉన్న ఒత్తిడి, ఆందోళనలు దూరం అవుతాయని అంటున్నారు.

# కిచెన్ కింగ్ మసాల ..



**ఫలానా మసాలా పొడి వల్ల కూం సూపర్‌గా ఉంది లాంటి ప్రకటనలు చూస్తుంటాం కదూ! అలాంటి వాటిల్లో 'కిచెన్ కింగ్ మసాలా' ఒకటి** . ఇది బయట కొనేకంటే ఇంట్లోనే చేసుకుంటే మంరిత తాజాగా ఉంటుంది. ప్రిజర్వేటివ్స్ ఉండవు కనుక ఆరోగ్యానికీ మంచిది. తేలిగ్గా ఎలా చేయా లంటే.. మినపప్పు, పచ్చి శనగ పప్పు, షాహీ జీరా, ఆవాలు ఒక్కో చెంచా చొప్పున, మెంతులు పావు చెంచా,3 సోంపు 2 టేబుల్ స్పూన్లు ధనియాలు 3 టేబుల్ స్పూన్లు, ఒకటిన్నర చెంచా జీలకర్రలను సన్న సెగ మీద వేయించాలి. అవి గోధుమ రంగులోకి మారేసరికి మంచి వాసన వస్తుంది. అందులో అంగుళం చొప్పున దాల్చినచెక్క,శొంఠి, మూడు బిర్యానీ ఆకులు, 12 లవంగాలు, 8 యాలకులు, 2 నల్ల యాలకులు (బ్లాక్ కార్డమమ్), ఒక జాపత్రి, ఒక స్టార్ మొగ్గ, అర జాజికాయ, 7 ఎండు మిరపకాయలు, అర టేబుల్‌స్పూన్ గసగసాలు, 2 టేబుల్ స్పూన్ల చొప్పున మిరియాలు, మెంతి ఆకులు పొడి వేసి ఇంకాస్త వేయించాలి. మంచి సువాసన వస్తున్నప్పుడు దించేయాలి. అవి చల్లారాక..చెంచా చొప్పున పసుపు, ఉప్పు, ఆమ్‌చూర్ పొడి జతచేసి గ్రైండ్ చేయాలి. అంతే.. 'కిచెన్ కింగ్ మసాలా' సిద్ధం. దీన్ని తడిలేని గాలి చొరబడని డబ్బాలో భద్రం చేసుకుంటే టామాటో, బంగాళదుంప లాంటి కూరల దగ్గర నుంచి బిర్యానీ వరకూ ఎందులో వేసినా వారెవా అనిపిస్తుంది.

తెర

# 'కొరియన్ కనకరాజు'

## ఆగస్టు 7న వరల్డ్ వైడ్ రిలీజ్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యూనిక్ హారర్‌కామెడీ 'కొరియన్ కనకరాజు'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. ఇంతకుముందు విడుదలైన టైటిల్ గ్లింప్స్, హారర్, కామెడీ, కొరియన్ కల్చర్ ఎలిమెంట్స్ కూడిన ఈ చిత్రంలోని వినోదాత్మకంగా చూపిస్తూ భారీ బజ్‌ను సృష్టించింది. ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'కంసంనిదా' కూడా చార్ట్‌బస్టర్‌గా నిలిచింది.

చిత్ర నిర్మాతలు ఆగస్టు 7వ తేదీన ప్రపంచవ్యాప్త థియేట్రికల్ విడుదల తేదీగా అధికారికంగా ఖరారు చేశారు. రిలీజ్ డేట్ పోస్టర్ ఆటిట్యూడ్, ఇంటెన్స్‌ని ప్రజెంట్ చేస్తోంది. వరుణ్ తేజ్ ఒక చేతిలో రక్తం మరకలున్న కత్తి, మరో చేతిలో గ్రెనేడ్‌తో కుర్చీలో హుందాగా కూర్చుని, రఫ్ అండ్ అల్ట్రాస్టైలిష్ అవతార్‌లో కనిపిస్తున్నారు. భయపెట్టే కొరియన్ గ్యాంగ్‌స్టర్ల గ్యాంగ్ చుట్టుముట్టి ఉన్నప్పటికీ, అతను ఏమాత్రం బెదరనట్లు కనిపించారు. కళ్లు చెదిరే నియాన్ లైటింగ్ బ్యాక్ డ్రాప్, గ్యాంగ్‌స్టర్ నేపథ్యం మరింత ఆసక్తిని పెంచింది. రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, కమెడియన్ సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ఎస్. థమన్ సంగీతం అందించగా, మనోజ్ రెడ్డి కటసాని డీవోపీగా పని చేస్తున్నారు. విలక్షణమైన కథాంశం ఆకట్టుకునే వినోదంతో 'కొరియన్ కనకరాజు' అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఒకటిగా నిలిచింది. చిత్ర నిర్మాతలు విడుదల తేదీని ఖరారు చేయడంతో వరుసగా అప్డేట్స్ ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# 'హ్యాపీ జర్నీ' నుంచి ఫస్ట్ సింగిల్



రొటీన్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, మహిళల భావోద్వేగాలను ప్రధానంగా తీసుకుని రూపొందుతున్న చిత్రం 'హ్యాపీ జర్నీ'. ఏడు మంది మహిళల జీవితాల చుట్టూ తిరిగే ఈ కథలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జీనీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పృథ్వీ దండమూడి, వంశీ, రవి శివ తేజ పైల కీలక సహాయ పాత్రలను పోషించారు. గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై బాలాజీ గుత్తా, కౌశిక్ రెడ్డి నిర్మిస్తున్న 'హ్యాపీ జర్నీ' చిత్రంతో అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయం అవుతుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫస్ట్ లుక్, టీజర్‌తో భారీ అంచనాలను రేకెత్తించిన చిత్ర బృందం, ఇప్పుడు 'ఆనందమే' ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసి, మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. శేఖర్ చంద్ర అందించిన స్వరాలు ఉత్సాహాన్ని నింపేలా ఉన్నాయి. సురేష్ బానిసెట్టి రాసిన సాహిత్యం బంధాల నుంచి బయటపడి స్వేచ్ఛగా ఎగిరే పక్షులతో మనసులోని ఆనందాన్ని పోలుస్తూ ఎంతో అందంగా సాగింది. పారిస్, మాంట్‌పెలియర్, ఇతర అందమైన యూరప్ ప్రాంతాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా, అద్భుతమైన విజువల్స్‌తో పాటు హృదయానికి దగ్గరైన భావోద్వేగాలను కూడా అందించబోతోంది. కథ విదేశీ నేపథ్యంలో సాగినా, అందులోని మనుషుల అనుబంధాలు, భావాలు ప్రతి ఒక్కరికీ దగ్గరగా అనిపించేలా ఉంటాయి. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందిస్తుండగా, మణికందన్ సుబ్రమణియన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా, బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. త్వరలోనే సినిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించనున్నారు.

# 'క్వీన్'లో కీలక పాత్రలో నటిస్తున్న రమ్యకృష్ణ



ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ యామినీ ఇఆర్‌ను హీరోయిన్‌గా పరిచయం చేస్తూ టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ రతన్ రిషి హీరోయిన్ సెంట్రిక్ కథతో 'క్వీన్' మూవీని రూపొందిస్తున్నారు. ఈ సినిమాను వన్ సర్కిల్ ఫిలింస్ బ్యానర్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో కాళకేయ ప్రభాకర్, అజయ్ ఘోష్ విలన్స్‌గా నటిస్తున్నారు. డైలాగ్ కింగ్ సాయికుమార్ హీరోయిన్ తండ్రి పాత్రను పోషిస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా నుంచి ఒక ఇంపార్టెంట్ అనౌన్స్ మెంట్ చేశారు మేకర్స్. 'క్వీన్' చిత్రంలో ఒక పవర్ ఫుల్, స్ట్రాంగ్ క్యారెక్టర్‌లో ప్రముఖ నటి రమ్యకృష్ణ నటిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి లక్ష్మి ప్రణతి పాత్రలో రమ్యకృష్ణ తన నటనా ప్రతిభతో ప్రేక్షకుల్ని ఆకట్టుకోబోతున్నారు. రమ్యకృష్ణ తమ సినిమా టీమ్‌లో జాయిన్ అవుతున్న సందర్భంగా చిత్రబృందం ఆమెకు ఆహ్వానం పలికారు. 'క్వీన్' చిత్రాన్ని వాస్తవ ఘటనల ఆధారంగా, రియల్ క్యారెక్టర్స్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఫిక్షనల్ స్టోరీతో దర్శకుడు రతన్ రిషి రూపొందిస్తున్నారు. 2006-2010 మధ్య కాలం నేపథ్యంగా ఈ చిత్ర కథ సాగనుంది. ప్రస్తుత సొసైటీతో ముడిపడి ఉన్న ఒక ఇంట్రెస్టింగ్ లవ్ స్టోరీని ఈ చిత్రంలో ప్రేక్షకులు చూడబోతున్నారు. "క్వీన్" సినిమా ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది.

# 'చోర శిఖామణులు'

## పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభం



శ్రీకరివివాన్ సమర్పణలో శ్రీకరి క్రియేషన్స్ బ్యానర్ మీద బానూరు నాగరాజు నిర్మిస్తున్న చిత్రం 'చోర శిఖామణులు'. ఆనంద్ కుర్మా ఈ మూవీకి కథ, కథనం, మాటలు అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. యాక్షన్, క్రైమ్, కామెడీ జానర్‌లో రానున్న ఈ మూవీలో రామ్ తేజ్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్, నరేష్, అజయ్ ఘోష్, సంపూర్ణేష్ బాబు, మురళీధర్ గౌడ్, అప్పు, కరణ్, జబర్దస్త్ సత్యశ్రీ తదితరులు ముఖ్య పాత్రలను పోషించనున్నారు.

'చోర శికామణులు' చిత్ర ప్రారంభోత్సవం, పూజా కార్యక్రమాలకు త్రినాథరావు నక్కిన, దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్, త్రినాథరావు నక్కిన స్క్రిప్ట్ అందించగా.. తొలి సన్నివేశానికి త్రినాథరావు నక్కిన గౌరవ దర్శకత్వం వహించారు. ఈ మూవీకి ఆనంద్ రాజావిక్రమ్ సంగీత దర్శకుడిగా, జగదీష్ కొమరి కెమెరామెన్‌గా, యాక్షన్ కొరియోగ్రఫీ బాధ్యతలను డ్రాగన్ ప్రకాష్ నిర్వహించనున్నారు. జూలై 25 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మంచి సాంగ్‌తో ఈ మూవీ షూటింగ్ ప్రారంభం కానుందని టీం తెలిపింది. ముందుందు మరిన్ని అప్డేట్‌లతో మేకర్స్ అంచనాలు పెంచేందుకు ప్లాన్ చేస్తున్నారు.

# 'చెన్నై లవ్ స్టోరీ' 24న రిలీజ్



హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా 'కలర్ ఫోటో', 'బేబి' వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్‌కెఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాకు బ్లాక్ బస్టర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ నెల 24న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు 'చెన్నై లవ్ స్టోరీ' మూవీ రెడీ అవుతోంది. ఈ రోజు మెలోడీ బ్రహ్మ మణిశర్మ పుట్టినరోజు వేడుకల్ని 'చెన్నై లవ్ స్టోరీ' టీమ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ, నిర్మాతలు ఎస్‌కెఎన్, సాయి రాజేష్, సహ నిర్మాత ధీరజ్ మొగిలినేని, డైరెక్టర్ రవి నంబూరి పాల్గొన్నారు. కేక్ కట్ చేసి మణిశర్మకు బర్త్‌డే విషెస్ తెలిపారు. ఈ సినిమాకు మణిశర్మ కంపోజ్ చేసిన 'తొలి ప్రేమేం తోపు కాదే..', 'వదలనే..','జిగితార..', 'హుయిలా హుయిలా' పాటలన్నీ ఛాట్ బస్టర్స్‌గా మ్యూజిక్ లవర్స్‌ను అలరిస్తున్నాయి.

# ఎక్స్‌ట్రా టైమ్‌లో అర్జెంటీనా క్లాస్

## స్విట్జర్లాండ్‌పై 3-1 తేడాతో విజయం * రెండో కప్ వేటలో సెమీస్



**కాన్సాస్ సిటీ, జులై 12 :** డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా వరుసగా రెండో కప్ వేటలో దూసుకుపోతోంది. అద్భుత ఆటతీరుతో సెమీఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. కాన్సాస్ సిటీ వేదికగా జరిగిన చివరి, నాలుగో క్వార్టర్‌ఫైనల్లో స్విట్జర్లాండ్‌పై 3-1 గోల్స్‌తో అద్భుత విజయం అందుకుంది. ఆరంభంలో వెనకబడ్డా, లియోనెల్ మెస్సి నేతృత్వంలోని అర్జెంటీనా అదనపు సమయంలో ఆధిపత్యాన్ని చాటుకుంది. సెమీఫైనల్ పోరులో ఇంగ్లాండ్‌తో అర్జెంటీనా తలపడనుంది.

నాలుగో క్వార్టర్ ఫైనల్ ఆరంభంలోనే అర్జెంటీనా ఆధిక్యం చాటింది. ప్రారంభం నుంచి అర్జెంటీనా దూకుడు కొనసాగించింది. పదే పదే స్విట్జర్లాండ్ గోల్ పోస్ట్‌పై దాడులకు దిగింది. ఇది పదో నిమిషంలో ఫలించింది. మాక్ అలిస్టర్ గోల్ కొట్టి అర్జెంటీనాకు ఆధిక్యాన్ని అందించాడు. తొలి అర్ధభాగం వరకు అర్జెంటీనా ఆధిపత్యంలో ఉన్నా మరో గోల్ సాధ్యం కాలేదు. మరోవైపు స్విట్జర్లాండ్‌కు లభించిన కొన్ని అవకాశాలను అర్జెంటీనా గోల్‌కీపర్ ఎమిలియానో మార్టినెజ్ సమర్థంగా అడ్డుకున్నాడు. రెండో అర్ధభాగంలో స్విట్జర్లాండ్ రక్షణాత్మక ఆటతీరుకు బదులు అటాకింగ్ గేమ్‌కు దిగింది. 67వ నిమిషంలో స్విస్ ప్లేయర్ డాన్ ఎండోయె, రికార్డో రోడ్రిగ్జ్‌తో చక్కటి సమన్వయం ప్రదర్శనతో గోల్ కొట్టి స్కోరు 1-1తో సమమైంది. ఈ గోల్‌తో మ్యాచ్ మరింత ఉత్కంఠకు చేరింది. 72వ నిమిషంలో స్విట్జర్లాండ్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బ్రీల్ ఎంబోలో సిమ్యులేషన్ కారణంగా రెండో పసుపు కార్డు అందుకుని మైదానం నుంచి బయటకు వెళ్లాడు. దీంతో స్విట్జర్లాండ్ 10 మంది ఆటగాళ్లతోనే మ్యాచ్ కొనసాగించాల్సి వచ్చింది. దీన్ని అడ్వెంటేజ్‌గా తీసుకుని అర్జెంటీనా వరుస అవకాశాలు సృష్టించుకున్నా ఫలితం లేకపోయింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 1-1 గోల్స్‌తో సమంగా నిలిచింది.

అదనపు సమయంలో మాత్రం అర్జెంటీనా ఆధిపత్యం ప్రదర్శించింది. మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. ఏకంగా రెండు గోల్స్ సాధించింది. 112వ నిమిషంలో జూలియన్ అల్వారెజ్ దాదాపు 25 గజాల దూరం నుంచి అద్భుతమైన షాట్‌తో బంతిని నేరుగా గోల్‌పోస్ట్‌లోకి పంపించి అర్జెంటీనాకు 2-1 ఆధిక్యం అందించాడు. ఆ తర్వాత సమం చేయాలని స్విట్జర్లాండ్ ప్రయత్నించగా, చివరి నిమిషాల్లో లౌటారో మార్టినెజ్ రీబౌండ్‌ను గోల్‌గా మలిచి అర్జెంటానా ఆధిక్యాన్ని 3-1కు చేర్చాడు. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగిన అర్జెంటీనా రెండో ప్రపంచ కప్ వేటలో మరో అడుగు వేసింది. ఈనెల 16న అట్లాంటాలో జరిగే రెండో సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌తో తలపడనుంది.

### రిఫరీ నిర్ణయంపై స్విట్జర్లాండ్ ఫైర్

రిఫరీ నిర్ణయాలపై స్విట్జర్లాండ్ జట్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ముఖ్యంగా వీడియో అసిస్టెంట్ రిఫరీ జోక్యంతో ఫార్వర్డ్ బ్రీల్ ఎంబోలోకు రెండో ఎల్లో కార్డు చూపించడం మ్యాచ్ ఫలితాన్నే మార్చేసిందని స్విట్జర్లాండ్ ప్రధాన కోచ్ యురాత్ యూకిన్ విమర్శించారు. అదే తమ ఆటను పూర్తిగా దెబ్బతీసిందని వాపోయారు.

# బెల్లింగ్‌హామ్ డబుల్ సెమీస్‌లో ఇంగ్లాండ్

ఆట





**మియామి, జులై 12:** నార్వే ఆశలకు చెక్ పెడుతూ ఇంగ్లాండ్..సాకర్ ప్రపంచకప్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మియామిలో జరిగిన మూడో క్వార్టర్ ఫైనల్లో ఇంగ్లాండ్ 2-1 గోల్స్ తేడాతో నార్వేపై విజయం సాధించింది. ఇంగ్లాండ్ స్టార్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హామ్ అద్భుతమైన డబుల్ గోల్స్‌తో చెలరేగాడు. ఎక్స్‌ట్రా టైమ్‌లో చేసిన గోల్‌తో ఇంగ్లాండ్ సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది.

మ్యాచ్ ప్రారంభం నుంచే నార్వే జట్టు ఇంగ్లాండ్‌పై తీవ్ర ఒత్తిడి పెంచింది. నార్వే స్టార్ స్ట్రైకర్ ఎర్లింగ్ హాలాండ్ మ్యాచ్ ఆరంభంలోనే ఇంగ్లాండ్ గోల్‌కీపర్ జోర్డాన్ పిక్‌ఫోర్డ్‌ను తన పవర్‌ఫుల్ హెడ్డర్‌తో గోల్ చేసినంత పనిచేశాడు. ఆ తర్వాత కూడా ఇంగ్లాండ్ డిఫెన్స్‌ను ఇబ్బంది పెడుతూ నార్వేఆటగాళ్లు వరుసగా ఇంగ్లాండ్ గోల్ పోస్ట్‌పై దాడులు చేశారు. ఈక్రమంలో 36వ నిమిషంలో ఆండ్రియాస్ షెల్డెరుప్‌కు లభించిన పాస్‌ను గోల్ పోస్ట్‌లోకి పంపి నార్వేకు 1-0 ఆధిక్యం అందించాడు. ఈఆనందం నార్వేకు ఎక్కువ సేపు నిలవలేదు. ఫస్టాఫ్ ముగియడానికి కొన్ని నిమిషాల ముందు ఇంగ్లాండ్ పుంజుకుంది. రియల్ మాడ్రిడ్ స్టార్ జూడ్ బెల్లింగ్‌హామ్ మైదానం మధ్య నుంచి బంతిని మెరుపు వేగంతో ముందుకు తీసుకెళ్లి గోల్ సాధించాడు. దీంతో స్కోరు 1-1తో సమమైంది.

### రివ్యూలో నార్వేకు షాక్

రెండో అర్ధ భాగంలో ఇరు జట్లు గోల్ కోసం తీవ్రంగా శ్రమించాయి. 60వ నిమిషంలో నార్వే ఆటగాడు తోర్బ్‌జోర్న్ హెగ్గెమ్ బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. ఈ గోల్‌పై ఇంగ్లాండ్ ఆటగాళ్లు రెఫరీ రివ్యూ కోరారు. ఈ రివ్యూలో, గోల్ చేసే క్రమంలో నార్వే స్టార్ హాలాండ్, ఇంగ్లాండ్ ఆటగాడు ఇలియట్ ఆండర్సన్‌పై ఫౌల్ చేసినట్లు స్పష్టమైంది. దీంతో ఆగోల్‌ను రెఫరీ రద్దు చేశారు. ఈ క్రమంలో నిర్ణీత 90 నిమిషాల సమయం ముగిసేసరికి ఇరు జట్లు 1-1తో సమంగా నిలవడంతో మ్యాచ్ ఫలితం కోసం ఎక్స్‌ట్రా టైమ్ కేటాయించారు.

### బెల్లింగ్‌హామ్ డబుల్

ఎక్స్‌ట్రా టైమ్‌లో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ఇంగ్లాండ్ ప్లేయర్ మోర్గాన్ రోజర్స్ బాక్స్ వెలుపల నుంచి ఒక పవర్‌ఫుల్ షాట్ కొట్టాడు. నార్వే కీపర్ నైలాండ్ ఆ బంతిని సరిగ్గా నియంత్రించలేకపోయాడు. అక్కడే సిద్ధంగా ఉన్న బెల్లింగ్‌హామ్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ బంతిని అతి సమీపం నుంచి గోల్ పోస్ట్‌లోకి పంపి ఇంగ్లాండ్‌కు 2-1తో తిరుగులేని విజయాన్ని అందించాడు. దీంతో ఇంగ్లాండ్ సెమీస్‌లోకి దూసుకెళ్లింది. మ్యాచ్‌లో రెండు కీలక గోల్స్ చేసి జట్టును సెమీస్‌కు చేర్చిన జూడ్ బెల్లింగ్‌హామ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ ప్రపంచ కప్‌లో బెల్లింగ్‌హామ్, కెప్టెన్ హ్యారీ కేన్ చెరో 6 గోల్స్ సాధించారు. ఈ ఓటమితో నార్వే జట్టు ప్రపంచకప్ ప్రస్థానం ముగిసింది.

ఇక ఇంగ్లాండ్ జట్టు జులై 15న అట్లాంటా స్టేడియంలో జరగబోయే హైవోల్టేజ్ సెమీఫైనల్ మ్యాచ్‌లో అర్జెంటీనాతో తలపడనుంది.

# లార్డ్స్ టెస్ట్‌లో గెలుపు దిశగా భారత్ ఉమన్స్



ఇంగ్లాండ్‌ను కుప్పకూల్చిన క్రాంతి

**లండన్, జులై 12:** లార్డ్స్‌లో జరుగుతున్న చారిత్రక టెస్ట్‌లో టీమిండియా అమ్మాయిలు పట్టు బిగించారు. బ్యాటింగ్‌లో, బౌలింగ్‌లో రాణిస్తూ గెలుపు దిశగా దూసుకుపోతున్నారు. మూడో రోజు ఆటముగిసే సరికి ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 130 రన్స్ చేయాలి. ఇంగ్లాండ్ గెలుపొందాలంటే 327 రన్స్ చేయాల్సి ఉంటుంది. భారత్ గెలుపుకు నాలుగు వికెట్లు పడగొడితే చాలు.

మూడో రోజు ఆటలోనే టీమిండియా అమ్మాయిలు జోరు చూపారు. ఒక వికెట్ నష్టానికి 154 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్... ఏడు వికెట్లకు 341 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఫస్ట్‌డౌన్ బ్యాట్స్‌విమెన్ యాష్టికా భాటియా సెంచరీతో మెరిసింది. 158 బంతుల్లో 14 ఫోర్లతో 113 పరుగులు సాధించింది. భాటియాకు టెస్ట్‌ల్లో ఇది తొలి సెంచరీ. లోయర్ ఆర్డర్‌లో రిచా ఘోష్(52 బంతుల్లో 50) మెరుపులు మెరిపించింది. అర్ధసెంచరీతో అజేయంగా నిలిచింది.

457 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఇంగ్లాండ్‌ను క్రాంతి మరోసారి దెబ్బతీసింది. ఆమెకు తోడుగా సయాలి, స్నేహ రాణా కూడా రెండేసి వికెట్లతో రాణించడంతో ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబడింది. ఓపెనర్లు బౌచెర్, టామీ సింగిల్ డిజిట్‌కు అవుట్ కాగా... అమీ జోన్స్ 52 పరుగులతో అజేయంగా నిలిచింది. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 130 రన్స్‌తో ఓటమి దిశలో కొనసాగుతోంది. మధ్యప్రదేశ్‌కు చెందిన క్రాంతి తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు... ఇప్పటివరకు మొత్తం ఏడు వికెట్లు పడగొట్టింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 285 రన్స్ చేయగా, ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 170 రన్స్‌కు ఆలౌటైంది.

# ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కు రెండు మార్పులతో టీమిండియా

**ముంబై, జులై 12:** ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్, జింబాబ్వేతో టీ20 సిరీస్‌ను టీమ్‌ఇండియాలో బీసీసీఐ రెండు మార్పులు చేసింది. గాయపడ్డ హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి స్థానంలో ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్‌కు అవకాశం కల్పించింది. ప్రస్తుతం ఈ ఇద్దరు ఇంగ్లాండ్‌లోనే టీ20 జట్టుతో ఉన్నారు. ఇంగ్లాండ్‌తో వన్డేలకు ప్రిన్స్ యాదవ్.. జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు స్క్వాడ్ లోకి రవి బిష్ణోయ్ వచ్చారు. ఇంగ్లాండ్‌తో మూడో టీ20 సందర్భంగా హర్షిత్ రాణా కుడి తొడ కండరం సమస్యతో బాధపడ్డాడు. అలాగే వరుణ్ చక్రవర్తి కూడా గాయంతో ఔటయ్యాడు.

మంగళవారం నుంచి ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్ మొదలుకానుంది. తొలి వన్డే జులై 14న ఎడ్జ్‌బాస్టన్‌లో, రెండో వన్డే జులై 16న సోఫియా గార్డెన్స్‌లో, మూడో వన్డే19న లార్డ్‌లో జరగనుంది. ఆ తర్వాత టీమిండియా జింబాబ్వేలో పర్యటిస్తుది. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్ ఆడనుది. జులై 23న తొలి టీ20, 25న రెండో టీ20, 26న మూడో టీ20 జరగనుంది. ఈ మ్యాచ్‌లన్నీన హరారే వేదికగా జరుగుతాయి.

స్కాట్లాండ్, ఇంగ్లాండ్‌లతో టీ20 సిరీస్‌లను కోల్పోయిన టీమిండియా.. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలో వన్డేలకు సిద్ధమైంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి జట్టులో చేరడంతో టీమిడియా బ్యాటింగ్‌లో పటిష్టంగా మారనుంది.

# విదేశీ పెట్టుబడుల జోరు: భారత్‌కు 7బిలియన్ డాలర్ల ఎఫ్‌ఐఐ నిధులు




**న్యూఢిల్లీ, జులై 12:** విదేశీ పెట్టుబడులను ప్రోత్సహిస్తూ, భారత్ రూపాయి మరింత బలపడే విధంగా రిజర్వుబ్యాంకు చేపట్టిన కార్యాచరణ వల్ల భారత్‌కు ఇప్పటివరకు 7 బిలియన్ డాలర్ల విదేశీ సంస్థాగత పెట్టుబడులు వచ్చినట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ వెల్లడించింది. ఈ ఏడాది మే 20న అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.96.8 వద్ద కనిష్ఠ స్థాయికి చేరగా, జూన్ నెలాఖరు నాటికి దాదాపు 2.2 శాతం మేర పుంజుకుని రూపాయి బలపడింది. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలకారణంగా ముడిచమురు ధరలు పెరగడంతో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, రూపాయికి మద్దతు కల్పించడం లక్ష్యంగా గత నెల కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి.

ఇందులో సావరిన్ బాండ్లపై ఎఫ్‌ఐఐలు, ఎఫ్‌పీఐలకు పన్ను మినహాయింపు, ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లకు హెడ్జింగ్ వ్యయంపై సబ్సిడీ, ప్రభుత్వ రంగ సంస్థల రుణాల కోసం రాయితీ డాలర్ స్వాప్ విండో వంటి చర్యలు ఉన్నాయి. తాజా భౌగోళిక రాజకీయ పరిణామాలు మరోసారి రూపాయిపై ఒత్తిడిని పెంచాయి. అమెరికా అధ్యక్షుడు అమెరికాఇరాన్ కాల్పుల విరమణ ముగిసినట్లు ప్రకటించడంతో బ్రెంట్ క్రూడ్ ధరలు మళ్లీ పెరగగా, రూపాయి విలువ కూడా 0.4 శాతం మేర క్షీణించింది. భారత ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక దృక్పథం సానుకూలంగానే ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ అభిప్రాయపడింది.

సగటు ముడిచమురు ధర బ్యారెల్‌కు 80 డాలర్లలోపు ఉండే అవకాశముండటంతో, గతంలో చమురు ధరలు బ్యారెల్‌కు 130 డాలర్లు దాటినప్పుడు చేసిన అంచనాలతో పోలిస్తే, దేశానికి చమురు దిగుమతి బిల్లులో 30 నుంచి 35 బిలియన్ డాలర్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలా ఉండగా, జూన్ 30తో ముగిసిన పక్షంలో బ్యాంకింగ్ వ్యవస్థలో డిపాజిట్లు సుమారు రూ.7 లక్షల కోట్లు పెరిగాయి. గత 29 ఏళ్లలో ఇది మూడో అతిపెద్ద పక్షవారపు వృద్ధిగా ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ప్రధానంగా ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లు, పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు, బాహ్య వాణిజ్య రుణాలు (నిదితీలు) కారణమని, మొత్తం పెట్టుబడుల రాక సుమారు 15 బిలియన్ డాలర్లుగా అంచనా వేసింది. ఆర్‌బీఐ విదేశీ మారక నిల్వలు 4.4 బిలియన్ డాలర్లు పెరిగాయి. జూన్ నెలలో సీపీ జారీలు గత 55 నెలల్లో అత్యధిక స్థాయికి చేరగా, తొలి త్రైమాసికంలో బ్యాంకుల అదనపు రుణాల పరిమాణం రూ.5.6 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.2.4లక్షల కోట్లు మాత్రమే ఉంది. అధిక స్థాయిలో కమర్షియల్ పేపర్లు జారీ చేసిన రంగాల్లోనే బ్యాంకు రుణాల వృద్ధి కూడా బలంగా నమోదైందని ఎస్‌బీఐ రీసెర్చ్ తెలిపింది. ముఖ్యంగా జూన్ 30తో ముగిసిన పక్షంలో రికార్డు స్థాయిలో రూ.7 లక్షల కోట్ల డిపాజిట్లు పెరగడం వల్ల బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత సౌకర్యవంతంగా మారుతుందనిఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది.

# రెండు కంపెనీల్లో నారాయణమూర్తి వాటా



**బెంగళూరు, జులై 12:** ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి చెందిన క్యాటమరన్ వెంచర్స్ తాజాగా మరో రెండు కంపెనీల్లో పెట్టుబడి పెట్టింది. ఇందులో టీడీ పవర్ సిస్టమ్స్, వర్ధమాన్ స్పెషల్ స్టీల్స్ కంపెనీలు ఉన్నాయి. టీడీ పవర్ సిస్టమ్స్‌లో 1.46శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకు గానూ రూ.262 కోట్ల పెట్టుబడి పెట్టింది. వర్ధమాన్ స్పెషల్ స్టీల్స్‌లో 1.02శాతం వాటాను రూ.28 కోట్లతో కొనుగోలుచేసింది. టీడీ పవర్ సిస్టమ్స్ 1999లో స్థాపించారు. ఇది బెంగళూరుకు చెందిన ఏసీ జనరేటర్లు, ఎలక్ట్రిక్ మోటార్ల తయారీ కంపెనీ. కంపెనీలో తయారు చేసిన యంత్రాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టీమ్, గ్యాస్, హైడ్రో, విండ్, డీజిల్ పవర్ ప్లాంట్లలో వాడుతున్నారు. 17,969 కోట్ల మార్కెట్ క్యాప్‌తో ఈ కంపెనీ 100కు పైగా దేశాలకు ఎగుమతి యంత్రాలను చేస్తుంది. రూ.1000 కోట్ల రిజర్వు నిధి ఉంది. 2026 ఆర్థిక సంవత్సరంలో అమ్మకాలు దాదాపు 45 శాతం పెరిగాయి. నికర లాభం రూ. 239 కోట్లకు పెరిగింది. మార్జిన్లు కూడా డబుల్ డిజిట్ చేరుకున్నాయి. ప్రస్తుతం మార్జిన్లు 18 శాతానికి పెరిగాయి. ఈక్విటీపై రాబడి 25 శాతానికి దగ్గరలో ఉంది. కొత్త విద్యుత్ ప్రాజెక్టులు, ఉక్కు పరిశ్రమ, విస్తృత ఫ్యాక్టరీ నిర్మాణ కారణంగా పెద్ద జనరేటర్లకు బలమైన డిమాండ్ వచ్చింది. గత సంవత్సరంలో ఈ స్టాక్ విలువ రెట్టింపు కంటే ఎక్కువ పెరిగింది. 2021 జూలైలో టీడీ పవర్ షేరు ధర దాదాపు రూ. 40 ఉండగా అది 2026 జులై 10 నాటికి అది రూ. 1,150కి చేరింది. అంటే 5 సంవత్సరాలలో ఇది 2,775 పెరిగింది. ప్రస్తుతం పీఈ రేషియో 75 గా ఉంది.

# టాప్-4 కంపెనీల్లో 93వేల కోట్ల ఎంక్యాప్ పెరుగుదల



**ముంబై, జులై 12:** దేశంలోని అత్యధిక మార్కెట్ విలువ కలిగిన టాప్ 10 కంపెనీల్లో నాలుగు సంస్థల మూలధన మార్కెట్ విలువలు గత వారం రూ.92,995.48 కోట్లు పెరిగాయి. ఇందులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరియు భారతి ఎయిర్‌టెల్ అత్యధిక లాభాలు నమోదు చేసి అగ్రస్థానంలో నిలిచాయి. గత వారం టాప్-10 కంపెనీల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఎల్ఐసీ మార్కెట్ విలువలు పెరగగా, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్అండ్‌టీ), హిందుస్తాన్ యూనిలీవర్ సంస్థల మార్కెట్ విలువ కలిపి రూ.49,294.13 కోట్లు తగ్గింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.35,808.09 కోట్లు పెరిగి రూ.12,69,454.42 కోట్లకు చేరగా, ఇది టాప్10 కంపెనీల్లో అత్యధిక పెరుగుదలగా నిలిచింది. భారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ.34,896.92 కోట్లు పెరిగి రూ.11,98,774.22 కోట్లకు చేరింది. ఎల్ఐసీ మార్కెట్ విలువ 16,065.50కోట్లు పెరిగి రూ.5,60,205.05 కోట్లకు చేరగా, రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.6,224.97 కోట్లు పెరిగి రూ.17,71,206.33 కోట్లకు చేరుకుంది.

మరోవైపు, హిందుస్తాన్ యూనిలీవర్ మార్కెట్ విలువ రూ.12,088.65 కోట్లు తగ్గి రూ.5,04,997.65 కోట్లకు పడిపోయింది. లార్సెన్ అండ్ టుబ్రో మార్కెట్ విలువ 11,040.23కోట్లు క్షీణించి రూ.5,42,938.40 కోట్లకు చేరగా, టీసీఎస్ మార్కెట్ విలువ రూ.8,574.87 కోట్లు తగ్గి రూ.7,48,600.40 కోట్లకు చేరింది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ విలువ రూ.7,813.58 కోట్లు తగ్గి రూ.6,35,327.78 కోట్లకు చేరింది. ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ 6,315.32 కోట్లు తగ్గి రూ.10,05,379.71 కోట్లకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్కెట్ విలువ రూ.3,461.48 కోట్లు తగ్గి రూ.9,56,430.44 కోట్లకు పరిమితమైంది. మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానాన్ని కొనసాగించగా, ఆ తర్వాత వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, ఎల్ఐసీ, లార్సెన్ అండ్ టుబ్రో, హిందుస్తాన్ యూనిలీవర్ సంస్థలు నిలిచాయి.

# బ్యాంకుల్లో 265 లక్షల కోట్ల డిపాజిట్లు




**ముంబయి, జులై 12:** దేశంలోని వాణిజ్య బ్యాంకుల్లో ఉన్న మొత్తం డిపాజిట్లు రూ.265.4 లక్షల కోట్లకు పెరిగాయి. టైమ్ డిపాజిట్లు, టర్మ్ డిపాజిట్లు రెండింటిలోనూ పెరుగుదల నమోదు చేసింది. గత రెండు వారాల వ్యవధిలోనే వ్యవస్థలో సుమారు రూ. 7 లక్షల కోట్లు మేర పెరుగుదల నమోదైంది. ఈ తాజా పెరుగుదలతో 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికానికి డిపాజిట్ల వృద్ధి రేటు 13.3 కి పెరిగింది. 29 ఏళ్లలో ఇది మూడో అత్యధిక వృద్ధి. ఇది ఏడాది క్రితం 10.1 శాతంగా ఉంది. రెండు వారాల వ్యవధిలో ఈ పెరుగుదల ఉన్నప్పటికీ డిపాజిట్ల వృద్ధి రేటు రుణాల వృద్ధి రేటు కంటే తక్కువగా ఉంది. గతనెలాఖరునాటికి బ్యాంక్ రుణాలు రూ. 219.3 లక్షల కోట్లుగా ఉన్నాయి.

ఈ రెండు వారాల కాలంలో రుణాలు రూ. 3.8 లక్షల కోట్లకు పెరిగాయి. వార్షికంగా రుణాల వృద్ధి రేటు 18.6 శాతంగా నమోదు అయింది. మొదటి మూడు నెలల్లో నమోదైన వృద్ధి ఆ రెండు వారాల వృద్ధి కంటే తక్కువగా ఉంది. విదేశీ నిధుల రాబట్టడానికి, రూపాయి విలువను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో భారత్ కు 7 బిలియన్ డాలర్ల విదేశీ సంస్థాగత పెట్టుబడులు వచ్చాయిని ఎస్బీఐ చీఫ్ ఎకనామిస్ట్ సౌమ్య కాంతి ఘోష్ తెలిపారు. ఆ సంఖ్య 15 బిలియన్ డాలర్లుగా ఉండవచ్చని తెలుస్తోంది. డిపాజిట్ల వృద్ధి కంటే రుణాల వృద్ధి ఎక్కువగా కొనసాగుతుండటంతో ప్రధానంగా ప్రభుత్వ సెక్యూరిటీలలో ఉండే తమ పెట్టుబడుల విషయంలో బ్యాంకులు నెమ్మదిగా వ్యవహరిస్తున్నాయి. మొదటి త్రైమాసికం ముగిసే సమయానికి బ్యాంకుల పెట్టుబడులు రూ. 70.9 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

ఇక డెట్ ఎఫ్ఏఆర్ నిధుల విలువలు 2.7 బిలియన్ డాలర్లకు పెరిగింది. గత ఏడాది రూ.2.4 లక్షల కోట్లుగా ఉన్న బ్యాంక్ క్రెడిట్ ఈ ఏడాది 5.6 లక్షల కోట్లకు పెరిగింది. ఈ భారీ డిపాజిట్ల వల్ల బ్యాంకుల్లో లిక్విడిటీ మరింత మెరుగయ్యే అవకాశం ఉంది. బ్యాంకులు ఎక్కువగా హోం లోన్, బంగారంపై లోన్లు ఇస్తున్నాయి. దేశంలో బంగారంపై రుణాలు క్రమంగా పెరుగుతున్నాయి. బంగారం ధర పెరుగడం కూడా ఇందుకు కారణంగా చెబుతున్నారు. 2026 ఆర్థిక సంవత్సరంలో బంగారం రుణాలు దాదాపు 84 శాతం పెరిగాయి. బంగారం ధర పెరగడం వల్ల రుణం కూడా ఎక్కువ వస్తున్న తరుణంలో చాలా మంది బంగారం తాకట్టు పెట్టి లోన్లు తీసుకుంటున్నారు.

# ఐదేళ్లకే పెన్నీస్టాక్ క్యూపిడ్ షేర్ అనూహ్య రాబడి

**ముంబయి, జులై 12:** ఐదేళ్ల క్రితం కేవలం ఒక సాధారణ పెన్నీ స్టాక్స్‌గా ఉన్న హెల్త్ కేర్ ప్రొడక్ట్స్ కంపెనీ క్యూపిడ్ షేర్లు ఇపుడు దూసుకెళుతున్నాయి. మార్కెట్లో ఒడుదొడుకులు ఉన్నా ఈ స్మాల్ క్యాప్ స్టాక్ తన ఇన్వెస్టర్లకు లాభాలు కురిపించింది. లక్ష రూపాయల పెట్టుబడి ఐదేళ్లలోనే రూ. 87 లక్షలు చేసింది. ఐదేళ్లక్రితం ఎన్ఎస్ఈలో ఈ స్టాక్ కేవలం రూ.2.45స్థాయిలో ట్రేడయింది. ప్రస్తుతం క్యూపిడ్ లిమిటెడ్ షేరు ధర రూ.213 స్థాయికి చేరుకుంది. గత 5 సంవత్సరాల కాలంలో ఈ స్టాక్ ఏకంగా 8600 శాతం పైగా అద్భుతమైన వృద్ధిని నమోదు చేసింది. ఎవరైనా ఒక ఇన్వెస్టర్ ఐదేళ్ల క్రితం ఈ షేరుపై రూ.1 లక్ష ఇన్వెస్ట్ చేసి అలాగే ఉంచుకుని ఉంటే నేడు దాని విలువ ఏకగా రూ. 87 లక్షలకు చేరి ఉంటుంది. కేవలం ఏడాది క్రితం పెట్టిన రూ.1 లక్ష విలువ కూడా ఇప్పుడు రూ. 8.40 లక్షలుగా మారడం గమనార్హం. కంపెనీ త్వరలోనే ప్రకటించబోయే తొలిత్రైమాసిక ఆదాయం రికార్డ్ స్థాయిలో రూ.150 కోట్లు దాటుతుందని అంచనా. పూర్తి ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ గైడెన్స్ 10 శాతం నుంచి రూ. 660 కోట్లుగా కంపెనీ మేనేజ్మెంట్ సవరించింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వ టెండర్లు, హెల్త్ కేర్ ప్రొక్యూర్మెంట్ సంస్థలతో కుదుర్చుకున్న వ్యూహాత్మక ఒప్పందాలు కంపెనీ ఆర్డర్ బుక్ ను బలోపేతం చేశాయి. క్యూపిడ్ లిమిటెడ్ షేరు ధర చివరి ట్రేడింగ్ సెషన్లో 1.41 శాతం లాభంతో ముగిసిం

# వారాంతంలో స్వల్ప నష్టాలతో ముగిసిన సూచీలు



**ముంబై, జులై 12:** భారతీయ స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగు వారాల లాభాల పరంపరకు ముగింపు పలికిన నేపథ్యంలో, వచ్చే వారం మార్కెట్ దిశను నిర్ణయించే కీలక అంశాలపై పెట్టుబడిదారులు దృష్టి సారించారు. తొలి త్రైమాసికం కంపెనీల ఆర్థిక ఫలితాలు, అంతర్జాతీయ ముడి చమురుధరల కదలికలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నిధులరాక, పశ్చిమాసియా పరిణామాలు మార్కెట్‌ను ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా నిలవనున్నాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తపరిస్థితులు నెలకొనడం, ముడి చమురు ధరలు పెరగడం వల్ల పెట్టుబడిదారుల సెంటిమెంట్ దెబ్బతినడంతో బెంచ్‌మార్క్ సూచీలు వారాంతంలో స్వల్ప నష్టాలతో ముగిశాయి. వారంలోని చివరి రెండు ట్రేడింగ్ సెషన్లలో ప్రపంచ మార్కెట్ల ఆందోళనలు కొంత తగ్గడం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అంచనాలకు మించిన ఆర్థిక ఫలితాలు ప్రకటించడం వల్ల మార్కెట్ బలంగా కోలుకుని నష్టాలను గణనీయంగా తగ్గించుకుంది. వారాంతానికి బీఎస్ఈ సెన్సెక్స్ 0.25 శాతం క్షీణించి 77,569.39 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 0.26 శాతం తగ్గి 24,206.90 వద్ద స్థిరపడింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కోటి ఒక శాతానికి పైగా లాభపడడం గమనార్హం. జూన్ త్రైమాసిక ఫలితాల సీజన్ టీసీఎస్ మెరుగైన ఫలితాలతో సానుకూలంగా ప్రారంభమైన నేపథ్యంలో, వచ్చే రోజుల్లో ప్రధాన కంపెనీలు ప్రకటించే ఆర్థిక ఫలితాలపై ట్రేడర్ల దృష్టి కేంద్రీకృతం కానుంది. ఈ ఫలితాలే ఈవారంలో మార్కెట్ దిశను నిర్దేశిస్తాయని నిపుణుల అంచనా. అమెరికా తాజాగా ఇరాన్‌పై జరిపినదాడులతోప్రాంతీయ స్థిరత్వంపై, ప్రపంచ ఇంధనసరఫరాలపై ఆందోళనలు మళ్లీపెరిగాయి. ఉద్రిక్తతలు మరింత పెరిగినా, తగ్గినా ప్రపంచ మార్కెట్లలో పెట్టుబడిదారుల రిస్క్ తీసుకునే ధోరణిపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉంది. మరోవైపు అంతర్జాతీయ ముడి చమురు ధరల కదలికలు కూడా అత్యంత కీలకంగా మారనున్నాయి. భారత్ ముడి చమురును అధికంగా దిగుమతి చేసుకునే దేశం కావడంతో లాభదాయకతపై కూడా ప్రతికూల ప్రభావం పడనుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.